# ప్రస్తుత భూ సమస్యలు

## హైదరాబాద్ సంస్థానము

రచన :

## వ్యవసాయదారుల సంఘము

హైదరాబాద్ సంస్థానము

తొలిపలుకు :

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు, ఎమ్.ఎ. (క్యాన్టబ్), డి. లిట్.

(ప్రొఛాన్సెలర్, మైసూరు విశ్వవిద్యాలయము)

వెల రూ 1-8-0

ఈ పుస్తకము ప్రతులు దొరకుచోటు:


ఎన్. వి. వరదారావు

870, గగన్‌మహల్ రోడ్

హైదరాబాద్ (దక్కన్)



హైదరాబాద్ సంస్థాన వ్యవసాయదారుల సంఘముచే

ప్రచురింపబడినది

శ్రీ వాణీ ముద్రణాలయము, హైదరాబాదులో ముద్రితము

# తొలిపలుకు

గ్రామీణ సమస్యలు, అందులో ప్రత్యేకముగా వ్యవసాయ ఉత్పత్తి సమస్యలు సత్వరమే మన ప్రభుత్వము మరియు ప్రజల దృష్టి నాకర్షించవలెను. పశ్చిమదేశముల నినాదములను, సాధనోపాయములను అనాలోచితముగా అనుకరణముచేయు అపాయమున్నది. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమస్యలను ఆవిధముగా పరిష్కారము చేయుటకు విలులేదు. సోవియట్ రిపబ్లిక్‌లు అనుసరించిన విధానమువలె తగిన మార్పులు చేయక త్వరపడి భూపంపకము, సమష్టివిధానము అనుసరించినయెడల అశాంతి మరియు కల్లోలము సులభముగా కలిగించవచ్చును.

ఈ చిన్నపుస్తకములో వ్యవసాయానుభవముగల వ్యక్తులు తత్సంబంధ సమస్యలను సాధ్యమైనంత త్వరగాను శాంతియుతముగాను పరిష్కారము చేయుటకు ఆచరణయోగ్యముగా చర్చించుచున్నారు. వారి విధానము నిర్మాణాత్మకముగాను, విప్లవరహితముగానుండి అభ్యుదయముగాను ఉన్నది.

ఈ విధానమునుగూర్చి మన నాయకులు పరిపాలకులు గంభీరముగా ఆలోచించవలెనని నా అభిప్రాయము. వారు యీ చిన్నపుస్తకములో ప్రస్తుత క్లిష్టసమస్యల పరిష్కారమార్గము కనిపెట్టవచ్చును. ఆ మార్గము ననుసరించినచో అన్ని వర్గములవారికి లాభముకలిగి సాంఘిక స్థిరత్వము నిరాటంకమైన అభివృద్ధి కలుగవచ్చును.

సి. ఆర్. రెడ్డి

# విషయసూచిక


తొలిపలుకు, డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారు...............
ప్రవేశిక ... ... ... ... ... ...


## మొదటిభాగము — నివేదిక


| | పేజి |
|---|---|
| 1. కౌలు | 1 |
| 2. వ్యక్తిగత వ్యవసాయ గరిష్ట భూపరిమాణము | 3 |
| 3. నీటిపారుదల | 13 |
| 4. వ్యవసాయధరల నిర్ణయము; విక్రయ సౌకర్యాలు; సబ్సిడీలు | 16 |
| 5. సమష్టి మరియు సహకార వ్యవసాయము | 19 |
| 6. వ్యవసాయకూలీలు | 23 |


## రెండవభాగము — భూసంస్కరణలసమితి ప్రశ్నావళి; దాని ప్రత్యుత్తరములు


| | |
|---|---|
| ప్రశ్నావళి (సమితి హద్దులు, కర్తవ్యము) | 27 |
| ప్రశ్నలు : జవాబులు | 31 |


అనుబంధము:—


కొన్ని వ్యవసాయముల సగటు పంట, వ్యవసాయవ్యయములు ... ...
ప్రస్తుతధరల ననుసరించి వివిధపంటలకు పై వ్యవసాయములో ఎకరముఒక్కంటికి నికరవుపంట ... ...

# ప్రవేశిక

వ్యవసాయము చిరకాలమునుండి భారత ఆర్థిక వ్యవస్థయొక్క మూలాధారముగా నుండెను. ఇకముందుగూడా అట్లే యుండగలదు. జనాభాలో ప్రతిశతి 75 మంది ఏదో ఒకవిధముగా యీ వృత్తిలో నిమగ్నులై యున్నారు. సంఘముయొక్క ఆర్థిక స్థిరత్వము దాని అభివృద్ధిపై ఆధారపడియుండుట స్పష్టముగా నున్నది. కాని మన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ పురాతన పద్ధతులలో కుల్లిపోవుచు, తీవ్రజాడ్యములచే బాధపడుచు హీనదశలో నున్నమాట వాస్తవము. ఉత్పత్తి చాలా తక్కువగానున్నది. రైతులు చావుబ్రతుకులలోనుండి యింకనూ అధికదరిద్రు లగుచున్నారు. వారి వైరాగ్యమే వారివృత్తికి అంటుకొని యుండునట్లు చేయుచున్నది. మనదేశములో అధికసంఖ్యాకులు వ్యవసాయవృత్తిలో నిమగ్నులై యున్నను మనము తీవ్ర ఆహారకొరత నెదుర్కొనుచు మన సంపూర్ణ ఆర్థికవ్యవస్థ తల్లక్రిందులగు పరిస్థితిలోనుండుట గమనింపదగిన విషయము. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారిట్లు సెలవిచ్చిరి:—"భారతదేశములో ప్రతిశతి సుమారు 70 మంది ప్రజలు వ్యవసాయదారులైనను మనము మన ఆహార ధాన్యములకొరకు విదేశములపై ఆధారపడవలసి వచ్చు చున్నది. అమెరికాలో ప్రతిశతి 13 మంది మాత్రమే వ్యవసాయదారులై యుండి, వారు ప్రపంచ అవసరములలో నూటికి 60 పాళ్లు ఉత్పత్తి చేయు గలుగుచున్నారు."

ఈ పరిస్థితి మనప్రభుత్వము యీ ప్రధాన పరిశ్రమపట్ల అవలంబించుచున్న విధానమును వెల్లడించుచున్నది. ప్రభుత్వము మరియు ప్రజలు వ్యవసాయపద్ధతులు మార్చి వ్యవసాయమునకు నూతనజీవనము కల్పించవలసి యున్నది. ఈ సమస్య అతి విశాలమై అనేకచిక్కులలో గూడుకొనియున్నది. ఈ సమస్యా పరిష్కారమునకు ధైర్యము దూరదృష్టి కనబరచి వ్యవసాయమునకు సంబంధించిన అన్ని విషయములను యెదుర్కొనుటకు ఒక ప్రణాళికవేసి పురోగమించనిచో యెట్టిఫలితములు కలుగవు. క్రొత్తగాపుట్టిన ఆశయములపై ఆధారపడు ప్రణాళికలు ఎంత ఆకర్ష

నీయమైనవిగా నున్నను, వాని ఆచరణయోగ్యతను పరిశీలించకుండా ప్రారంభించుటవలన ఉత్పత్తి క్షీణించి వ్యవసాయ ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నము కాగలదని మేము యీ సందర్భములో యెక్కువగా నొక్కి చెప్పజాలము. మన ఆర్థికవిధానములు విప్లవాత్మకమైన ఆశయములవైపు పురోగమించుచున్నవి. ఆశయపూరితమైన ఉత్సాహమునకు అనుభవజ్ఞానము, చరిత్రపాఠమును జతపరచనియెడల దేశము హింసాయుత విప్లవగుండములో పడిపోవునని మేము యీ సందర్భములో చెప్పక తప్పదు. నేటి ముఖ్యావసరము భూ పంపకముకాదు. మనకు కావలసినది అధికోత్పత్తి.

ఈ చిన్నపుస్తకములో మేము వ్యవసాయమునకు సంబంధించిన కొన్ని ఊహాలు సూచించి సమస్యా పరిష్కారమునకు సాధ్యమైన మార్గములు తెలిపియున్నాము. ఇందులో చేయబడిన సూచనలను వెంటనే అమలుపరచ వలసిందని ప్రభుత్వమునకు సిఫారసు చేయుచున్నాము. మొదటిభాగములో కొన్ని ప్రస్తుత భూ సమస్యలు చర్చించబడినవి. రెండవభాగములో హైదరాబాద్ ప్రభుత్వ భూసంస్కరణల సమితివారు జారీచేసిన ప్రశ్నావళి, దాని ప్రత్యుత్తరములు చేరియున్నవి.

25 ఆగష్టు 1949
హైదరాబాద్ (దక్కన్)

వ్యవసాయదారుల సంఘము
హైదరాబాద్ సంస్థానము

# మొదటి భాగము

## నివేదిక

# 1. కౌలు

కౌలు సమస్యను సరిగా యెదుర్కొననిచో యితరత్రా ఉత్తమమైన భూసంస్కరణలుగూడా కార్యరూపాన్ని దాల్చజాలవు. స్వయముగా సేద్యము చేయనివారు భూస్వాములుగా నుండు విధానమువలన వ్యవసాయమునకు తీరనినష్టము కలిగినది. ఉత్పత్తిలో ఆటంకములు కలుగుట, భూస్వాములు మరియు కౌలుదార్లమధ్య తగాదాలు యేర్పడుట దీని పర్యవసానములే. కౌలుషరతులలో యెన్నిమార్పులు ప్రవేశపెట్టినను, యేరూపములోనున్న కౌలువిధానమైనను వ్యవసాయ నిపుణత్వమును తగ్గించవని చెప్పుటకు వీలులేదు. అధికకౌలురేట్లు మరియు కౌలుదార్లకు రక్షణ లేకపోవుట అధికోత్పత్తికి ఆటంకములే యైనను భూమి తమది కాదని కౌలుదార్లలో నుండు భావము ముఖ్యఆటంకము. ఇట్టిభావము తొలగింపబడినచో కౌలుదారుడు తనవృత్తిలో అధికాసక్తితో నిమగ్నుడగును. భూసంబంధమైన అసంతృప్తి వ్యాపించియున్న యీ రోజులలో కౌలువిధానాన్ని యేరూపములోనైనా స్థిరముగా నుంచినచో, నీతి నియమాలులేని రాజకీయ విప్లవకారులు దీనిని ఊతగా గైకొని వర్గవిద్వేషాలు ప్రజ్వలింపజేసెదరని చెప్పుట అసందర్భముకాదు. భూస్వామ్యమును మార్చుట వదలి యెట్టిసంస్కరణలు చేసినను ఉత్పత్తి అధికముకాజాలదు. కౌలుదార్ల పరిస్థితులలో అధికమార్పులు రావు. అందుచే కౌలువిధానాన్ని నిర్మూలించు శాసనము ప్రవేశపెట్టి భూస్వాములకు న్యాయసమ్మతమైన పరిహారము యిచ్చుట ప్రస్తుత పరిస్థితులలో అత్యవసరము.

ఎంత పరిహారము యిచ్చుట, యేవిధముగా నిచ్చుట అను విషయాలు నిర్ణయించుటకు ఒక ప్రణాళిక సిద్ధము చేయవచ్చును. కమిటీ వారికి మేము దిగువస్కీము సిఫారసు చేయుచున్నాము:—

ఆసామీ షిక్మీచట్టములోనున్న ప్రకారము కౌలుదార్లను రెండు భాగములలోనికి విభజించవలెను; (అ) 'రక్షిత' కౌలుదార్లు, మరియు (ఆ) ఇతర కౌలుదార్లు. రక్షిత కౌలుదార్ల విషయములో భూస్వాములు బజారుధరలో ప్రతిశతి 25 వంతులు తీసివేయగా మిగిలిన మొత్తము

వెంటనే భూస్వాములకు చెల్లించవలెను. ప్రభుత్వ నిర్ణయానుసారము కొంత భాగము కౌలుదార్లు, కొంతభాగమును ప్రభుత్వము భరించవలెను. ప్రభుత్వము సబ్సిడీగానైనా యివ్వవచ్చును లేక ఒక ప్రభుత్వ సంస్థ ద్వారా అప్పుగానైనను లేక రెండువిధములుగాను యివ్వవచ్చును. ఇతర కౌలుదార్ల విషయములో వారికి తక్కువసౌకర్యములు కలిగింపవచ్చును.

వ్యవసాయదారులను పునఃస్థాపించుటకు ప్రభుత్వ సహాయము అవసరము. ప్రపంచమంతటా ప్రభుత్వ సహాయముద్వారా వ్యవసాయము అభివృద్ధిగాంచినది. ఇట్టిసహాయము లేనిచో గ్రామీణ ఆర్థికవ్యవస్థ కి మెటీలు దాటి కార్యరూపాన్ని దాల్చదు.

కౌలువిధానాన్ని నిర్మూలించు శాసనములో కొన్ని మినహాయింపులుమాత్ర ముండవలెను. విధవలు, వికలాంగులు, చిన్నవయస్కులు (మైనర్లు), మత మరియు ధార్మికసంస్థలు యిట్టి శాసనమునకు బద్ధులుగా లేకుండునట్లు మినహాయించవలసి యుండును.

# 2. వ్యక్తిగత వ్యవసాయ గరిష్ట భూప్రమాణము

వ్యక్తిగత గరిష్ట ఆదాయము నిర్ణయించక, "ఆర్థిక ప్రమాణము నకు" కొన్ని రెట్లుగాగాని, మరియే విధముగాగాని వ్యక్తిగత వ్యవసాయ గరిష్ట భూప్రమాణమును నిర్ణయించుటకు ప్రయత్నించుట సమంజసము కాదు. ఇట్టి హద్దును నిర్ణయించునపుడు వ్యవసాయ నైపుణ్యము మరియు ఉత్పత్తి ప్రత్యేకముగా దృష్టిలో నుండవలెను. నైపుణ్యమును దృష్టియం దుంచుకొని ఒకవ్యక్తి సొంతసేద్యము చేయగలుగు భూవిస్తీర్ణమును గరిష్ట ప్రమాణముగా నుండునట్లుచేయుట న్యాయసమ్మతముగా నుండును. ఇట్టి నిర్ణయము అధికోత్పత్తికి తోడ్పడును. మేము సూచించినప్రకారము కౌలువిధానమును రద్దుపరచినచో అధికసంఖ్యాకులైన కౌలుదార్లు భూ స్వామ్య విధానమునుండి విముక్తి బడసెదరు. భూమి అంతయు సొంత సేద్యముక్రిందికి వచ్చును. అంతేగాక పెద్దభూస్వాములే తమ భూమిలో అధికభాగమును కౌలుకిచ్చువారుగాన పెద్దభూస్వాముల క్రిందనుండు భూ విస్తీర్ణము స్వయముగా తగ్గిపోవును. వారి అధీనములోనున్న భూ విస్తీర్ణ ములో అధికభాగము తగ్గిపోవుటవలన వారు సామాన్యముగా సేద్యము చేయగలుగు భూమిమాత్రమే కలిగియుండెదరు. ప్రతినెలకు రెండుమూడు వేల రూపాయలకన్న మించిన ఆదాయముగల వ్యవసాయదారు లుండ బోరు. ఇంతకుమించి పెద్దవ్యవసాయములను అటంకపరచు గరిష్ట ప్రమా ణమును నిర్ణయించినచో ఆర్థికముగాను, సాంఘికముగాను, నైతికము గాను జవాబు చెప్పుటకు వీలుండదు.

## అ. ఆర్థికముగా అయోగ్యమైనది

ఈ సంస్థానములోని పెద్ద వ్యవసాయదారునికి అధిక పెట్టుబడిపెట్టు శక్తి మరియు వ్యవసాయముపై ప్రత్యేకాభిరుచి యుండుటవలన అతను మధ్యతరగతి మరియు చిన్న వ్యవసాయదారులకన్న అధికోత్పత్తి చేయు

నన్న విషయము నిర్వివాదాంశము. హైదరాబాద్ ప్రభుత్వ ఆహార సరఫరాశాఖా సభ్యులు శ్రీ పి. హెచ్. కృష్ణారావుగారు 1949 ఆగస్టు 18 వ తేదీన తమ రేడియో ఉపన్యాసంలో యీ విషయాన్ని అంగీకరించిరి:—

> "కూలీలు, పశువులు మరియు ఎరువునకు అధిక పెట్టుబడి పెట్టగలుగు భూస్వాములు, కొద్దిపాటి అవకాశాలుగల చిన్న భూస్వాములకన్న యెకరం ఒక్కంటికి నేడుకూడా అధిక ఉత్పత్తి చేయగలుగుచున్నారు.............కట్టునాగలితో అయిదారు ఎకరాలు దున్ని నామమాత్రపు జీవితము గడుపగలిగిన చిన్న రైతు దినములు నిస్సంశయముగా దాటిపోయినవి. ప్రస్తుతము మనము నూతనయంత్రములు వినియోగించి, సరియైన పెట్టుబడిపెట్టి, యోగ్యులైన నిపుణులను నియమించి వ్యవసాయము చేయవలసిన కాలములో నున్నాము. మనసొంత అవసరాలను తీర్చుకొనుటకు యిట్టి విధానమును అవలంబింపక తప్పదు."

పెద్దవ్యవసాయములు ఉత్తమమైన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులకు ఆదర్శములుగా నున్నవి. ఈ పెద్దవ్యవసాయదారులు నూతన మరియు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అమలులోబెట్టి, ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు, ఆయిల్ ఇంజన్లు, నీటిపంపులు మున్నగు నవీనయంత్రములు ఉపయోగించుట యందు మార్గదర్శులైనారు. వీరిపద్ధతులు భారతదేశ యితరప్రాంతాల లోని ఉత్తమ పద్ధతులలో వెనుదీయవు. అంతేగాక యీ పెద్ద వ్యవసాయ దారుల పద్ధతులు యితరులకు శిక్షణ యిచ్చుచు క్రమముగా పరిసరములలో వ్యవసాయపద్ధతులను మార్చుటకు తోడ్పడుచున్నవి. ఇట్టి పరిస్థితులలో సొంతముగా సేద్యము చేయబడుచున్న భూ విస్తీర్ణములను తగ్గించి కుత్రిమపరిమాణాలు ఆచరణలో బెట్టినచో విజ్ఞానవంతులు మరియు నేర్పరులైన యీ పెద్ద వ్యవసాయదారులు గ్రామములు విడిచిపోవుట సంభవించును. వారు గత్యంతరములేక యిట్టి హద్దులులేని వృత్తులలో ప్రవేశించెదరు. వారు పోయినచో వ్యవసాయమునకు తీరని నష్టము కలుగును.

సంస్థానములోని వ్యవసాయపు ఆర్థికవ్యవస్థ తల్లక్రిందులగును. చిన్న రైతుల పునాదులు గట్టిపడి వారు దేశములో యోగ్యరీతి నధికోత్పత్తి చేయుటకు సిద్ధము కాకముందే యీ పెద్ద వ్యవసాయదారులను దూరముచేయుటకు ప్రయత్నించుట పొరపాటగును. ప్రఖ్యాత ఆర్థికవేత్తలు పరిపాలకులతో గూడిన భారత గ్రామసమితివారు యేకగ్రీవముగా జేసిన సిఫారసు మా అభిప్రాయమును బలపరచుచున్నది. వారిట్లు తెలిపియున్నారు:—

> "ప్రభుత్వము వారు పెద్ద భూ విస్తీర్ణములను స్వాధీనపరచుకొని తిరిగి వానిని న్యాయసమ్మతమైన షరతులపై భూమిలేని రైతులకుగాని, చిన్న భూస్వాములకుగాని విక్రయించవలెనను సూచనను దిగువ కారణములవలన మేము అంగీకరించజాలము. ఇట్టి మార్పువలన వ్యవసాయ నైపుణ్యము అధికమగునని మేము ప్రశ్నమంలోనే విశ్వసింపజాలము. పెద్ద భూస్వాములు ఉత్తమ పద్ధతులద్వారా వ్యవసాయము చేయుటకును, అధికపెట్టుబడి పెట్టుటకును ప్రోద్బలము చేసినయెడల త్వరలోనే మంచిఫలితాలు కలుగవచ్చును. చిన్న భూ విస్తీర్ణములసంఖ్య పెరుగుటకుబదులు ఉత్పత్తి అధికమగును."

## ఆ. నైతికముగా సాకు చెప్పజాలనిది

ఈ వ్యవసాయ దారులుగాని వారి పూర్వీకులుగాని ప్రస్తుతం చక్కబరచవలసియున్న చరిత్రాత్మకమైన ఎట్టి నేరము చేయలేదు. వారు న్యాయముగాగాని, అన్యాయముగాగాని కర్షకులను తొలగించి యీ భూములను స్వాధీనపరచుకొనలేదు. వారు జమీందారులు లేక సొంతముగా సేద్యము చేయని భూస్వాములవలెనుండి వెట్టికార్యము నెరవేర్చని అసహాయ మధ్యవర్తులుకారు. వారు సొంతముగా తమ భూములను సేద్యముచేయుచు, తమ భూములపైగాని, పరిసరములలోగాని నివసించుచు, తమకాలమంతయు వ్యవసాయములోనే వినియోగించెడి అత్యు

త్త్రమ వ్యవసాయదారులు. వ్యవసాయముయొక్క అన్ని దశలయందును వారి వ్యక్తిత్వము కానవచ్చును. అవసర మేర్పడినపుడు వారు బరువైన పనులుగూడా చేయుటకు వెనుదీయరు. వారి పూర్వీకులు ఘనమైన పరిశ్రమచేసి, వ్యయపడి పెద్ద అడవులను నివాసయోగ్యము చేసుకొనిరి. పెద్ద చెరువులు త్రవ్వించి శిథిలావస్థలో నున్నవాటిని బాగుచేసిరి. గొప్ప విస్తీర్ణముగల బీళ్ళను వ్యవసాయయోగ్యము చేసిరి. తరతరాలనుండి వారీభూములను తమ శక్తిసామర్థ్యములను వినియోగించి అభివృద్ధిపరచిరి. ఈ భూములు వారి అస్తిత్వముతో లీనమైపోయినవి. సున్నితముగా చెప్పవలెనన్నయెడల వారు భూములకు జెందినవారు, భూములు వారికి జెందినవి. ఇట్టివ్యక్తులను వారి వ్యవసాయములనుండి నెట్టివేయుట నైతికముగా సాకు చెప్పజాలనివిషయము. సొంతసేద్యముక్రింద నున్న వారి భూ విస్తీర్ణములను తగ్గించినచో వారు నెట్టివేయబడెదరు.

## ఇ. సాంఘికముగా అసమ్మతమైనది

భూమిపైనున్న ప్రజాఒత్తిడిని తగ్గించుటకు పెద్ద వ్యవసాయదారులను తొలగించుటయే మార్గమని కొందరు ఆర్థిక వేత్తలు నొక్కిచెప్పిరి.

(అ) సంస్థానములో యీఒత్తిడిసమస్య పైకి కనబడునదేకాని నిజమైనదికాదని యీసమస్యను సూక్ష్మముగా పరిశీలించినచో తెలియగలదను విషయము మొదటిది. వ్యవసాయ యోగ్యమైన భూమి తక్కువగానున్న గ్రామాలలో యీ అధికజనాభా యుండుటవలన భూమిపై ఒత్తిడి అధికముగా నున్నట్లు కానవచ్చును. కాని వారికి పని కల్పించుటకు అనేక భూములను వ్యవసాయ యోగ్యముచేయు అవకాశమున్నట్లు గ్రహించరు. గ్రామస్థులు తమగ్రామాలలోనే నిలచిపోవుటకు ఆసక్తి గలిగియుండుట, భూమిని వ్యవసాయయోగ్యము చేయుటయందును యీభూములను సేద్యము చేయుటకు సౌకర్యాలు కలిగించుటయందును ప్రభుత్వ అశ్రద్ధవలన యీ ఒత్తిడి ఉన్నదానికన్న అత్యధికముగా కానవచ్చును.

ఈ సంస్థానములో వ్యవసాయ యోగ్యమైన భూములు మరియు బీళ్ళు కలసి ఒకకోటి ౧౬ లక్షల ఎకరాలున్నట్లు యిటీవలి సంఖ్యలవలన స్పష్టమగుచున్నది. శాస్త్రీయపరిశోధన జరిగినచో మరికొన్ని లక్షల ఎకరాలున్నట్లు తెలియగలదు. ప్రస్తుతమున్న నీటి పారుదల సౌకర్యాలను బాగుచేసి, క్రొత్తనీటి పారుదల సౌకర్యాలు కలిగించుటవలన నాలుగు లక్షల ఎకరాల భూమి వరిపైరుక్రిందికి రాగలదు. నీటి పారుదల సౌకర్యాలు అధికముచేసి, యీ లక్షల ఎకరాలు బీళ్ళను వ్యవసాయ యోగ్యముచేయు ప్రణాళికను తత్‌క్షణమే అమలులోపెట్టిన యెడల మనకున్న లక్షటన్నుల ఆహారధాన్యాల కొరత తీరుటయేగాక యీ సంస్థానము దక్షిణదేశమునకు గరిసెగా మారగలదు.

(ఆ) వ్యవసాయేతరవృత్తులలోనున్న వారనేకులు తమపూర్వవృత్తులను త్యజించి వ్యవసాయ వృత్తిలో ప్రవేశించుట రెండవ విషయము. భారతదేశములో వ్యవసాయ వృత్తిగల జనాభా ౧౮౮౧ లో నూటికి ౭౬ వుండెను. అది ౧౯౫౧ లో నూటికి ౮౫ గా మారినది. ౧౯౩౧ నాటి భారత దేశపు జనాభా లెక్కల ప్రకారము ఒకకోటి ౬౬ లక్షల ౭౦ వేల వ్యవసాయేతర వృత్తిగల జనాభాలో (ఇందులో మంగలి, చర్మపుపని చేయువారు, కమ్మరి, సాలె, మేదె, చాకలి, మెహతర్, గొల్ల, పందులు పెంచువారు, వడ్డెర్లు మున్నగు తెగలవారు చేరియున్నారు.) నూటికి ౨౮ మంది మాత్రమే తమ కులవృత్తిలో నున్నారు. కులవృత్తి వదలినవారిలో నూటికి ౬౪ మంది వ్యవసాయము చేయుచున్నారు. క్రొత్తగావచ్చి అనుభవములేని యీవర్గ వ్యవసాయదారులు వ్యవసాయనైపుణ్యమును చాలా తగ్గించిన విషయాన్ని చాలామంది గుర్తించరు. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మేలును దృష్టియందుంచుకొని సొంతముగా సేద్యము చేయని భూస్వామితోపాటు అయోగ్యులైన యీవర్గ వ్యవసాయదారులను వ్యవసాయవృత్తి నుండి తొలగించి యితరవృత్తులలో వినియోగించుట అత్యవసరము. ఈ సందర్భములో ప్రఖ్యాతవ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త సర్ మణిలాల్ నానావతితమనిర్దుష్ట అభిప్రాయాన్ని యిట్లు వెల్లడించిరి:—

“* * * * సరియైన పరికరములుగాని యీ వృత్తిని లాభదాయకముగా సాగించు పట్టుదలగాని లేక అనుభవము చాలని వర్గమునకు జెందిన వ్యవసాయదారులను భూమినుండి తొలగించుట మరొక ముఖ్యావసరము. ఈ వర్గములకు జెందినవారుండుటవలన వ్యవసాయ వృత్తికి కలుగుచున్న నష్టపుఅంచనా వేయువారు లేరు. కాని సొంతముగా సేద్యముచేయని భూస్వాములకన్న వీరివలన వ్యవసాయమునకధిక నష్టముకలుగుచున్నదని నేను చెప్పగలను. సొంతముగా సేద్యము చేయని భూస్వాములపై భూమినిసరిగా ఉపయోగించని బాధ్యతయుండదు. కాని పైన చెప్పిన వర్గమునకు జెందినవారు వ్యవసాయ వృత్తిలోప్రవేశించి ఆబాధ్యతను సరిగా నెరవేర్చజాలక పోవుచున్నారు. అందుచేవారు జాతీయ ఆదాయమును తగ్గించుటకు కారకులగుటయేగాక మన జాతీయ ఆదాయమునకు మూలాధారమైన భూమికి నష్టము కలిగించెదరు. * * *

ప్రతివిషయములోను ప్రత్యేక నైపుణ్యము అవసరమైన యీ యుగములో మన వ్యవసాయ ప్రణాళికలో వారికి స్థానముండవలెనని వాదించుట కష్టము. ఇతరవృత్తులలోవలె వ్యవసాయములోగూడా వంశపారంపర్యంగావచ్చు అనుభవము మరియు నేర్పరితనము అవసరము. నైపుణ్యము మరియు అభిలాషయేగాక యీవృత్తిలో అవసరమైన ఓర్పు మరియు కృషి యీ గుణములను సంపాదించుకొనుటకు కొన్ని తరాలనుండి ప్రయత్నించిన కొన్ని వర్గాలలో మాత్రమే కానవగును. ఎంత అనివార్య పరిస్థితుల ప్రోద్బలమువలన యీ వృత్తిలోనికి వచ్చినను చేతిపనులవారు నిపుణులైన వ్యవసాయదారులుకాజాలరు. వ్యవసాయాభివృద్ధినిగూర్చి ఆలోచించుటకు ముందు యీ ముఖ్యవిషయమును మనము గ్రహించవలెను. ఇట్టి వర్గములను తొలగించక భూమిని సరిగా వినియోగించుటగాని, భూమిని అభివృద్ధిపరచుటకు డబ్బు వ్యయము చేయుటగాని దుస్సాధ్యము.

కాని భూమిపైనున్న ఇతరవర్గాలనుండి అయోగ్యులను విడదీయునపుడు మనము త్వరపడరాదు. సంఘములోని క్రింది తరగతిలోనే యీ విధముగా వ్యవసాయ వృత్తిలో ప్రవేశించిన వారున్నారని యీ సందర్భములో మనము జ్ఞాపకముంచుకోవలెను. దీని ననుసరించి మనము సేద్యముచేయు చిన్న భూస్వాములకన్న అధికముగా కౌలుదార్లను, అంతకుమించిన సంఖ్యలో వ్యవసాయ కూలీలను విడదీయవలసియుండును. ఇతర విధముగా చెప్పవలెనన్నచో భూమిపైనున్న అధిక జనాభాను వ్యవసాయేతర వృత్తులలోనికి మరల్చుట అపరిపక్వ విధానముగా జరుగజాలదు. వ్యవసాయ నైపుణ్యమును తగ్గించుటకు కారకులైన వర్గములకు జెందినవారు భూమిని వదలుటకు ముందుగా తగిన సహాయము చేయవలయును. అప్పుడు వంశ పారంపర్యంగా యీ వృత్తిలోనుండి తగిన పరికరాలు గలవారే భూమిపైనుండు అవకాశమేర్పడును. * * *"

ప్రఖ్యాత పరిపాలకుడు, సర్ ఎస్. వి. రామమూర్తిగారు గూడా అదే అభిప్రాయము కలిగియున్నారు.

"మొత్తము జనాభాలో నూటికి 60 పాళ్ళు వ్యవసాయ వృత్తిలోనుండుట సమంజసముగా నుండునని నేను భావించుచున్నాను. ఇతరులకు కుటీర, చిన్న మరియు భారీ పరిశ్రమలలోను, విద్య మరియు కళ అవసరమైన యితరవృత్తులలోను అవకాశము కల్పించవలసి యుండును."

కొన్ని భారీపరిశ్రమలు యేర్పాటగుచున్నను పరిశ్రమలలో పనిజేయుట తగ్గిపోవుచున్నది. 1880 లో జనాభాలో వెయ్యికి 123 మంది పరిశ్రమలలో నిమగ్నులై యుండ యిప్పుడాసంఖ్య 90 వరకు తగ్గిపోయినది. కుటీరపరిశ్రమలు అంతరించుటయే దీనికి ముఖ్యకారణము. వ్యవసాయమునకు సంబంధించిన పాడి పరిశ్రమ, కోళ్ళనుపెంచుట, తేనెటీగలనుపెంచుట, నూనెతీయుట, బెల్లముచేయుట, పడకుట్ల మరియు నేయుట, చర్మపుపని

చేయుట మున్నగు కుటీరపరిశ్రమలను తత్క్షణమే అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత యెంతేనికలదు. ఈ కుటీరపరిశ్రమలు కొంతకాలముమాత్రమే వ్యవసాయము చేయుచున్న రైతుల ఆర్థికపరిస్థితి బాగుపరచుటకు తోడ్పడును. పంచదార, నూనె, బియ్యము మరియు బట్టలు మున్నగు గిర్నీలు నిర్మించుటవలన భూమిలేని కూలీలకు పని యేర్పడును.

(ఇ) భూమిని పూర్తిగా వినియోగించునట్టి వ్యవసాయ పద్ధతులు అవలంబించుటద్వారా యీ అధిక జనాభాసమస్య మరికొంత పరిష్కరింప బడునని చెప్పుట మూడవవిషయము. ఇంచుమించుగా మొత్తము సంస్థానములో భూమియొక్క ఉత్పత్తి అతిహీనముగా నున్నది. అతి పురాతన వ్యవసాయపద్ధతులు అవలంబింపబడుచున్నవి. భూమిని చాలా శ్రమపడి మెల్లగాదున్ను ఆచారమున్నది. మంచివిత్తనాలు ఆచారములో లేవు. ఆకు ఎరువులు మరియు శాస్త్రీయమైన ఎరువులు ఎరుకలో లేవు. చెరువులు కేవలము వర్షముపై ఆధారపడి యున్నందున నీటిపారుదల నమ్మకములేదు. వ్యవసాయ అవసరాలకొరకు విద్యుచ్ఛక్తిని వాడుట మొదటికేలేదు. దున్నేపశువులు చాలా చిన్నవిగా నున్నవి. ఉత్తమ వ్యవసాయపద్ధతులను ఆచరణలో బెట్టుటకు సామాన్య వ్యవసాయదారునకు యేమాత్రము శక్తిలేదు. ఇట్టిపరిస్థితులలో పంట హీనముగానుండుట ఆశ్చర్యమును కలిగించదు.

"డాక్టర్ రావుగారి అంచనాలప్రకారము దేశములో ప్రధానవృత్తిగానున్న వ్యవసాయమువలన భారతజాతీయ ఆదాయమునకు నూటికి 38 పాళ్లు లేక 600 కోట్ల రూపాయలు చెందును. కార్మికులలో నూటికి 15 మంది నిమగ్నులైయున్న పరిశ్రమలవలన 300 కోట్ల రూపాయలు జెందును. నూటికి 13 మంది పనిచేయుచున్న వ్యాపారము, రవాణా, ప్రభుత్వ మరియు యితర ఉద్యోగములవలన వచ్చు ఆదాయము 400 కోట్ల రూపాయలు. ఇది మొత్తము ఆదాయములో నూటికి 25 పాళ్లు. దీనిఫలితమేమన ఉద్యోగములలో ప్రతిఒక్కరి

సగటు ఆదాయము 307 రూపాయలు, పరిశ్రమలో 195 రూపాయలు, మరియు వ్యవసాయములో 133 రూపాయలున్నది." [The Indian Rural Problem—by Nanavathi and Anjaria.]

అందుచే నేటి ముఖ్యసమస్య ఉత్పత్తిని అధికము చేయుట. అధికోత్పత్తిచేయు పెద్దవ్యవసాయములను చెడగొట్టి భూపంపకము జేయుటకాదు.

జనాభా అభివృద్ధియగుట భారతదేశ ప్రత్యేకత కాదు. 1870 నుండి 1930 వరకు యూరోపు దేశాలలో జనాభా నూటికి 64 వంతులు పెరిగినది. అదే కాలములో భారతదేశములో నూటికి 31 పాళ్ళు మాత్రమే పెరిగినది. అయినను భారతదేశములోవలె ఆ దేశములలో దరిద్రమను సమస్య అంత తీవ్రము కాలేదు.

జనాభాఒత్తిడి యున్నను అది ఒక వ్యవసాయమునకు సంబంధించినది మాత్రమేకాదు. ఉద్యోగములలో నున్నంత ఒత్తిడి యే యితర వృత్తిలో లేదు. ఏ యితరవృత్తిలోను ఆదాయములలో ఉద్యోగములలో కనబడు తారతమ్యములేదు. కాని పైన నున్న పెద్దఉద్యోగుల వేతనములు తగ్గించి చిన్నఉద్యోగుల ఆదాయములు సమన్వయపరచ బడుట లేదు. ఇతర అన్నివృత్తులలో సంపాదనపై యెట్టినిర్బంధనలేదు. పరిశ్రమల మరియు వాణిజ్యములలో కొన్నిలక్షల రూపాయల ఆదాయముగూడా వుండును. ఇతరవృత్తులలో సంపాదనపై నిర్బంధము లేనంతకాలము పెద్ద వ్యవసాయదారులను నిర్మూలింపజేయుట ఆర్థికముగాను నైతికముగాను న్యాయసమ్మతము కాదు.

కాని సమితివారు హద్దు నిర్ణయించ సంకల్పించినచో గరిష్ట నెలాదాయము 4 వేల రూపాయలుండవలెనని కాంగ్రెస్ ఎకనామిక్ ప్లానింగ్ కమెటీ చేసిన నిర్ణయముననుసరించి చేయవలెనని సూచింపబడుచున్నది. ఈ సందర్భములో మద్రాసు మాజీప్రధానియు అఖిలభారత కాంగ్రెస్ కమెటీ భూసంస్కరణలసమితీ సభ్యుడును అగు శ్రీ ఓ. పి. రామస్వామి రెడ్డియార్ అభిప్రాయమును తెలుపక తప్పదు. అది యిట్లున్నది:—

"ఒకవ్యక్తి ఉంచుకొనగలిగిన గరిష్ట భూపరిమాణమును నిర్ణయించునపుడు పారిశ్రామికునితో అతని ఆదాయమును పోల్చి చూచుట న్యాయము. పారిశ్రామికునకు నాలుగువేలరూపాయల ఆదాయము సంపాదించుకొనుటకు అనుమతి యిచ్చినచో అంత ఆదాయము నివ్వగల భూమి గలిగియుండుటకు భూస్వామికి అనుమతి యివ్వకపోవుటకు యెట్టికారణము లేదు. గరిష్ట ఆదాయముయొక్క హద్దు వ్యాపారస్తునకు, పారిశ్రామికునకు, వ్యవసాయదారునకు అందరకూ ఒకటేయై యుండవలెను. ఒక వ్యక్తి ఉంచుకొనగలిగిన భూవిస్తీర్ణమును అదేవిధముగా నిర్ణయించవలెను. ఈ విధముగా నిర్ణయింపబడిన గరిష్ట భూవిస్తీర్ణముకన్న అధికముగానున్న భూమిని బజారుధరకు కొని తిరిగి పంచిపెట్టవలెను."

[Agrarian Reforms and Parity Economy]

వివిధభూములయొక్క భూసారము, నీటిపారుదల సౌకర్యాలు, ప్రదేశము, వర్షము మరియు ప్రతిచోటికి అధికముగా మారునట్టి యితర ఋతుపరిస్థితులు భిన్నముగా నుండుటవలన ఒక ప్రత్యేక ఆదాయము నివ్వగల భూవిస్తీర్ణమును అన్ని ప్రదేశములకు ఏకముగా నిర్ణయించుట అపాయకరమని యీ సందర్భములో సమితికి నొక్కి చెప్పవలసియున్నది. అధిక ధరలుగల ప్రస్తుత సమయములోగూడా భూశిస్తుకు సరిపోవు ఆదాయము నివ్వని కొన్ని భూములు నల్లగొండజిల్లాలో నున్నవి. మంచి ఆదాయము నిచ్చునట్టి ఉత్పత్తిగల భూములు యితరప్రదేశాలలో నున్నవి. అందుచే ఒక ప్రత్యేక ఆదాయము నివ్వగల భూవిస్తీర్ణము వివిధప్రదేశములకు వేర్వేరుగా నుండును.

# 3. నీటి పారుదల

ఈ సంస్థానములో సాధారణవర్షములేయున్నను ప్రకృతిసంపదలు విరివిగానున్నవి. ఎడతెగని నదులు మున్నగు యీ సంపదలు నామమాత్రముగానైనను వినియోగింపబడలేదు. విద్యుచ్ఛక్తి ఉత్పన్నముచేయుటకు నదులను ఉపయోగించలేదు. 20 లక్షల క్యూబిక్ ఫూట్ల వర్షములో పదవవంతుగూడా నీటిపారుదల చేయుటకు వినియోగింప బడుటలేదు. మిగిలినది సద్వినియోగ మగుటలేదు. నిజాంసాగర్ మరియు వైరా, పాలేరు, డిండీ మున్నగు చిన్నప్రాజెక్టులు మినహాయించినచో చెరువులే ముఖ్యజలాధారములుగా నున్నవి. బావులు కొంతవరకు తోడ్పడుచున్నవి. మొత్తము సంస్థానములో 25,214 పెద్ద చిన్న చెరువులున్నవి. ఇందులో 10 లేక అంతకు ఎక్కువ ఎకరాలు పారకముగల 12,391 చెరువులు పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటుక్రింద నున్నవి. మిగిలినవి భూమ్యాదాయశాఖ క్రింద నున్నవి. ఈ చెరువులుగాక కాకతీయరాజులచే నిర్మించబడిన రామప్ప, లక్నవరం మరియు పాఖాల పెద్దచెరువులున్నవి. ఆకాలపు నిర్మాణ కౌశల్యమును తెలియజేయు యీ చెరువులను సరోవరములనుట మిక్కిలి సమంజసముగానే యున్నది. కాని యీ చెరువులను బాగుచేసి మంచి స్థితిలోనుంచు బాధ్యతను ప్రభుత్వము సరిగా నెరవేర్చనందున యీ చెరువులక్రింది "ఆయాకట్లు" చాలా క్షీణించిపోయినవి. ప్రస్తుతము సంస్థాన ప్రజలను కలవరపెట్టు ఆహారకొరత యేర్పడుట వింతకాదు. దిగువ తెలిపిన అంకెలు అనేకవిషయాలను సూచించును. వానిపై విమర్శ అనవసరము:-

(అ) నిజాంసాగర్ తదితర ప్రాజెక్టులక్రింద అంచనా వేయబడి సేద్యమునకు యోగ్యమైన మొత్తము "ఆయాకట్టు" పూర్తిగా సేద్యము చేయబడుటలేదు. అట్లు చేసినయెడల యీ ప్రాజెక్టులక్రింద సాగుచేయబడు భూమిలో 73 వేల ఎకరములు అధికమగును.

(ఆ) రామప్ప, లక్కవరం మరియు పాఖాలసరోవరములు 9,699 ఎకరములకు నీటిపారుదల చేయుచున్నవి. కాని వీనిక్రింద సాధ్యమగు "ఆయాకట్టు" లో నిది కొంతభాగము మాత్రమే.

(ఇ) 1. పది ఎకరములకన్న ఎక్కువభూమికి నీటిపారుదలచేయు 12,391 చెరువులలో 6,436 ఇంకనూ బాగుచేయబడలేదు. 2130 తెగిపోయిన కారణమున నిరుపయోగముగా నున్నవి. తెగిపోయిన చెరువులను సరిగా బాగుచేసినయెడల మరొక 1,33,625 ఎకరములభూమి సాగుకాగలదు.

2. ఈ చెరువులలో కొన్ని బాగుచేయునపుడు F. T. L (కట్ట యొక్కఎత్తు) తగ్గించుట మొత్తము "ఆయాకట్టు" ను క్షీణింప జేయుటకు తోడ్పడినది. ఈ ఎత్తులు తగ్గించుటకు బలమైన కారణములు లేవు. కట్టను బలపరచిగాని వెలుపలిభాగమును వెడల్పుచేసిగాని చెరువును సురక్షితము చేయవచ్చును.

(ఈ) బావులు : 1,87,370 బావులలో 51,930 నిరుపయోగముగా నున్నవి. అందుచే చాలాభూమి తరీసేద్యములో తగ్గియుండ వచ్చును. మద్రాసు ప్రభుత్వమువలె రైతులకు సహాయము చేసి క్రొత్త బావులు త్రవ్వించుటయేగాక ప్రభుత్వం నిరుప యోగముగానున్న బావులను వెంటనే బాగుచేయించవలెను. మద్రాసుప్రభుత్వం ఆరునెలలలో సుమారు అయిదుకోట్ల రూపాయలు వ్యయపరచి 60 వేల క్రొత్తబావులు త్రవ్వించి 30 వేల పాతబావులు బాగుచేయించినారు. తగినన్ని బావులు మరియు నీరుతోడుటకు విద్యుచ్ఛక్తి యున్నచో ఉత్పత్తి శూన్యమైన నల్లగొండ తదితరప్రాంతాల భూములు వరి మున్నగు పచ్చనిసేలుగా మారును.

ప్రస్తుతమున్న చెరువులను బాగుచేయించి ప్రాజెక్టులక్రింద నీటి పారుదల యెక్కువజేయుటవలన మరి రెండులక్షల ఎకరములకు నీటిసర ఫరా చేయవచ్చునని స్పష్టమగుచున్నది. దీనివల్ల ప్రస్తుతమున్న లక్ష టన్నుల ఆహారధాన్యాలకొరత దూరము కాగలదు. తలపెట్టిన చిన్న మరియు మధ్యరకపు ప్రాజెక్టులు నిర్మింపబడుటవలన మరొక రెండులక్షల ఎకరములకు నీటిసరఫరా చేయవచ్చును.

నిర్మాణము జరుగుచున్న తుంగభద్రా ప్రాజెక్టుక్రింద 4 లక్షల 20 వేల ఎకరములు, తలపెట్టిన గోదావరి, మీదకృష్ణా, మరియు క్రింది కృష్ణా ప్రాజెక్టులక్రింద 4 లక్షల పదివేల ఎకరములు, 8 లక్షలఎకరములు మరియు 9 లక్షల ఎకరములు సాగుబడియగునని అంచనా వేయబడినది. ఈ ప్రాజెక్టులక్రింద క్రమేణా 38 వేలు, 65 వేలు, 30 వేలు మరియు 50 వేల కిలోవాట్ల శక్తి ఉత్పన్నమగుననికూడా అంచనా వేయబడినది. చిన్నప్రాజెక్టులు, తుంగభద్రాప్రాజెక్టు ఇదితర ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసినయెడల సంస్థానమును సస్యశ్యామలము చేయవచ్చును. ఎగుమతి చేయుటకుగూడా ఆహారధాన్యములు లభించును.

# 4. వ్యవసాయ ధరల నిర్ణయము; విక్రయ సౌకర్యాలు; సబ్సిడీలు

వ్యవసాయపుధరలు అసమంజసముగా నుండుట గ్రామీణ ఆర్థిక వ్యవస్థ యెదుర్కొనుచున్న ప్రధాన ఆటంకములలో నొకటి. ధరలు ఆర్థికముగా లాభదాయకములుగా లేక, ఎప్పటికప్పుడు మారుచుండుటవలన దానిప్రభావము జనాభాలో నూటికి 75 మంది పైబడి పూర్తి దేశము యొక్క ఆర్థికవ్యవస్థ తల్లక్రిందులగును. వ్యవసాయము భారతదేశము యొక్క మూలపరిశ్రమగా నుండెను. ఇకముందుగూడా అట్లే యుండగలదు. దేశ ఆర్థికవ్యవస్థయొక్క మూలాధారము రైతులపై నున్నది. అందుచే సంఘముయొక్క స్థిరత్వము వారి బాగోగులపై ఆధారపడియుండును. కాని వ్యవసాయపుధరలు పరిశ్రమల అవసరాలపై ఆధారపడి యుండుటవలన వ్యవసాయము మంచిదర్జాలో లేదు. ఉత్పత్తి చేయు పరిశ్రమల రక్షణదృష్ట్యా వ్యవసాయపుధరలు తగ్గించుట పూర్తి ఆర్థిక వ్యవస్థకే నష్టదాయకము. గ్రామీణ ప్రమాణములను తగ్గించి పట్టణ పరిశ్రమలకు దోహదమిచ్చునట్టి హ్రస్వదృష్టిగల యీ విధానమువలన పరిస్థితులు సక్రమముగా నున్నట్లు కానవచ్చును. దీనిమూలమున కృత్రిమ విశ్వాసమేర్పడి అత్యవసర సంస్కరణలు మరియు పునర్నిర్మాణము ఆలస్యమగును. మన దేశములోని వ్యవసాయదారులు సంఘటితమై లేనందున పూర్వము వారి సమస్యలనుగూర్చి చెప్పువారేలేక వాటిపై యెవరిదృష్టి పడలేదు. వ్యవసాయమునకు నష్టముకలిగించి పారిశ్రామిక వర్గమువారు తమ అత్యధిక పలుకుబడి మరియు ఆదాయమును వినియోగించి తమస్థానమునకు గట్టిపునాదులువేసి పదిలపరచుకొనుచుండిరి. కాని యిట్టి యేకపక్ష ఆర్థికవిధానము చిట్టచివరకు దేశమునకు నష్టదాయకముగా పరిణమించును.

ఆచరణలోనుండు కనిష్టధరలను నిర్ణయించినయెడల ఉత్పత్తి అధికమై కేవలము వ్యవసాయములో మాత్రమే స్థిరత్వము కలిగించుటకాక

పూర్తి ఆర్థికవ్యవస్థతో స్థిరత్వము కలిగించును. న్యాయమైన నిర్ణీతధర వ్యవసాయదారుడు నూతన వ్యవసాయపద్ధతులు అవలంబించి తనవృత్తిలో అధికకృషి చేయుటకు ప్రోత్సహించును. ఇందుమూలమున స్వల్పవ్యయ ముతో అధికోత్పత్తి యగును. తద్వారా వ్యవసాయధరల ప్రమాణము తగ్గి కార్మికుల వేతనములు తగ్గిపోవును. న్యాయమైనధరలు రైతుల కొను గోలుశక్తిని అధికముచేసి పరిశ్రమలలో తయారుచేసిన వస్తువుల అవసర మును అధికముచేయును. దీనివల్ల రైతులవద్దకొన్న ముడివస్తువులకు సరి యైనధర లివ్వనినాటికన్న మంచిగా పరిశ్రమలరక్షణ స్థిరపడును.

అందువలన యెట్టి భూసంస్కరణలలోనైనను కనిష్టధరలసమస్యకు అధిక ప్రాముఖ్యత ఉండవలెను. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడా, యునైటెడ్ కింగ్డమ్, జపాన్ మున్నగు దేశాలలో యిట్టివిధానమే యేదో ఒకరూపములో అవలంబింపబడినది. ధరలు నిర్ణయించునపుడు ఉత్పత్తి దారులు మరియు ఉపయోగించువారు అను రెండువర్గములకు న్యాయ ముగానుండు ప్రమాణమును నిర్ణయించవలెను. ఈసందర్భములో ఇండియా ప్రభుత్వ వ్యవసాయ, ఆటవిక మరియు మత్స్య పాలసీ కమిటీయొక్క ధరల ఉపసంఘమువా రిట్లుచెప్పిరి:— "ఉత్పత్తిదారునకు న్యాయమైన ధరయన ఉత్పత్తివ్యయము పోగా యితర తోటివృత్తులలోవచ్చు ఆదాయ ముతో సరితూగు నికర ఆదాయమునిచ్చుధర అయియుండును. అంతే గాక అధికోత్పత్తి చేయుటకు అతనిని ప్రోత్సహించునట్టిదై యుండ వలెను, ధర అంతకు తక్కువగా నున్నచో ఉత్పత్తిదారుడు అదేవృత్తిలో నుండుట కెట్టికారణముండదు. అతడు అధిక ఆదాయముగల ఉద్యోగ ములో ప్రవేశించవచ్చును.........ఉపయోగించువారలకు న్యాయమైన ధరయన ఒక ఆదాయప్రమాణములో కనిష్ట ప్రధాన అవసరాలను తీర్చు కొను అవకాశ మిచ్చునట్టిదై యుండవలెను."

కేవలము ధరలను నిర్ణయించి వానిని ఆచరణలో బెట్టకపోవుట వలన వ్యవసాయదారున కెట్టిప్రయోజన ముండదు. ఈ ధరలను ఆచర ణలోబెట్టు పద్ధతులను అవలంబింపవలెను. అన్ని విక్రయకేంద్రాలలో

అమ్మకమునకువచ్చిన సరకులనన్నింటిని ప్రభుత్వము నిర్ణీతధరలకు కొనవలెను. అనేక విక్రయకేంద్రాలు మరియు గరిసెలు స్థాపించి, వానివద్దకు గ్రామాలనుండి రోడ్లువేయించి, విక్రియ అవకాశాలు అధికము చేయవలెను. సహకారపద్ధతులపై విక్రయము జేయించుటవలన ఉత్పత్తిదారులకు నమ్మకముగా మంచిధర గిట్టునని చెప్పవచ్చును.

అంతేగాక రైతులవద్దనుండి వ్యవసాయ పదార్థములను కొనినధరలకు తిరిగి వానిని ఉపయోగించువారలకు విక్రయించుధరలకు చాలా వ్యత్యాసమున్నది. రైతుల తలగొట్టి శ్రమపడని మధ్యవర్తులు బాగుపడుచున్నారు. ఇట్టి వ్యత్యాసమున్నచో చీకటివ్యాపారము జరుగుటకు సనవకాశ మేర్పడునని యీ సందర్భములో చెప్పుట అనవసరముకాదు.

వ్యవసాయ ఉత్పత్తియొక్క కనిష్టధరల నిర్ణయముతోపాటు రైతులకు బావులు త్రవ్వుటకు, నూనెగింజలపిండి కొనుటకు, శాస్త్రీయమైన యెరువులు మున్నగు వాటికొరకు సబ్సిడీలు (ధనసహాయము) యిచ్చుట అవసరము. సబ్సిడీలిచ్చుట తకావీ అప్పులు యిచ్చుటకన్న మెరుగైన విధానము. ఏపనికొరకు సబ్సిడీలివ్వబడునో ఆదేపనికొరకు డబ్బు వినియోగపరచుటకు అధికవిశ్వాస ముండును.

# 5. సమష్టి మరియు సహకార వ్యవసాయము

సమష్టి వ్యవసాయవిధానము వ్యక్తిగత భూస్వామ్యమును నిర్మూలించి ఆదాయములో సమానత్వము కలిగించుటను తలపెట్టబడినదిగాన అందలి ఆదర్శభాగము మాత్రము అందరిని ఆకర్షించును. కాని యీ విధానము మనుజునిలో సహజముగానుండి ప్రతి వృత్తిలోను శ్రమపడి పని చేయుటకు ప్రోత్సహించు తనది అను భావమును అణంచుటను కోరును. రష్యాలో యీ విధానము అమలులోనికి వచ్చినపుడు యిది భూమికి సంబంధించిన అన్నితగాదాలను పరిష్కారము చేయునని చెప్పబడియుండెను. కాని యీ విధానము అయిష్టముగానున్న రైతులపై నిరంకుశముగాను బలవంతముగాను ప్రవేశపెట్టిన విషయము నగ్నసత్యము. ఆ విధానమును వ్యతిరేకించిన రైతులను నిర్మూలనముజేయుట, పశువులను చంపివేయుట జరిగియుండెను. ఈ విషయమునుగురించి భారత సోషలిస్టునాయకుడు శ్రీ జయప్రకాశ్ నారాయన్‌గారిట్లు వ్రాసిరి:—

"అనేకమంది ప్రజలను అంతమొందించి నిరంకుశ నియంతృత్వ విధానముద్వారా సమష్టివిధానము అమలులో పెట్టబడినది. సమష్టివిధానమును జయప్రదము గావించుటకు సుమారు 2 కోట్లమంది నిర్మూలింపబడినట్లు అంచనాలు తెలుపుచున్నవి. ఇంత పెద్దయెత్తున శ్రమజీవులను అణచుటను నేను సహించను. సోషలిస్టు విధానము దీనికి సమ్మతించదు."

సమష్టి వ్యవసాయవిధానము సులభముగా అమలులోనికి రాలేదని యీ విషయములు సూచించుచున్నవి. రైతులు తమ సర్వశక్తులను వినియోగించి పోరాడి ప్రతిశతి 53 గుఱ్ఱములను, 44 పశువులను, 66 మేకలు మరియు గొఱ్ఱెలను నాశనముచేసిరి. సమష్టివిధానమును వ్యతిరేకించిన వారిలో కొందరు యీనాటివరకు గృహమనునదిలేక దేశదిమ్మరులై యున్నారు. వారికి స్థానమిచ్చిన దేశాలు రష్యా లేక దాని మిత్రరాజ్యాల వశమగుచున్నకొలది వారు యితరదేశాలకు వెళ్ళవలసి వచ్చుచున్నది.

ఈ విధముగా హత్యజరిగినను రష్యాలో ఉత్పత్తి అధికము కాలేదు. రష్యా ప్రజలు యీ విధానాన్ని చడి చప్పుడు లేకుండా అంగీకరించలేదు. ఇంత క్రూరముగా అణచినను తనది అనుభావమును ప్రజల అభిప్రాయముల నుండి తొలగించజాలక రష్యాప్రభుత్వము కొంతవరకైనను వ్యక్తిగతముగా భూమిని కలిగియుండు విధానాన్ని గుర్తించక తప్పదయ్యెను. ఉత్పత్తి దృష్ట్యా పరిశీలించినను ఫలితములు ఆశాజనకముగా లేవు. రష్యా మరియు తదితర దేశాల ఉత్పత్తినిగురించి కోలిన్ క్లార్కు (Conditions of Economic Progress) ప్రకటించిన అంకెలు అనేకవిషయాలను సూచించుచున్నవి:-

| | | | | |
|---|---|---|---|---|
| న్యూజీలాండ్ | ... | 2,444 | అంతర్జాతీయయూనిట్లు. | |
| అమెరికాసంయుక్తరాష్ట్రాలు | ... | 661 | ,, | ,, |
| డెన్మార్కు | ... | 642 | ,, | ,, |
| గ్రేట్ బ్రిటన్ | ... | 475 | ,, | ,, |
| జపాన్ | ... | 120 | ,, | ,, |
| రష్యా | ... | 88 | ,, | ,, |
| ఇండియా | ... | 65 | ,, | ,, |
| చైనా | ... | 46 | ,, | ,, |

సమష్టి వ్యవసాయము పాలస్టయిన్‌లో మాత్రమే విజయవంతమైనది. అచట దాని విజయమునకు తోడ్పడిన అంశములలో వ్యక్తిగతముగా కలిగియుండవలెనన్న దానికన్న బలమైన ఆత్మరక్షణ ఆవశ్యకత, ఉన్నత విద్యాప్రమాణము, వర్గరహితసంఘము, స్త్రీ పురుషులకు సమాన హక్కులు, జయనిజమ్‌యొక్క ఆదర్శము, ఏకమతము, మరియు అన్నింటికిమించి అంతర్జాతీయ యూదుల సంస్థయొక్క అసామాన్య ఆదాయము చేరియున్నవి.

అచటకూడా వ్యక్తిగతముగా కలిగియున్న భూమియే అధికముగానున్నది. వ్యక్తిగత యాజమాన్యముక్రింద 4,46,380 "దనం" లున్నది. (ఒక "దనం" సుమారు 10 గుంటలకు సమానము) సమష్టి వ్యవసాయములక్రింద 3,14,810 "దనం" లు మాత్రమే యున్నది. సమష్టివ్యవ

సాయము వ్యక్తిగత గృహజీవనము మరియు ఆత్మశక్తి సంపూర్ణ వినియోగమునకు ప్రోత్సాహకరముగా లేదని గ్రహించినందున కొంతకాలమునుండి సమష్టి వ్యవసాయమునుండి సహకార వ్యవసాయమునకు మారుట జరిగినది. గత రెండుదశాబ్దాలలో 2,21,990 "దనం"ల విస్తీర్ణముగల 99 సెటిల్మెంట్లు అమలులోనికి వచ్చినవి. యూదరాజ్య పునాదులు బలపడి జాతినిర్మాలన అపాయము దూరమైనచో సమష్టి వ్యవసాయపద్ధతి ప్యాలెస్టయిన్లోగూడా ఉంచబడునా యన్న విషయము అనుమానాస్పదము.

సమష్టి వ్యవసాయమునకు ఆదర్శ అవకాశాలున్న ప్యాలెస్టయిన్లోనే యీ విధానము సంపూర్ణ విజయవంతముగా సాగనపుడు భారతదేశములో ఆ విధాన అభివృద్ధికి అవకాశాలు లేవని నొక్కిచెప్పవచ్చును. వ్యక్తిగతఆస్తి ఉండవలెనను ఆసక్తి భారతదేశ రైతులలో బలవత్తరముగా నున్నది. ఇచటి వాతావరణము సమష్టి వ్యవసాయ విధానమునకు పూర్తి వ్యతిరేకముగా నున్నది. భారతదేశ సామాన్య వ్యవసాయదారుడు సమష్టిగా పనిచేయుటకు అంగీకరించడుగాన యిట్టి వ్యవసాయవిధానము భారతదేశమునకు యేమాత్రము సరిపడదని సహకార వ్యవసాయమును పరిశీలించుటకు ప్యాలెస్టయిన్ వెళ్ళి వచ్చిన భారత ప్రతినిధివర్గము అభిప్రాయ పడుచున్నది.

ప్యాలెస్టయిన్లో అభివృద్ధిలోనికివచ్చిన సహకార వ్యవసాయవిధానమునకు భారతదేశములో గొప్ప అవకాశాలున్నవి. క్రొత్తగా సాగుబడి చేయనున్న భూములు మరియు ఆర్థికముగా లాభదాయకములుగాని భూవిస్తీర్ణములపై భారతదేశములో యీ నమూనాపై కార్యము ఆరంభించవలెను. మంచిచెడ్డలను సంపూర్ణముగా గ్రహించుటకు వివిధములైన సహకార వ్యవసాయ పద్ధతులను ప్రయత్నించి చూడవలెను. సంయుక్త వ్యవసాయమేగాక రైతుల సర్వ అవసరములను దూరముచేయు బహుప్రయోజనాత్మక సహకార సంఘములను అభివృద్ధిచేయువలెను. కేవలము ఋణమిచ్చు సంఘములు వ్యవసాయదారుల సమస్యను స్వల్పముగానైనను

యెదుర్కొనజాలవు. వ్యవసాయదారులు కొనునట్టి ఎరువు, విత్తనములు, వ్యవసాయపరికరములు మున్నగు వస్తువులు; వారు ఉత్పత్తి జేసిన వస్తువుల విక్రియము; యంత్రముల ఉపయోగము, చిన్న భూవిస్తీర్ణములను యేకముచేయుట, మరియు వారి ఉపయోగ వస్తువుల అవసరాలు పూర్తి జేయుట అన్నియు సహకార సంఘములయొక్క అధీనములోనికే రావలెను. ప్రజలు సహకార పద్ధతులకు అలవడునట్లు జేయుటకు భూశిస్తులో తగ్గింపు, సులభమైన ఋణసౌకర్యములు, సబ్సిడీలు మున్నగు సౌకర్యములను వ్యవసాయదారులకు కలుగజేయవలెను.

ఇట్టి సహకార సంఘములవలన గలుగు లాభములను గ్రహించుటకు బహు ప్రయోజనాత్మక సహకారసంఘముల విషయములో బరోడా సంస్థానమునందలి కోడినార్‌లో కలిగిన అనుభవమును పరిశీలించవచ్చును.

సహకార సంఘముల జయాపజయములు యితర అన్ని అంశముల కన్న నధికముగా వానినినడుపు అధికారులయోగ్యత మరియు కార్యదీక్షపై ఆధారపడి యుండును.

# 6. వ్యవసాయ కూలీలు

వ్యవసాయ కూలీలకు వ్యవసాయవృత్తిలో ముఖ్యస్థానమున్నది. వారు చిన్న పెద్ద అను తారతమ్యములేక అందరు వ్యవసాయదారులకు అవసరము. కాని వ్యవసాయానుభవము లేని కొందరు ఆర్థికవేత్తలు వ్యవసాయకూలీలు పెద్ద వ్యవసాయదారులకే అవసరమనియు, చిన్న వ్యవసాయదారులు యీ కూలీల సహాయము లేకుండానే వ్యవసాయమునకు సంబంధించిన అన్ని పనులు తమంతటతామే చేసుకొనగలరనియు అపోహలు గలిగియుండుట గమనింపదగిన విషయము. వ్యవసాయమునకు సంబంధించిన కొన్నిపనులు చాలా కొద్దికాలములో పూర్తిజేయవలసిన ఆవశ్యకతను గ్రహించవలెను. కార్తె దాటిపోకుండా పని పూర్తిజేయుటకు కొద్దికాలముకొరకు అధికసంఖ్యలో కూలీలను నియమించుట అవసరము. దినమొక్కంటికి ఒక ఎకరము వరిపొలము నాటువేయుటకు 25 మంది, కలుపుతీయుటకు 12 మంది, కోయుటకు 12 మంది కూలీలు అవసరము. యంత్రసహాయముతో పనిచేయు పరిశ్రమలలోవలె వ్యవసాయములో గూడా కూలీల అవసరమున్నది. యంత్రముల నుపయోగించి కూలీలను కొంతవరకు తగ్గించవచ్చునుకాని పూర్తిగా కూలీలు లేకయే వ్యవసాయము సాగించుట సాధ్యముకాదు.

వ్యవసాయ కూలీలను మూడు తరగతులలోనికి విభజించవచ్చును. (1) నాటు కలుపు కోత మున్నగు పనులకొరకు వినియోగించువారు (2) ఋతువులలో పనిచేయువారు [హంగామీ లేక నెలజీతగాండ్లు] (3) దీర్ఘకాలము పనిచేయువారు [సంవత్సర జీతగాండ్లు]. కొంతకాలము నుండి వ్యవసాయకూలీల పరిస్థితి బాగుపడుచున్నది. కూలీలసంఖ్య మరియు వ్యవసాయ అవసరములనుబట్టి వారి కూలీ రేట్లు నిజమైన ఆర్థిక హద్దువరకు వచ్చుచున్నవి. ఇప్పుడు వారు చిన్న వ్యవసాయదారులకన్న ఆర్థికముగా మంచిస్థితిలో నున్నారు. కూలీల అవసరము అధికముగా నుండుటవలన కొన్ని సమయాలలో వ్యవసాయపనులకు అవసరమైన కూలీలు లభించుట కష్టముగానుండును. కాని నీతి నియమాలులేని రాజకీయ విప్లవకారులు

ఉద్రేకపూరితములు మరియు నష్టదాయకములైన నినాదములు లేవదీసి కూలీలు మరియు రైతులమధ్య సంఘర్షణ కలుగజేసి గ్రామాలలో అశాంతి ప్రబలునట్లు చేయుచున్నారు. అందుచే వ్యవసాయకూలీల పరిస్థితిని పరిశీలించి వారు పనిచేయవలసిన విధానాన్ని నిర్ణయించుటకు ప్రభుత్వమువారొక సమితిని యేర్పాటుచేయుట అవసరము. వ్యవసాయకూలీలు పనిచేయుషరతులు వ్యవసాయ ప్రత్యేక అవసరాలదృష్ట్యా కొంత సులభముగా నుండనియెడల వ్యవసాయమునకు నష్టము కలుగును. రైతులు మరియు కూలీల మధ్యనున్న సంబంధాలు క్లిష్టరూపమును దాల్చును. అన్నివిధములైన కూలీలరేటుయొక్క నిర్ణయము ఒకప్రక్కన వ్యవసాయపుధరలు మరొకప్రక్కన కూలీల నేర్పరితనముపై ఆధారపడి యుండవలెను. నేర్పరులు కాకపోయినను అధిక కూలీరేటు యివ్వవలెనని కోరుటవలన వ్యవసాయ వృత్తియొక్క ఆర్థికవ్యవస్థ తల్లక్రిందులగును దీని పర్యవసానముగా చిన్నరైతు తనవృత్తి మానుకొని కూలీల దర్జాలో చేరవలసివచ్చును. అమెరికా యూరోపుదేశాలలో వ్యవసాయకూలీలు ఉత్పత్తికి అధికముగా తోడ్పడెదరుగాన వారి కూలీరేట్లు అధికముగా నున్నవి.

దినకూలీలు లేక హంగామీ కూలీలరేట్లు దినము లెక్కప్రకారముగాక వారుచేసిన పనిప్రకారము నిర్ణయించవలెను. కూలీలు పని తెలియనివారై సోమరిబోతులుగా నున్నారు. ప్రతిదినము 4 నుండి 6 గంటలకుమించి పనిచేయరు. వారికివ్వబడు కూలీ వారుచేసిన పనిమీద ఆధారపడియున్నచో వారు అధికముగాశ్రమపడి పనిచేసెదరు. తద్వారా ఉత్పత్తి అధికమగును. చేసిన పనినిబట్టి ప్రతిఫలమిచ్చు విధానము రష్యాలో గూడా అమలులోనున్నది. ఇట్టి విధానములో గాడిద గుఱ్ఱము ఒకటికావు. పనిచేసినవారికి చేయనివారికి ఒకేరేటు లభించదు.

దినకూలీలు మరియు హంగామీ కూలీలకు సాధారణముగా సంవత్సరము పొడుగున నిర్ణయమైనపని యుండదు. వ్యవసాయపు పనులులేని సమయములో వారికి ఉద్యోగము కల్పించుటకు వ్యవసాయముతో సంబంధముగల కుటీర మరియు పెద్ద పరిశ్రమలు స్థాపించవలెను.

# రెండవ భాగము

## భూసంస్కరణల సమితి ప్రశ్నావళి:
## దాని ప్రత్యుత్తరములు

# భూసంస్కరణల సమితి

## [ హైదరాబాద్ ప్రభుత్వము ]

# ప్రశ్నావళి

1949 జూన్ 2 వ తేదీన హైదరాబాద్ ప్రభుత్వమువారు, ప్రధాన శిరోమణి మాధవరావు, బి. ఏ , బి. ఎల్., సి. ఐ. ఇ , గారు అధ్యక్షులుగాను, మిస్టర్ గులామ్‌హైదర్ హెచ్. సి. ఎస్., గారు, డాక్టర్ ఆర్. వి. రావు, ఎమ్. ఎ., బి. టి., పిహెచ్. డి., గారు సభ్యులుగాను, శ్రీ ఎమ్. శ్రీనివాసరావు బి. ఎ. ఎమ్. ఎల్. గారు కార్యదర్శిగా నున్నట్టి ఒకసమితిని యేర్పాటుచేసిరి. ఈ సమితివారు ప్రస్తుత వ్యవసాయపరిస్థితిని పరిశీలించి తదభివృద్ధి మార్గములను ప్రభుత్వమువారికి సిఫారసుచేసి రైతులలో శాంతి, తృప్తి, భద్రతలను నెలకొలుపుటకై ఈ క్రింది అంశములను, సమగ్రముగా పరిశీలించవలెను.

(1) స్థానికపరిస్థితుల కనుగుణ్యముగా వ్యక్తికుండవలసిన వ్యవసాయ భూముల విస్తీర్ణమునకు ఒకపరిమితి నిర్ణయించవలసిన సమస్యను, అట్టి నిర్ణీతమైన పరిమితికి మించియున్న భూముల వినియోగమును గురించి పరిశీలించుట.

(2) నిర్బంధసమీకరణ, సహకారసేద్యము, లేక యితరమార్గముల ద్వారా లాభసాటిగాని చిన్న విస్తీర్ణముగల భూముల సమస్యను సాధించుటకు మార్గములను సిఫారసు చేయుట.

(3) ప్రస్తుతము సంస్థానములో అమలులోనున్న కౌలుదార్ల చట్టము యొక్క సూత్రములను పరిశీలించి, కౌలుదార్ల ప్రస్తుతపరిస్థితి అభివృద్ధిపరచి, భూస్వాములు మరియు కౌలుదార్ల సంబంధములను బాగుచేయుదృష్టితో పై చట్టములో అవసరమార్పులు మరియు సవరణలు సూచించుట.

(4) భూ సంక్రమణ నిరోధకచట్టమును పరిశీలించి ఆచట్టము ప్రస్తుతమున్న ప్రకారమే ఉంచవలయునా అన్న విషయముపై అభిప్రాయమును తెలుపుట లేక ప్రస్తుతపరిస్థితుల ననుసరించి సమంజసములగు మార్పులను సూచించుట.

ప్రత్యేకముగా పై నుదహరించిన విషయముల నేగాక సంస్థానము యొక్క గ్రామీణ ఆర్థికవ్యవస్థ కూలంకషముగా పరిశీలించవలసి యున్నందున, ఈ విచారణకు సంబంధించిన అన్నివిషయములపై ప్రజలు తమ అభిప్రాయములను వెల్లడించుటకు అవకాశ మివ్వవలెనని ప్రప్రథమమున ఈ సమితివారు అభిప్రాయ పడుచున్నారు.

అందుచే విచారణకు సంబంధించిన అన్ని అంశములను తెలియజేయు ప్రశ్నావళిని తయారుచేసి ప్రజలకు తెలియజేయుటకై సమితివారు దానిని ప్రకటించుచున్నారు.

భూసమస్యా పరిష్కారములో అభిరుచిగలవా రందరు ఈ ప్రశ్నావళిలోని కొన్ని ప్రశ్నలకుగాని అన్ని ప్రశ్నలకుగాని జవాబులు ఇవ్వవలసిందిగా కోరబడుచున్నారు. ప్రశ్నావళిలో ఒకవేళ భూసమస్యకు సంబంధించిన ఏ విషయమైనను నిరూపించబడక యున్నయెడల అట్టివిషయములను గురించికూడ జవాబులు యిచ్చువారు తమ అభిప్రాయములు తెలియబరచవచ్చును. జవాబులిచ్చునపుడు తమకు సొంతముగా అనుభవమున్న జిల్లా లేక చిన్న ప్రాంతాలయొక్క ప్రత్యేక విషయములనుగూర్చి విశదీకరించవలెను.

ప్రశ్నావళికి జవాబులు సాధ్యమైనంత తొందరలో 1949 జూలై 15 వ తేదీ దాటకుండా కార్యదర్శికి అందజేయవలెను. ప్రశ్నావళిప్రతులు భూసంస్కరణలసమితి కార్యదర్శికివ్రాసి తెప్పించుకొనవచ్చును.

భూసమస్యను సాధింపుభారమును వహించుచున్న యీ సమితివారికి ప్రజలు ఉపయుక్తములగు సలహాలనిచ్చి తోడ్పడెదరని సమితివారు విశ్వసించుచున్నారు.

[కార్యదర్శిగారి విలాసము :

శ్రీ ఎమ్. శ్రీనివాసరావుగారు, బి. ఎ., ఎమ్. ఎల్.,

కార్యదర్శి, భూ సంస్కరణలసమితి,

భూమాన్యశిస్తుదాయశాఖ కార్యాలయము, హైదరాబాద్-దక్కన్]

20–6–1949.

ఎమ్. శ్రీనివాసరావు,

కార్యదర్శి.

# ప్రశ్నలు : జవాబులు

గమనిక:— ఈ జవాబులలో తెలుపబడిన విషయములు ప్రత్యేకముగా వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగరం, కరీంనగరం జిల్లాలకును, సాధారణముగా మొత్తము తెలంగాణా ప్రాంతమునకును వర్తించును.

---

## ప్రవేశిక

ప్ర. 1. (అ) మీరు పట్టాదారుగాగాని, ఇనాందారుగాగాని, జాగీర్దారుగాగాని, కౌల్దారుగాగాని మరి యేవిధముగానైనగాని భూమిని కలిగియున్నారా?

(ఆ) మీకున్న భూమియొక్క విస్తీర్ణము, కిస్తు (రకం) ఎంత? [వివరములు తెలుపుడు]

జ. 1. (అ) ... ... ... ...

(ఆ) ... ... ... ...

ప్ర. 2. మీరు భూస్వాములయిన [పట్టాదారు, ఇనాందారు లేక జాగీర్దారు] మీ భూములను స్వయముగా సేద్యముచేయుదురా లేక కౌలుదార్లద్వారానా? [స్వయముగా మరియు కౌలుదార్లద్వారా సాగుచేయు భూమియొక్క విస్తీర్ణము మరియు తరగతుల వివరములు తెలియచేయుడు.]

జ. 2. చిన్న లేక మధ్యరకపు పట్టాదారుడు సాధారణముగా పశువులు మేయుటకు కంచెక్రిందవదలి తన మొత్తము భూమిని సేద్యముచేయును. అతను వంశపారంపర్యంగా వ్యవసాయవృత్తిలో లేక యితర జీవనాధారములున్నచో తనభూమిని కౌలుకిచ్చు ఆచారముగూడా యున్నది. పెద్ద భూస్వామి సాధ్యమైనంతభూమి స్వయముగా సేద్యముచేసి, మిగతాభూమిలో కొంత కంచెక్రిందవదలి మిగతాభూమి కౌలుకిచ్చును.

ప్ర. 3. తరీ, ఖుష్కీ, బాగాయతు భూములలో సగటున ఎకరమున కెంత పంట తేలును? [సాధ్యమైనంతవరకు వరి, జొన్న, ప్రత్తి, వేరుశెనగ, బావులక్రింది పైరులు మున్నగు ముఖ్యపంటలకు సంబంధించిన వివరములను వేర్వేరు తెలియజేయుడు. ప్రస్తుత బాజారు ధరలప్రకారము సగటు పంటలయొక్క ధరలు ప్రత్యేకముగా వివరింపుడు.]

జ. 3. అనుబంధము చూడుడు.

ప్ర. 4. సగటున ఎకరమునకు (అ) ఖుష్కి (ఆ) తరి (ఇ) బాగాయతుభూవ్యవసాయపు ఖర్చులెంత? [సాధ్యమైనంతవరకు ముఖ్యమైనపైరుల సేద్యమునకు సంబంధించిన ఖర్చులవివరములను స్పష్టముగాను, సంపూర్ణముగాను వేర్వేరుగా వివరింపవలెను. అనగా దున్నుట, విత్తనములు, కట్టలుపోయుట, ఎరువులుతోలుట, కూలీలు, వ్యవసాయ పశువులధర మరియు పోషణ, సొంతకృషియైనచో పనిచేసిన కాలమునకు పరిహారము మున్నగు వివరాలు తెలుపవలెను.]

జ. 4. అనుబంధము చూడుడు.

## కౌలు

ప్ర. 5. సాగుచేయబడిన మొత్తముభూమిలో యెంతెంత భాగము :

(అ) సొంతముగా భూస్వాములచే, అనగా కుటుంబ సహాయముతో మరియు కూలీలద్వారా,

(ఆ) రక్షిత కౌలుదార్లద్వారా,

(ఇ) ఇతర కౌలుదార్లద్వారా సేద్యము చేయబడుచున్నది?

జ. 5. సాగుచేయబడిన మొత్తము భూమిలో ప్రతిశతి 80 పాళ్లు భూస్వాములచే సేద్యము చేయబడుచున్నది. మిగతా భూమిని ఆసామీషిక్మీచట్టము ననుసరించి కౌలుదారులు సేద్యముచేయుచున్నారు. ఆసామీషిక్మీచట్టము ననుసరించి 10 సంవత్సరములకు తక్కువకాలమునకు కౌలు యిచ్చుటకు వీలులేనందున భూస్వాముల యిష్టా యిష్టాలపై ఆధారపడి యున్న కౌలుదారులు లేరు.

ప్ర. 6. (అ) పంటభూములకు సంబంధించిన కౌళ్ళలో భూస్వాములకును, కౌలుదార్లకును మధ్యన మామూలుగానుండు షరతులేవి?

(ఆ) కౌలు వాక్రూపముగా నుండునా లేక వ్రాతపూర్వకముగా నుండునా? వ్రాతపూర్వకముగా నున్నచో కౌలుకు సంబంధించి వ్రాయబడు దస్తావేజులేవి? [వాని పద్ధతులు మరియు షరతులు తెలియచేయుడు.]

జ. 6. కౌలుషరతులు సాధారణముగా కౌలుపరిమితి మరియు యివ్వవలసిన శిస్తుకు సంబంధించియుండును. కొన్ని సమయములలో వాక్రూపమైన ఒడంబడికలు జరుగును. వ్రాతపూర్వకమైన ఒడంబడిక జరిగినను భూస్వాములు సాధారణముగా ఖుబూలియత్ మాత్రమే వ్రాయించుకొనెదరు. చాల కొద్దిప్రదేశములలో కౌలు ఖుబూలియత్‌లు రెండునూ వ్రాయబడును.

ప్ర. 7. సాధారణముగా కౌలుయొక్క గడువు యెంతయుండును?

ప్ర. 8. సాధారణముగా కౌళ్ళు తిరిగి ఆదేకౌలుదారుకిచ్చెదరా లేక తరచుగా కౌలుదార్లు మారుచుందురా?

జ. 7; 8. ఆసామీ షిక్మీచట్టము అమలులోనికి రాకముందు రిజిష్టరీ చేయించుశ్రమ తప్పించుకొనుటకు సాధారణముగా కౌళ్లు ఒక్కసంవత్సరమునకే వర్తించుచుండెను. మామూలుగా సంవత్సరాల తరబడిగా ఒకే కౌలుదారుకు కౌలుయిచ్చుట సాధారణముగా జరుగుచుండెను. పై చట్టము అమలులోనికి వచ్చినతరువాత కౌలపరిమితి దాని సూత్రముల ననుసరించి ఉంటూయున్నది. ఈ చట్టముక్రింద కౌలుదార్లను తమ యిష్టానుసారము మార్చుట చట్టవిరుద్ధము మరియు కష్టము అగుటవలన భూములను కౌలుకివ్వక తమక్రిందనే వుంచుకొను అభిప్రాయము కొందరు భూస్వాములలో కానవచ్చుచున్నది.

ప్ర. 9. దిగువ నుదహరించిన పద్ధతుల కౌళ్ళ రేట్లెంతయుండును?

(అ) బటాయి (పంటలోభాగము)

(ఆ) నిర్ణీత ధాన్యపుగుత్తా (గల్లామక్తా)

(ఇ) నగదురకము.

[బటాయిపద్ధతిలో పండినపంటలో నొక భాగము కౌలుక్రింద నిర్ణయించుకొనబడును. గల్లామఖ్తా పద్ధతిలో పంటతోనిమిత్తము లేకుండా కొన్ని మణుగులు లేక బస్తాలు (సంచులు) ముందుగానే నిర్ణయించుకొనబడును. తరి, ఖుష్కి, బాగాయతు భూములకు ప్రస్తుతము ఆచరణలోనున్న వివిధ కౌళ్ళరేట్లు వేర్వేరుగా తెలియజేయుడు. బావులు, చెరువులు, రిజర్వాయర్లు, కాలవలు మున్నగు వివిధ జలాధారములచే పారుదలయగు భూముల కౌళ్ళరేట్లు వేర్వేరు వివరించవగును.]

జ. 9. దిగువ నుదహరించిన పద్ధతులలో నొకదాని ననుసరించి కౌలు చెల్లించబడును.

(అ) పంటలో నొక భాగము (బటాయి),
(ఆ) నిర్ణీత ధాన్యపుగుత్తా (గల్లామఖ్తా),
(ఇ) నగదురకము.

(అ) "బటాయికౌలు":— తరీభూముల విషయములో నిది ఆచరణలో నున్నది. ఆయాప్రాంతాల పరిస్థితుల ననుసరించి కొద్ది భేదము లున్నను యీ పద్ధతిలో భూస్వామికి పంటలో సగముభాగ మివ్వబడును. సామాన్యముగా కోత మరియు కొట్టుకూళ్ళుమాత్రమే యిరువురు సమానముగా భరించెదరు. కొన్ని ప్రదేశాలలో విత్తనములు, నాటుకూళ్ళు, కలుపుకూళ్ళు, కోత మరియు కొట్టుడుకూళ్ళు భూస్వాములు మరియు కౌలుదార్లు సమానముగా భరించెదరు. ఇంచుమించుగా అన్ని ప్రదేశాలలో భూశిస్తును భూస్వామియే చెల్లించును.

బావులక్రింది తరీభూముల విషయములో కోత మరియు కొట్టుడు కూళ్ళు మినహాయించినతరువాత మిగిలినపంటలో భూస్వామికి మూడింట ఒకభాగము యివ్వబడును. బాగాయతు మున్నగు భూములవిషయములో గూడా యిట్టివిధానమే అమలులోనున్నది.

(ఆ) "గల్లామఖ్తా" [నిర్ణీతమైన ధాన్యపుకౌలు]:- ఈ విధానము కొన్ని తరీభూములలో మాత్రమే ఆచరణలో నున్నది. భూసారము, నీటిపారుదల సౌకర్యముల ననుసరించి రేటు 6 మణుగులనుండి 12 మణుగుల

(ఇంపీరియల్) వరకుండును. ఖుష్కీ మరియు బాగాయతు భూములలో యీ విధానము సాధారణముగా కానరాదు.

(ఇ) ''నగదురకము'':— తరిభూముల విషయములో నగదురకము తీసుకొను ఆచారము చాలా అరుదుగానున్నది. అది అమలులోనున్నను ప్రతి తాలూకాకు వేర్వేరుగా నున్నది.

(i) చెరువులక్రింది తరీభూములు (ఎకరము ఒక్కంటికి రూపాయలు):—

| | | |
|---|---|---|
| మహబూబాబాద్ తాలూకా | ... | 40 నుండి 80 |
| వరంగల్ తాలూకా | ... | 60 నుండి 100 |
| పాఖాల తాలూకా | ... | 40 నుండి 80 |
| సూర్యాపేట తాలూకా | ... | 40 నుండి 80 |
| జనగామ తాలూకా | ... | 40 నుండి 80 |
| మిర్యాలగూడెము, నల్లగొండ, దేవరకొండ తాలూకాలు | ... | 30 నుండి 60 |
| ఖమ్మం తాలూకా | ... | 60 నుండి 100 |
| భువనగిరి తాలూకా | ... | 30 నుండి 60 |

(ii) బాగాయతు భూములు :—

| | | |
|---|---|---|
| జనగామ తాలూకా | ... | 10 నుండి 20 |
| నల్లగొండ, భువనగిరి తాలూకాలు | ... | 8 నుండి 12 |
| వరంగల్ తాలూకా | ... | 15 నుండి 60 |

(iii) ఖుష్కీ భూములు:— బటాయి మరియు గల్లామఖ్తా పద్ధతులు వర్తించవు. నగదురకమే చెల్లించబడును.

''చెల్క'' భూములు:— ''చెల్క'' ప్రదేశాలలో కౌలుకేటు ఎకరము ఒక్కంటికి 4 నుండి 15 రూపాయలవరకు ఉండును. ఖమ్మం మధిర తాలూకాలలో జొన్నపంటకు 10 నుండి 15 రూపాయలవరకున్న వేరుశెనగపంటకు 25 నుండి 50 రూపాయలవర కున్నది.

"రేగడి" (ప్రత్తిపండు నల్లభూమి):— 10 నుండి 30 రూపాయలవరకు మారుచుండును.

ప్ర. 10. భూస్వాములు, కౌలుదార్లమధ్య ప్రభుత్వశిస్తు, వ్యవసాయపుఖర్చులు, గడ్డి లేక చొప్ప విషయమై వివిధ కౌలువిధానములక్రింద యెట్టి యేర్పాటులుండును?

జ. 10. అన్ని విధానములలోను సాధారణముగా భూస్వామియే ప్రభుత్వశిస్తు చెల్లించును. గడ్డి లేక చొప్ప యెల్లప్పుడు కౌలుదారుకే చెందును.

ప్ర. 11. బటాయికౌళ్ల పద్ధతిలో కౌలక్రిందవచ్చు ధాన్యపువెల ఎంత?

జ. 11. ఇది అంచనా వేయవలసిన అంశము. బటాయి కౌలురేటు 6 నుండి 12 మణుగుల వడ్లవరకు మారును. దీనిధర 60 నుండి 120 రూపాయలవరకుండును.

ప్ర. 12. కౌళ్ళపై చేయబడు భూముల సర్కారీరకమునకు వాటి కౌలురకము యెన్నివంతులుండును?

జ. 12. ములుగుతాలూకాలో తరీభూముల సర్కారీరకము 6 నుండి 8 రూపాయలవరకున్నది. ఇతరప్రదేశాలలో 10 నుండి 17 రూపాయలవరకున్నది. కౌలురేటు సగటున భూశిస్తుకు ఏడురెట్లున్నది.

"బాగాయతు" భూములవిషయములో కౌలురేటు సర్కారీరకమునకు సుమారు 20 రెట్లున్నది. ఈ భూములు చాలా అరుదుగా కౌలుకు యివ్వబడును.

"ఖుష్కి" భూముల విషయములో కౌలురేటు సర్కారీరకమునకు 4 నుండి 12 రెట్లవరకున్నది.

ప్ర. 13. కౌలురకములు అప్పుడప్పుడు హెచ్చింపబడుచుండినవా? అట్లయినచో యెప్పుడెప్పుడు ఎంతెంత?

జ. 13. "బటాయి" మరియు "గల్లామక్తా" విధానములలో కౌలురకములు హెచ్చింపబడవు. ఖుష్కిభూముల నగదురకము కొంతవరకు

హెచ్చింపబడినది. కాని యీ హెచ్చింపు ధరల హెచ్చింపుకు సరిపోదు. గత కొన్ని సంవత్సరాలలో ఖుష్కీభూముల నగదురకములు నగటున 2 నుండి 3 రెట్లు అధికమైనవి.

ప్ర. 14. కౌలు యిచ్చునపుడు భూస్వాములు ముందుగా బయానా, నజరానా లేక కౌలుగకములో కొంతభాగము యివ్వమని అడిగెదరా?

జ. 14. బయానా లేక నజరానా వసూలు చేయబడదు. చాలా కొద్దిమంది ముందుగానే కౌలురకము వసూలుచేయుదురు.

ప్ర. 15. నిర్ణయించుకొనిన కౌలురకము కాక భూస్వాములు డబ్బుగాని ధాన్యముగాని వసూలుచేసెదరా? లేక వెట్టిచేయమని నిర్బంధించెదరా?

జ. 15. నిర్ణయించుకొనిన కౌలురకముకాక డబ్బుగాని ధాన్యముగాని వసూలుచేయుట, నిర్బంధపుచాకిరి చేయించుకొనుట గత రెండుదశాబ్దాలనుండి అమలులోలేదు.

ప్ర. 16. ప్రస్తుతపు కౌలురేట్లు న్యాయసమ్మతముగా నున్నవా? లేక అతి భారముగాను ఎక్కువగాను ఉన్నవా?

జ. 16. ప్రస్తుతము అమలులోనున్న కౌలురేట్లు న్యాయసమ్మతముగా నున్నవి. పరిసర భారత అధినివేశ జిల్లాలలోని కౌలురేట్లతో పోల్చిచూచినచో నిచటిరేట్లు తక్కువగా నున్నవి. ఖుష్కీభూముల విషయములో పంటలధరలు పెరిగినట్లు కౌలురేట్లు అధికముకాలేదు.

ప్ర. 17. కౌలురకములు సక్రమముగా చెల్లింపబడుచున్నవా లేక బకాయిపడుచున్నవా?

జ. 17. కౌలురకములు సాధారణముగా పరిమితి దాటకముందే చెల్లించబడును. గత రెండుసంవత్సరాలనుండి సంస్థానములోనున్న అల్లరి పరిస్థితులవలన రకములు సక్రమముగా చెల్లించబడుటలేదు.

ప్ర. 18. కౌలురకము బకాయీలపై వడ్డీ కట్టెదరా? కట్టినచో యెంత?

జ. 18. చాలా కొద్దిమంది బకాయీలు పెట్టెదరు. వారిపై గూడా వడ్డీ తీసుకొను ఆచారములేదు.

ప్ర. 19. పంటలు పూర్తిగాగాని, కొంతభాగముగాని నష్టమగుచో భూస్వాములు కౌలుదార్లకు మాఫీలుగాని తగ్గింపులుగాని ఇచ్చెదరా? [భూస్వాములు ఇంతకు పూర్వము ఎప్పుడైన ఇట్టి తగ్గింపులు, మాఫీలు కౌలుదార్ల కిచ్చినయెడల వాటివివరములు తెలియజేయుము ]

జ. 19. "బటాయి" లో తగ్గింపు సమస్యయేలేదు. ఇతర రెండు విధానములలో న్యాయసమ్మతమైన తగ్గింపు చేయబడును. భూస్వాములు కౌలురకములో చేయు తగ్గింపు ప్రభుత్వమువారు భూశిస్తులో చేసిన తగ్గింపు కన్న సాధారణముగా అధికముగానే యుండును. ఈ విషయములో భూస్వామి కౌలుదారు సంబంధాలు స్నేహపూర్వకముగా నున్నవి. వర్షాలు లేకపోవుట, చీడలు, వరదలు మున్నగు కారణములవలన పైరు నష్టమైనచో కౌలురకము తగ్గించబడును.

ప్ర. 20. కౌళ్ళలో కౌలురకము మరియు ముద్దతు (కాలపరిమితి) తో సంబంధించిన షరతులు కాక కౌలుదార్లు ఆ భూములలో వేయవలసిన పైరులవిషయమై నిర్బంధితమైన షరతులేవైన పెట్టబడునా? [అట్టి షరతులేమైన యున్న వాని పూర్తివివరములు తెలియజేయగలరు.]

జ. 20. వేయవలసిన పైరులవిషయములో భూస్వాములు ఎట్టి నిర్బంధములు పెట్టరు. ఈ విషయములో ప్రభుత్వ నిర్బంధములున్నవి. సాగుచేయుబడిన మొత్తము భూమిలో ప్రత్తి, వేరుశెనగ మున్నగు నగదు పైరులు మూడింట ఒకభాగము మించి వేయగూడదను నిషేధమున్నది.

ప్ర. 21. ఈ క్రిందివిషయములలో భూస్వాములకు రైతులకు మధ్య సామాన్యముగానుండు ఏర్పాట్లు ఎట్టివి?

(అ) బావులు త్రవ్వుట, కట్టించుట.

(ఆ) బావుల మరమ్మతు (బాగుచేయుట.)

జ. 21. భూస్వామియే బావులు త్రవ్వించి వానిని బాగుచేయును.

ప్ర. 22. కౌలుభూములలో కౌలుదార్లచే నాటబడిన లేక యితర వృక్షములను గురించి భూస్వాములు కౌలుదార్లకు మధ్యనుండు హక్కుల విషయమై సామాన్యముగానుండు ఏర్పాట్లు ఎట్టివి?

జ. 22. కౌలుదార్లు చెట్లునాటరు. చెట్లు ముందునుండియే యున్నచో సామాన్యముగా కౌలుదారుకు వానిపై లేక వానిఫలములపై యెట్టి హక్కు వుండదు.

ప్ర. 23. కౌలురకములు చెల్లించునపుడు భూస్వాములు కౌలుదార్లకు రసీదులను ఇచ్చెదరా? అట్టి రసీదులనకలు ప్రతి (Counterfoil) భూస్వాములవద్ద నుండునా?

జ. 23. కొన్ని సందర్భాలలో రసీదులు ఇచ్చెదరు. కొన్ని సందర్భాలలో యివ్వరు. కాని కౌలుదార్లు కావలెనని కోరినచో తప్పకుండా యివ్వబడును. అచ్చువేసినరసీదులు యిచ్చినపుడు నకలుప్రతులు ఉండును. చేతివ్రాత రశీదులు యిచ్చినపుడు నకలుప్రతులుండవు. రసీదులు లేకపోవుటమూలమున ఎట్టి తగాదాలకు తావివ్వలేదని యీ సందర్భములో చెప్పవలసియున్నది.

ప్ర. 24. కౌలుదార్లను తరచుగా తొలగించుట సామాన్యమా? అట్లయినచో కారణము లేమి?

జ. 24. కౌలురకము సక్రమముగా చెల్లించబడినచో కౌలుదార్లను మామూలుగా తొలగించరు. భూస్వామి తన సేద్యమునకు భూమిని తీసుకొనినప్పుడు దానికిబదులు సాధారణముగా మరొకభూమి యివ్వబడును. భూస్వామికి వేరేభూమి లేనపుడు ఆసామీ షిక్మీచట్టము ౧౨ య మాలననుసరించి కౌలుదారు తొలగించబడును. కొన్నిప్రదేశాలలో పై చట్టపు నియమాలు ఉల్లఘింపబడినవి.

ప్ర. 25. గడచిన పదిసంవత్సరములలో కౌలుదార్లు ఎక్కువ తరచుగా తొలగింపబడినారా?

జ. 25. ఆసామీ షిక్మీచట్టము అమలులోనికి వచ్చినతరువాత భూస్వాములు సొంతసేద్యముక్రిందికి తీసుకొనుటవలన మాత్రమే కౌలుదార్లు తొలగింపబడినారు. సమష్టికుటుంబములలో భాగస్వాములు వేరుపడుటవలన గత పది పదునైదు సంవత్సరములనుండి యెక్కువభూమి సొంతసేద్యముక్రిందికి తీసుకొనబడినది.

ప్ర 26. గడచిన పదిసంవత్సరములలో భూస్వాముల సొంతసేద్యములక్రింద నున్న భూవిస్తీర్ణము ఎక్కువ అయినదా? అయినచో అట్టి హెచ్చింపునకు కారణమేమి?

జ. 26. అవును. సమష్టి కుటుంబములు వేరుపడుటవలనను, వ్యవసాయపుధరలు అధికముగా పెరుగుటవలనను సొంతసేద్యముక్రింద నున్న భూవిస్తీర్ణము ఎక్కువ అయినది.

ప్ర. 27. భూస్వాములు వ్యవసాయపు పనులకై డబ్బుగాని, ధాన్యముగాని పెట్టుబడి పెట్టెదరా? అట్లయినచో పెట్టుబడులు లేక బాకీల షరతులేమి?

జ. 27. మామూలుగా భూస్వాములు డబ్బుగాని ధాన్యముగాని పెట్టుబడి పెట్టరు. కాని భూస్వాములవద్ద విత్తనములు లేక యితరధాన్యము నిలవలు అధికముగా నున్నచో వారు కేవలము తమ కౌలుదార్లకేగాక యితరులకుగూడా అప్పుపెట్టెదరు. ఇట్టిసందర్భములో వారికి నూటికి 25 పాళ్ళు అధికముగా చెల్లించబడును. సాధారణ భూస్వాములు డబ్బు అప్పుగా యివ్వరు.

ప్ర. 28. కౌలుదార్లు సేద్యముచేయు భూములవిషయములో భూస్వాములు "తనఖీ" రూపముగా లేక మరేవిధమైన శ్రద్ధ తీసుకొనెదరా?

జ. 28. సాధారణముగా భూస్వాము లెట్టిశ్రద్ధ వహించరు. "బటాయి" పద్ధతి ననుసరించి కౌలుకిచ్చిన భూములవిషయములో ఎరువు వేయునపుడు కోయునపుడు భూస్వాములు శ్రద్ధవహించెదరు. ప్రకృతిపై ఆధారపడు కారణాలవలన భూమికి నష్టము సంభవించినచో భూస్వాములే అవసరమైన విధముగా బాగుచేయించెదరు.

ప్ర. 29. భూములు బాగుచేయుట లేక ఎద్దులు మున్నగునవి కొనుటకు భూస్వాములేమైన తోడ్పడెదరా?

జ. 29. సాధారణముగా తోడ్పడరు. కొందరు భూస్వాములు ఎరువులు మరియు విత్తనములు కొనుటకు డబ్బు సహాయము చేసెదరు. చాలా కొద్దిసందర్భములలో పశువులను కొనుటకు డబ్బు అప్పుగా యివ్వబడును.

ప్ర. 30. కౌలుదార్లను తొలగించినపుడు, భూములు బాగుచేసినందుకుగాని వారునాటిన వృక్షములకుగాని భూస్వాములు కౌలుదార్లకు ఏమైన నష్టపరిహార మిచ్చెదరా?

జ. 30. సాధారణముగా కౌలుదార్లు భూములను బాగుచేయరు. అందువలన నష్టపరిహారమిచ్చు సమస్యే తలయెత్తదు.

ప్ర. 31. భూమిలోపండు మొత్తముపంటకును కౌలురకమునకును గల దామాషా యెంత?

జ. 31. చెరువు పారకమున్న భూములవిషయములో కౌలురకము మొత్తముపంటలో నూటికి సుమారు 35 నుండి 45 పాళ్ళవర కుండును. బావులక్రింది పారకముగల భూములకు నూటికి సుమారు 25 నుండి 30 పాళ్ళవరకును, ఆహారధాన్యములు వేయు ఖుష్కీ-భూములకు నూటికి సుమారు 15 నుండి 25 వరకును, నగదుపంటలువేయు భూములకు నూటికి 25 నుండి 40 వరకును ఉండును.

ప్ర. 32. మీకు తెలసినంతవరకు చాలా హెచ్చయిన కౌలురకములెంత? [అట్టి భూములున్న గ్రామము, భూమియొక్క తరగతులు మున్నగు వివరములు తెలియ చేయుడు.]

జ. 32. మాకు తెలిసినంతవరకు చాలా హెచ్చయిన కౌలురకములు క్రిందివిధముగా నున్నవి:—

(అ) "తరీభూములు":— వరదన్నపేట, వడ్లకొండ మరియు సీర్మాల గ్రామాలలో 15 నుండి 18 మణుగుల (ఇంపీరియల్) వరకున్నవి.

(ఆ) "బాగాయతుభూములు":— వరంగల్ తాలూకాలోని మల్లకాపెల్లి, దేవన్నపేట, ధర్మాపురం గ్రామాలలో ఎకరమునకు 55 రూపాయలవర కున్నది.

(ఇ) "ఖుష్కీ-భూములు".— భారత అధినివేశ ప్రాంతముల పరిసరములోనున్న మధిర ఖమ్మం తాలూకాల రేగడిభూముల

కౌలురకములు చాలా ఎక్కువగానున్నవి. బొమ్మకల్లు, గోకినే పల్లి, సోమావరం, వెంకటాయపాలెం, రాయన్నపేట, చిరు నోముల, ఎఱ్ఱుపాలెం గ్రామాలలో సగదుపైరులకు ఎకరము ఒక్కంటికి కౌలురకము 100 రూపాయలు మించియున్నది.

పైన తెలిపిన భూములు అతిసారవంతమైనవి. సాధారణభూములకు వీనికి చాలా వ్యత్యాసముండును. పంట వర్షములపై ఆధారపడి యుండును గాన యీ భూములకుగూడా ప్రతిసంవత్సరము యిట్టికౌళ్ళురావు.

ప్ర. 33. మీదృష్టిలో పలువిధములైన భూములకు న్యాయసమ్మతమైన కౌలు రకము లెంతయుండవలెను?

జ. 33. చెరువులు మరియు కాలువల నీటిపారకముగల తరీభూములకు గడ్డి కలుపుకొని మొత్తముపంటలో మూడింట ఒకభాగ ముండవలెను. కొచ్చిన్ భూసంస్కరణల సమితివారిట్టి సిఫారసు చేసియున్నారు. ఖుష్కీభూములకు చొప్పతోసహా మొత్తముపంటలో నాలుగింట ఒకభాగ ముండవలెను. బొంబాయి కౌలుచట్టము దీనిని అమలులో పెట్టుచున్నది. బాగాయతుభూములు మరియు బావులక్రింది తరీభూములకు గడ్డితోసహా మొత్తముపంటలో నాలుగింట ఒకభాగ ముండవలెను. పైన తెలిపిన అన్ని సందర్భములలోను భూశిస్తును, భూస్వామి కౌలుదారు సమానముగా భరించవలెను. కౌలుదారుడే భూశిస్తును భరించవలెనని కొచ్చిన్ భూసంస్కరణల సమితివారు సిఫారసుచేసిరి.

ప్ర. 34. (అ) న్యాయసమ్మతములగు కౌలురకములు నిర్ణయించునపుడు యేయే విషయములను విచారించవలసి యుండును?

(ఆ) న్యాయసమ్మతములగు కౌలురకములు భూశిస్తు దామాషాపై నిర్ణయించవలెనా లేక భూమిలోపండు పంటదామాషాపై నిర్ణయించవలెనా?

జ. 34. (అ) (i) కవులురకము భూమియొక్క బజారుధరకు ప్రతిశతి 6 కు మించి యుండరాదు.

(ii) భూసారము మరియు నీటిపారుదల సౌకర్యాలు.

(ఆ) ప్రస్తుతము అమలులోనున్న భూశిస్తుకు వ్యవసాయపు ధరలతో యెట్టిసంబంధములేదు. కవులురకము అట్లుగాక పంటయొక్క బజారు ధరలతో సంబంధము కలిగియుండవలెను.

ప్ర. 35. (1) పండినపంటలో కొంతభాగము లేక దానికి సరియైన ధరకట్టి కవులురకముగా చెల్లించుట మేలని మీరుతలంచినచో, ఈ క్రింది భూములపై ఎంతభాగము చెల్లించవలెనని తలంతురు?

(అ) ఆహారధాన్యములు పండు తరీభూములు

(౧) బావులక్రింద

(౨) చెరువులక్రింద

(౩) ఇతర జలాధారములక్రింద

(ఆ) సామాన్యపు పంటనిచ్చు ఖుష్కీభూములు.

(ఇ) చెరుకు, పసుపు, ప్రత్తి, వేరుశెనగ, బాగాయతు మున్నగు నగదుపంటలు పండు యితరభూములు.

(2) మీరుసూచించు భాగము లేక పాలు మొత్తముపంటలోనా లేక నికరమైన ఆదాయములోనా?

జ. 35. (1) (అ) ఆహారధాన్యములు పండు తరీభూములు:—

(౧) బావులక్రింద—మొత్తము పంటలో ప్రతిశతి 25.

(౨) చెరువులక్రింద—మొత్తముపంటలో ప్రతిశతి $33\frac{1}{3}$

(౩) కాలువలక్రింద—మొత్తముపంటలో ప్రతిశతి $33\frac{1}{3}$

(ఆ) సామాన్యపు పంటనిచ్చు ఖుష్కీభూములు—మొత్తముపంటలో ప్రతిశతి 25.

(ఇ) నగదుపంటలు పండించు యితరభూములు—మొత్తముపంటలో ప్రతిశతి 25.

(2) సూచించినభాగము మొత్తముపంటకు సంబంధించినదే.

ప్ర. 36. కౌలురకము ప్రభుత్వశిస్తుపై ఆధారపడి యుండవలెనని మీరు తలంచినచో పై ప్రశ్నలో చెప్పబడిన వివిధతరగతులకు చెందిన భూముల ప్రభుత్వ శిస్తునకును, కౌలురకమునకు ఏమిదామాషా (తనాసుబు) వుండవలెను?

జ. 36. ఇదివరకే చెప్పబడిన ప్రకారము కౌలురకము భూశిస్తుపై ఆధారపడి యుండరాదు. భూశిస్తు స్థిరముగానుండి పంటలధరల హెచ్చుతగ్గులతో సంబంధములేదు.

ప్ర. 37. పంటలో కొంతభాగముగాని, కౌలురకముగాని మొత్తము సంస్థానమునకు లేక ప్రత్యేక ప్రాంతములకొరకు నిర్ణయించుట మేలని తలంతురా లేక హైదరాబాదు అసామీ షిక్మీచట్టము 12 వ సూత్రములోనున్న దానికన్న ఎక్కువ వివరముగా, న్యాయసమ్మతమైన రేట్లనువిధించు పద్ధతులను వివరించి, ఎప్పుడైన వివాదము యేర్పడినపుడు న్యాయస్థానము లేక ఒక అధికారిద్వారా ఆయా సందర్భములనుబట్టి కౌలురకములు నిర్ణయింపబడ వచ్చునని మీ అభిప్రాయమా?

జ. 37. న్యాయాధికారములుగల సంస్థద్వారా పరిశీలన చేసిన తరువాత వివిధప్రాంతములలోని అన్ని తెగలకు జెందిన భూముల కౌలురకములు నిర్ణయించబడుట సమంజసమని మేము అభిప్రాయపడుచున్నాము. పంటలు చెడిపోయిన సంవత్సరములలో ప్రభుత్వము భూశిస్తులో తగ్గింపు చేసిన దామాషాప్రకారము భూస్వామిభాగము తగ్గించబడవలెను. కౌలుదారు కోరినచో నతడు కౌలురకము నగదురూపముగా చెల్లించవచ్చును.

పైనచెప్పిన సంస్థనిర్ణయమే తుదినిర్ణయముగా నుండరాదు. దానిని న్యాయస్థానముముందు ప్రవేశపెట్టు అవకాశ ముండవలెను.

ప్ర. 38. పండినపంటలో కొంతభాగము లేక నిర్ణీతమగు కొంతధాన్యము (గల్లామక్తా) ఇచ్చుపద్ధతులను రద్దుచేసి, కౌళ్ళరకములన్నియు నగదురూపముగా మాత్రమే చెల్లించుట వాంఛనీయమా?

జ. 38. కౌలురకములు ధాన్యరూపముగా చెల్లించుట మంచిది. ఎప్పటికప్పుడు తీవ్రముగా మారు పంటల ధరలప్రభావము వీనిపై బడదు. ఉభయపక్షాలు సమ్మతించినచో ధాన్యమునకు బజారుధరకట్టి నగదురూపముగా చెల్లించవచ్చును.

ప్ర. 39. బజారుధరల మార్పుల ననుసరించి లేక మరియే కారణములవలననైన కౌళ్ళరకములు హెచ్చించుటకును, తగ్గించుటకును అవకాశముండవలెనని తలంతురా?

జ. 39. కౌలురకములు ధాన్యరూపేణా చెల్లించబడినచో బజారు ధరల ననుసరించి కౌలురకములు హెచ్చించు లేక తగ్గించు సమస్య బయల్దేరదు.

ప్ర. 40. 1354 ఫసలీ హైదరాబాదు ఆసామీ షిక్మీచట్టము నం. 1. యొక్క నియమములు మీ గ్రామములోను, పరిసర ప్రాంతములలోను సాధారణముగా తెలియునా?

జ. 40. కొంతకాలము క్రిందటివరకు అవి బాగుగా తెలియవు.

ప్ర. 41. పైచట్టము మీ గ్రామములోగాని పరిసర ప్రాంతములలోగాని అమలులోనున్నదా? కౌలుదార్ల భూస్వాముల మధ్య సంబంధములు యీ చట్టములో నుదహరించిన నియమముల ననుసరించి అమలులో నున్నవా?

హైదరాబాద్ ఆసామీ షిక్మీచట్టముయొక్క 3, 23 సూత్రములను ముఖ్యముగా గమనింపవలసి యున్నది.

3 వ సూత్రము : ఏదైనా భూమియొక్క కౌలుదారు ఈక్రిందిపరిస్థితులలో రక్షిత కౌలుదారుగా భావించబడును:—

(అ) 1348 ఫసలీ ఆజూరు ఒకటవ తేదీకి సరిగా కనీసము 6 సంవత్సరములకు పూర్వమువరకు కౌలుదారుగా ఆ భూమియందు స్వాధీనము కలిగియుండి,

(ఆ) పైనచెప్పబడిన కాలములో ఆభూమిని తాను సొంతముగా సేద్యముచేసి యుండిన,

వివరణ (౧)— 1348 ఫసలీ ఆజూరు ఒకటవతేదీనాడు భూమియొక్క స్వాధీనము కలిగియున్న వ్యక్తికి ఆ స్వాధీనము ఇంకోవ్యక్తివలన వారసత్త్వముద్వారా సంక్రమించినను, లేక ఆవ్యక్తి కౌలుదారు హోదాలో భూమియొక్క స్వాధీనము కలిగియుండి అట్టి మరొకవ్యక్తికి వారసుడై యుండినను, ఈదఫా (సూత్రము) ప్రకారము ఆరుసంవత్సరముల గడువు లెక్కించుటలో మరొకవ్యక్తి కౌలుదారు హోదాలో భూమియొక్క స్వాధీనము కలిగియున్న కాలముకూడా కలుపబడును.

వివరణ (౨)— 1348 ఫసలీ ఆజూరు ఒకటవతేదీనాడు భూమియొక్క స్వాధీనము కలిగియున్న వ్యక్తి అదే తేదీకి పూర్వము ఆరుసంవత్సరముల కాలములో ఎప్పు

రైనా, ఆదేగ్రామములో ఆదేభూస్వామియొక్క మరొకభూమిని కౌలుదారుహోదాలో స్వాధీనములో నుంచుకొనియుండి తాను సొంతముగా సేద్యము చేసియుండినచో, ఈ దఫా [సూత్రము] ప్రకారము ఆరుసంవత్సరముల కాలము లెక్కించుటలో ఇటువంటి మరొకభూమిని స్వాధీనములో ఉంచుకొనిన కాలముకూడా కలుపబడును.

వివరణ (3)— ఇరువురుగాని, అంతకుమించిన సంఖ్యగల వ్యక్తులుగాని, ఏదైనా భూమియొక్క స్వాధీనమును కౌలుదారు హోదాలో సమష్టిగా కలిగియుండి, వారిలో ఏ ఒక్కరైనను, సొంతముగాను వరుసగాను సేద్యము చేయుచుండినచో— ఈ దఫాలోని యితరషరతులుకూడా పూర్తియైనచో—ఇటువంటి వ్యక్తులందరును ఆ భూమియొక్క రక్షిత కౌలుదార్లుగా భావించబడుదురు.

23 వ సూత్రము:— (1) ఈ శాసనము అమలులోనికి వచ్చినతరువాత ఇవ్వబడిన కౌలుగడువు పదిసంవత్సరములకు తక్కువ కాలము ఉండజాలదు. ఒడంబడిక లేక ఆచారము లేక శాసనములో ఇందుకు విరుద్ధముగా ఆజ్ఞ ఉన్నప్పటికిని ఈ శాసనము ఆచరణలోనికి వచ్చినతరువాత ఇవ్వబడిన కౌలును కేవలము గడువు తీరిపోయినదను కారణమున పదిసంవత్సరములలోపల అంతమొందించుటకు వీలులేదు.

జ. 41. 1947 నుండి సంస్థానములో అల్లరిపరిస్థితులున్నవి. 1946 లేక ఆప్రాంతములో అమలులోనికి వచ్చిన యీ చట్టము యేవిధముగా పనిచేయుచున్నదో తెలిసికొనుట కష్టము.

ఈ చట్టముయొక్క నియమములు తెలసిన భూస్వాములు కౌలుదార్ల సంబంధములు పై చట్టముయొక్క నియమముల ననుసరించి యున్నవి.

ప్ర. 42. హైదరాబాదు ఆసామీ షిక్మీచట్టములో కౌలుదార్లకు కలుగజేయబడిన లాభములు వారు పొందుచున్నారని తలంతురా? అట్లు కానిచో కారణము లేమి?

ప్ర. 43. పైచట్టము సంస్థానములోని కౌలుదార్లకు ప్రయోజనకారి అయినదా లేదా?

జ. 42, 43. ఈ చట్టము అమలులోనికి వచ్చినవెంటనే యేర్పడిన కల్లోలపరిస్థితుల కారణమున యీ చట్టముయొక్క నియమములు యెంత

వరకు ప్రయోజనకారిగా పరిణమించినవో తెలిసికొనుట కష్టమని యిది వరకే తెలుపబడినది.

ప్ర. 44. ప్రస్తుత పరిస్థితుల ననుసరించి కౌలుదార్లకు హైదరాబాద్ ఆసామీ షిక్మీచట్టముయొక్క నియమములు చాలునని మీ అభిప్రాయమా? లేక కౌలుదారుల స్థితిగతులను బాగుచేయుటకు ఏమైన సవరణలు అవసరమా? మీరు ఎట్టిసవరణలను సూచించెదరు? [మీ సూచనలకు కారణములను తెలియజేయుడు.]

జ. 44. కౌలువిధానముయొక్క సహజ లోపములదృష్ట్యా దానిని నిర్మూలించుటతప్ప యే యితరమార్పులు చేసినను కౌలుదారుల పరిస్థితి బాగుకాదనియు ఉత్పత్తి అధికముకాదనియు నా దృఢాభిప్రాయము. ఈ చట్టములో ఎట్టి లాభదాయకమైన సవరణలు చేసినను కౌలుదారుల ఆటంకములు పూర్తిగా దూరముకావు.

# వ్యవసాయదారులు కానివారికి భూమిపరివర్తన

ప్ర. 45. వ్యవసాయభూమిని వ్యవసాయము చేయువారినుండి వ్యవసాయము చేయనివారికి సంక్రమించుట నిరోధించుటకై సిద్ధముచేయబడిన "1349 ఫసలీ వ్యవసాయ భూపరివర్తన నిరోధకచట్టము నం 3." [The Prevention of Agricultural Land Alienation Act No. 3 of 1349 Fasli] యొక్క నియమములలో లోపను లున్నవని తలంచెదరా?

ప్ర. 46. పై చట్టముయొక్క అమలువిషయమై మీ అనుభవము, అభిప్రాయము ఏమి?

ప్ర. 47. నేటి పరిస్థితులదృష్ట్యా పైచట్టములో ఏమైనమా [illegible], సవరణలు అవసరమని తలంచుచున్నారా? అట్లయినచో అవి ఏమి?

జ. 45; 46, 47. ఈ చట్టము అన [illegible] స్థానములోని మతవర్గములలో వ్యవసాయదారులు, వ్యవసాయదారులు కానివారు అను స్పష్టమైన విభాగములేదు. అన్నిమతములలో వ్యవసాయదారులు, వ్యవసాయదారులు కానివారున్నారు.

# వ్యక్తిగత భూప్రమాణములు

(Sizes of Holdings)

ప్ర. 48. మీ గ్రామములో లేక మీ పరిసర ప్రాంతములలో ఒక వ్యక్తికిగాని కుటుంబమునకుగాని ఉన్న గరిష్ట, కనిష్ట మరియు సగటు భూవిస్తీర్ణ ప్రమాణము లెంత?

జ. 48. వ్యక్తిగత భూప్రమాణములు ప్రభుత్వ లెక్కలశాఖ (Statistics Department) తెలిపిన అంకెల ననుసరించి క్రిందివిధముగా నున్నవి:—

| జిల్లా. | 5 వేల ఎకరములకు మించినవి. | 2,500 నుండి 5 వేల ఎకరములవరకు | వెయ్యినుండి 2,500 ఎకరములవరకు |
|---|---|---|---|
| వరంగల్ | 1 | 10 | 77 |
| నల్లగొండ | ... | 8 | 56 |
| కరీంనగరం | ... | 6 | 53 |
| మహబూబునగరం | 1 | 6 | 19 |
| మొత్తము సంస్థానము | 11 | 49 | 444 |

కనిష్ట భూప్రమాణము ఎకరమునకు తక్కువగూడా యున్నది. సరియైన అంకెలు లేమిచే సగటు భూప్రమాణమును నిర్ణయించుట దుస్సాధ్యము.

ప్ర. 49. వ్యవసాయ భూప్రమాణములలో అధికభాగము ఆర్థికముగా లాభించని చిన్న విస్తీర్ణములుగా నున్నమాట వాస్తవముకాదా?

జ. 49. అవును.

ప్ర. 50. వ్యవసాయపు భూములలో అధికభాగము కొద్దిమంది హక్కుభుక్తములలో నున్నదా? అట్లున్నచో పై పరిస్థితి అసంతృప్తికర పరిణామము పొందినదా? [కారణములు తెలియచేయుడు.]

జ. 50. వ్యవసాయపు భూములలో అధికభాగము చాలా కొద్ది మంది హక్కుభుక్తములలో నున్నవని చాలాఅపోహాలున్నవి. ఈ భూములలో అధికభాగము ప్రభుత్వాధీనములోనున్న అడవులచే నిండియున్నవనియు, కొంతభాగము వ్యవసాయయోగ్యముకాని గుట్టలచే నిండియున్నదనియు గ్రహించబడుటలేదు. వెయ్యి ఎకరములకు మించి సొంత సేద్యము చేయువారు చాలా అరుదు. ఇదిపోను ఏమైనభూమి మిగిలియున్నచో కౌలుదారులకు కౌలుకివ్వబడును.

సాధ్యమైనంతభూమిని సాగుబడిచేయు ఉద్దేశముతో ప్రభుత్వము కొన్నిసంవత్సరములకిందట అడవులుకొట్టి, ఆ విధముగా సేకరించినభూమిని తదితర విశాలమైన బీళ్ళను వ్యవసాయయోగ్యము చేయుటకు కొందరు ఉత్సాహావంతులైన వ్యక్తులను ప్రోత్సహించి యుండెనను విషయమును మరువరాదు. ఆ వ్యక్తులు ఆరంభదశలో చాలా నష్టములకోర్చి, అసాధారణ ధైర్యము, నిరంతరకృషి వలన ఆ కార్యము సాధించిరి.

వ్యవసాయపుధరలు ప్రస్తుత ఉన్నతస్థాయిలోనికి రాకపూర్వము ఈ భూములలోని అధికభాగములో భూశిస్తు వెళ్లెడిదిగాదు. ఇప్పుడుకూడా నల్లగొండజిల్లా కొన్ని ప్రాంతాలలోను, మరికొన్ని ప్రదేశాలలోను ఎకరమునకు ఒకటి రెండు రూపాయల కౌలురకము వచ్చు భూములున్నవి.

ప్ర. 51. ఒక వ్యక్తికిగాని కుటుంబమునకుగాని ఉండతగిన భూమికి ఒక గరిష్ట పరిమితి ఉండవలయునా? అట్లయినచో మీరుసూచించు గరిష్ట పరిమితి ఎంతగా యుండవలెను. ఆ గరిష్ట పరిమాణమునకు మించి భూమియున్నవారు ఇంకా భూములను సంపాదించకుండా నిరోధించబడవలయునా? నిర్ణీతమైన గరిష్టపరిమాణమును మించియున్న భూములను ఏమిచేయవలయును?

ప్ర. 52. మీరు గరిష్టపరిమాణ మొకటి ఉండవలయునని అభిప్రాయపడుచో అట్టి గరిష్టపరిమాణము పెద్దపెట్టున చాలాభూమిని నవీనపద్ధతులతో సొంతహక్కుగలిగి వ్యవసాయముచేయు వ్యక్తులకుకూడా వర్తించవలయునా?

ప్ర. 53. మీరు సూచించిన గరిష్టపరిమాణము తనభూమిని సొంతముగా సేద్యముచేయు వ్యక్తికికూడా వర్తించవలెనా?

జ. 51; 52; 53. విస్తీర్ణముయొక్క ప్రస్తావనలేక ఒకవ్యక్తి సొంతముగా సేద్యముచేయు భూమి కలిగియుండవలెనని నివేదికలో యిదివరకే చెప్పబడినది. భూస్వామి కౌలుకిచ్చిన భూమికాక యేదైనభూమి మిగిలియున్నచో సరియైన పరిహారమిచ్చి ప్రభుత్వము లేక కౌలుదారు తీసుకొను అవకాశ ముండవలెను.

పశుసంపదను అభివృద్ధిచేయుట, పాడిపరిశ్రమ, జాయింట్‌స్టాక్ లేక సహకారపద్ధతిపై యంత్రసహాయముతో పెద్దపెట్టున వ్యవసాయము చేయుటకొరకు ప్రత్యేక సౌకర్యములు కలిగించవలెను. ప్రభుత్వముచే నిర్ణయించబడు న్యాయసమ్మతమైన హద్దుననుసరించి ఒకవ్యక్తి తన భూప్రమాణమును ఎక్కువ చేసుకొనుటకుగాని కౌలుకిచ్చినభూమి సొంతసేద్యము క్రిందికి తీసుకొనుటకుగాని అవకాశ ముండవలెను.

తన భూములను సొంతముగా సేద్యముచేయు వ్యక్తి కలిగియుండు భూమికి గరిష్టహద్దు ఉండరాదు. ఈ విషయము నివేదికలో ప్రస్తావించబడినది. మేము సూచించినట్లు అన్నివృత్తులలోను సమాన ఆదాయ అవకాశాలుండవలెను. ఇతరవృత్తులలో గరిష్టఆదాయముపై హద్దులేనప్పుడు ఒక్క వ్యవసాయములో మాత్రమే అట్టిహద్దు నిర్ణయించుటకు యెట్టి కారణము లేదు. ఈ విధముగా నిర్ణయించుట అసందర్భముగానుండి వర్గద్వేషము కలిగించును. ఇట్టిహద్దును నిర్ణయించుటకు బలవత్తరమైన కారణములున్నవని సమితివారు అభిప్రాయపడినచో వ్యవసాయమువలనవచ్చు ఆదాయము నెల ఒక్కంటికి 4 వేల రూపాయలు మించరాదని నిర్ణయించనగును. కాంగ్రెస్ ఆర్థిక ప్లానింగ్ కమెటీవారు దీనిని ఒకవ్యక్తి గరిష్ట ఆదాయముగా నిర్ణయించియున్నారు. అందుచే ఒకవ్యక్తి గలిగియుండు భూప్రమాణము యీ ఆదాయముపై ఆధారపడి యుండవలెను.

ప్ర. 54. హిందూ అవిభక్త (సమష్టి) కుటుంబములకు గరిష్టపరిమాణము ఎక్కువ ఉండవలెనా?

జ. 54. అవును. సమష్టి కుటుంబముయొక్క ప్రతివ్యక్తికి అతని వ్యక్తిగతహోదాలో నిర్ణీత గరిష్ట భూప్రమాణము కలిగియుండుహక్కు

ఉండుటవలన యిట్లులేనిచో సమష్టికుటుంబములు విభాగమగును. సమష్టి కుటుంబములో భాగమునకు హక్కుగలవ్యక్తు లెంతమంది యుందురో గరిష్టపరిమాణమునకు అన్ని రెట్లభూమి కలిగియుండుటకు సమష్టికుటుంబములకు హక్కు ఉండవలెను. హిందూ అవిభక్త కుటుంబములలో ప్రతి వ్యక్తి వ్యవసాయపు పనులలో తనకర్తవ్యము నెరవేర్చుచుండును. వారి వ్యవసాయము ఇంచుమించుగా సహకారపద్ధతిపై నడచుచున్న విషయము దృష్టియందుంచుకొనవలెను.

ప్ర. 55. గరిష్టపరిమాణమునకు మించియున్న భూములను ప్రభుత్వము తీసుకొనవలయునా? అట్లయిన ఏపద్ధతిపై తీసుకొనవలెను?

జ. 55. సొంతసేద్యముక్రింద కాక మిగిలియున్నభూమిని పరిహారమిచ్చి తీసుకొనవలెను. మా నివేదికలో సూచించిన పద్ధతిననుసరించి స్వాధీనము చేసుకోవచ్చును.

ప్ర. 56. వ్యక్తులకు వివిధతరగతుల భూములలో కనిష్టముగా ఎంతెంతయున్నచో నది "ఆర్థిక ప్రాతిపదిక" [Economic holding] యగును? [ప్రస్తుతపు వ్యవసాయపద్ధతులపై మామూలు సంవత్సరములలో వ్యవసాయదారునకు అవసరఖర్చులన్నియుపోను, తాను తనకుటుంబము మనదేశ సాంప్రదాయములకనుగుణ్యముగా అప్పు చేయకుండా తగుపద్ధతిమీద జీవితము గడపుటకు సరిపోవు ప్రతిఫలమునిచ్చు విస్తీర్ణముగలభూమి "ఆర్థికప్రాతిపదిక" [Economic holding] అనబడును.]

జ. 56. వ్యవసాయదారునకు నెలఒక్కంటికి 150 రూపాయల ఆదాయము నివ్వగల కనిష్ట భూవిస్తీర్ణమును "ఆర్థిక ప్రాతిపదిక" గా పరిగణింపవలెను.

ఋతువులయొక్క అవకతవకలవలన గలుగు పరిస్థితిని దూరము చేయుటకు తరీ ఖుష్కీ రెండువిధముల భూములను సేద్యముచేసి మిశ్రమ వ్యవసాయము చేయుట అవసరము. ఇట్లు చేసినచో వ్యవసాయదారుని ఆర్థికవ్యవస్థ సమన్వయమగును. భూసారము తదితర పరిస్థితులదృష్ట్యా

కనిష్ఠ "ఆర్థిక ప్రాతిపదికలు" వివిధ తాలూకాలలో క్రిందివిధముగా నుండవలెను.—

(అ) వరంగల్, మహబూబ్ ఆబాద్, పాఖాల, ఖమ్మం, మధిర, జనగాను, హుజూర్ నగరం తాలూకాలు, సూర్యాపేట తాలూకాలోని కొన్ని ప్రాంతములు:—

(i) 8 ఎకరముల తరీభూమి. 64 ఎకరముల ఖుష్కీభూమి, [ఖుష్కీభూమిలో 44 ఎకరముల "చెల్క" లేక "ఎఱ్ఱ" భూమి, 20 ఎకరముల రేగడిభూమి యుండుట మంచిది];

లేక (ii) తరీభూమి మాత్రమే యున్నచో 20 ఎకరముల అట్టి తరీభూమి;

లేక (iii) ఖుష్కీభూమి మాత్రమే యున్నచో 120 ఎకరముల అట్టి ఖుష్కీభూమి [ఇందులో 90 ఎకరముల "చెల్క" లేక "ఎఱ్ఱ" భూమి మరియు 30 ఎకరముల రేగడిభూమి యుండవలెను];

లేక (iv) "చెల్క" లేక "ఎఱ్ఱ" భూమి మాత్రమే యున్నచో 150 ఎకరముల అట్టిభూమి;

లేక (v) రేగడిభూమి మాత్రమే యున్నచో 75 ఎకరముల అట్టి భూమి.

(ఆ) నల్లగొండ, మిర్యాలగూడెం, దేవరకొండ తాలూకాలు, సూర్యాపేట తాలూకాలో కొన్ని ప్రాంతములు:—

(i) 20 ఎకరముల తరీ మరియు 150 ఎకరముల ఖుష్కీభూమి;

లేక (ii) తరీభూమి మాత్రమే యున్నచో 35 ఎకరముల అట్టి తరీభూమి;

లేక (iii) ఖుష్కీభూమి మాత్రమే యున్నచో 400 ఎకరముల అట్టి ఖుష్కీభూమి.

గమనిక 1 :— కరీంనగరంజిల్లా అధిక ప్రాంతములలో భూములు వరంగల్, మహబూబ్ ఆబాద్ తాలూకాల భూములవలె నున్నవి. మహబూబ్ నగరంజిల్లా అధికప్రాంతముల భూములు నల్లగొండ దేవరకొండ తాలూకాల భూములవలె నున్నవి.

గమనిక 2 :— కాలమాన పరిస్థితుల ననుసరించి ప్రతిసంవత్సరము తరీభూమిలో సగటున ప్రతిశతి 75 పాళ్ళకుమించి సేద్యము చేయుట దుస్సాధ్యము.

గమనిక 3 :— పైన తెలుపబడిన ఎకరములలో సాధారణ సారము గల భూములే చేర్చబడినవి.

గమనిక 4 :— ఒకజత ఎద్దులను పోషించుటకు కంచెక్రింద 2 ఎకరములభూమి, పశుగ్రాసము పండించుటకు ఒక ఎకరముభూమి ప్రత్యేకించుట అవసరమని గుర్తించవలెను.

గమనిక 5 :— ఏవో కొన్ని పరిస్థితులలోతప్ప కేవలము తరీ వ్యవసాయము చేయుట ఆచారముకాదు.

గమనిక 6 :— వ్యక్తిగత భూపరిమాణమును నిర్ణయించునపుడు ప్రతి 5 సంవత్సరములలో ఒకసారి పంటలు పూర్తిగా ఫలించవను విషయమును దృష్టియం దుంచుకోవలెను.

గమనిక 7 :— ఖుష్కీ భూములలో పైరులను మార్చుటకు మొత్తముభూమిలో మూడింట ఒకభాగము లేక నాలుగింట ఒకభాగము పడావా (బీడు) ఉంచవలసియుండును.

ప్ర. 57. (అ) ఒకజత మంచిఎద్దులు ఎంతభూమిని దున్నగలవు?

(ఆ) ఒక వ్యవసాయదారుడు అతని కుటుంబము, సొంతముగాగాని, కూలీల సహాయముతోగాని ఎంతభూమి సక్రమముగా సేద్యము చేయగలడు?

జ. 57. (అ) ఒకజత మంచిఎద్దులు క్రింద తెలిపిన భూమిని దున్నగలవు:—

(1) 2 ఎకరముల తరీభూమి మరియు 8 ఎకరముల ఖుష్కీ ("చెల్క") భూమి;

లేక (2) భూపరిస్థితి ననుసరించి 3 నుండి 4 ఎకరముల తరీభూమి;

లేక (3) 15 నుండి 20 ఎకరముల ఖుష్కీ "చెల్క" భూమి;

లేక (4) 12 నుండి 15 ఎకరముల రేగడిభూమి.

గమనిక 1 :— పైన తెలుపబడిన తరీభూములు చెరువులు లేక కాలువల నీటిపారకముగలవి. మోటలద్వారా నీటిపారకముచేయు బావులక్రింది తరీభూములకు మూడు రెట్లు ఎద్దులజత లుండవలెను.

గమనిక 2 :— మధిర తాలూకాలోని కొన్నిప్రాంతములలో ఉపయోగించబడు పెద్దరకపు ఒంగోలుసంతతి ఎద్దులు 20 నుండి 25 ఎకరముల రేగడిభూమి దున్నును.

(ఆ) కూలీల సహాయము లేకుండా ఎంత కొద్దిపాటి భూవిస్తీర్ణమునైనను సేద్యముచేయుట అసాధ్యమని మేము సమితివారికి నొక్కి చెప్పదలంచుచున్నాము. ఈ నిజపరిస్థితిని కొందరు ఆర్థికవేత్తలు గుర్తించరు. ఎంత చిన్న భూవిస్తీర్ణమునకైనను నాటువేయుట, కలుపుతీయుట, పంట కోయుట మున్నగు సమయములందు కూలీలను నియమించక తప్పదు. రోజు ఒక్కంటికి ఒక ఎకరము నాటువేయుటకు 25 మంది, కలుపుతీయుటకు 12 మంది, కోయుటకు 12 మంది కూలీలు అవసరము. ఈ పనులన్నియు నిర్ణీతమైన కొద్దివ్యవధిలోనే పూర్తి చేయవలసి యున్నందున అనేకమంది కూలీలను నియమించు అవసర మేర్పడును.

అందుచే నొక సాధారణ వ్యవసాయదారుడు కూలీలసహాయముతో సేద్యము చేయగలుగు భూమియొక్క గరిష్టపరిమాణము అతనికున్న సహాయదారుల సంఖ్య, డబ్బు కూలీలు మున్నగు విషయములలో నతనికున్న అవకాశాలు మరియు పలుకుబడిపై ఆధారపడియుండును.

ప్ర. 58. వ్యక్తిగత గరిష్ట భూపరిమాణము "ఆర్థిక ప్రాతిపదిక" [Economic holding] కు కొన్నిరెట్లుగా ఉండవలెనా? అట్లయినచో ఆ దామాషా యేవిధముగా నుండవలెను?

జ. 58. గరిష్ట భూపరిమాణము "ఆర్థిక ప్రాతిపదికకు" కొన్నిరెట్లుగా నుండుట కెట్టికారణములు లేవు. ఇట్టిలెక్కలు వేయుటకు ప్రయత్నించుట అసందర్భము.

ప్ర. 59. ఆర్థిక ప్రాతిపదికకు మించిన భూముల క్రయమును, ఆర్థిక ప్రాతిపదికకు తక్కువ భూమికలవారికే చేయవలెనను నిర్బంధము పెట్టవలదా?

జ. 59. ఇట్టిభూములు వ్యవసాయదారులకు మాత్రమే విక్రయించవలెనను ప్రాథమిక నిర్బంధముండవలెను. భూస్వామికి యితరత్రా వచ్చు ధరను యిచ్చుటకు సిద్ధముగానున్నచో ఆర్థిక ప్రాతిపదికకు తక్కువభూమి గలవారలకు విక్రయించవలెను.

ప్ర. 60. ఆర్థిక ప్రాతిపదికను పంచుకొనకుండా వుండునట్లు కట్టుబాట్లు చేయుట మీ కంగీకారమా? అట్లయినచో ఈ ప్రాతిపదికను అవిచ్ఛిన్నముగా నిలబెట్టుటకు ఎట్టిచర్యలు అవలంబించవలెను?

జ. 60. అవిభక్త యోగ్యమైన ఆర్థిక ప్రాతిపదికలు యేర్పాటు చేసినయెడల వారసత్వమునకు సంబంధించిన వ్యక్తిగత చట్టములలో తీవ్రముగా జోక్యము కలిగించుకొనవలసి వచ్చును. దీనివలన కుటుంబ కలహములు అధికమగును. ఇంత విప్లవాత్మకమైన చర్య కై కొనుటకు ప్రజాభిప్రాయ మిప్పుడే సుముఖముగాలేదు.

ప్ర. 61. ఆర్థిక ప్రాతిపదికకన్న తక్కువ విస్తీర్ణముగల భూముల సాగుబడి విధానము ఎక్కువ ప్రయోజనకారిగా చేసి, ఎక్కువఫలితము వచ్చుట కేమార్గములు సూచించెదరు?

జ. 61. ఇట్టి భూపరిమాణముల ఉత్పత్తి అధికముచేయుటకు సహకార వ్యవసాయ విధానమును ప్రయత్నించవచ్చును. ఇట్టి భూస్వాములకు సులభమైన అప్పుసౌకర్యాలుగూడా కలిగించవలెను.

# భూముల సమీకరణ

## (Consolidation of Holdings)

ప్ర. 62. వ్యక్తుల వ్యవసాయభూమి అంతయు ఒక్కచోట లేకుండా చిన్న చిన్న ముక్కలు, లేక చీలికలుగా బహుప్రదేశములలో నున్నదా? ఆ విధముగా నుండుట అసమంజసమా?

ప్ర. 63. వ్యవసాయభూములు చీలికలుగా నుండుటను, చిన్న చిన్న ముక్కలుగా పంచుకొనుటను నిరోధించుట మంచిదికదా?

ప్ర. 64. వ్యవసాయపుభూముల సమీకరణ లాభదాయముకదా?

ప్ర. 65. (అ) భిన్నాభిన్నములుగానున్న వ్యవసాయపు భూములను వ్యవసాయదారులు తమ యిష్టపూర్వకముగా సమీకరణ చేసుకొనుటకేదైన అవకాశ మున్నదా?

(ఆ) లేక అట్టి సమీకరణ విషయములో నిర్బంధవిధానము అమలులో పెట్టవలెనా?

జ. 62; 63; 64, 65, భూములు చాలావరకు చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి యున్నవి. ఇది అసమంజసమైనది. సహకారపద్ధతులపై భూములను సమీకరణ చేయుటయే యీ సమస్యను సరిగా పరిష్కారము చేయగలదు. వ్యవసాయదారులు వారి యిష్టపూర్వకముగా తమ భూములను సమీకరణ చేసుకొను అవకాశము చాలా తక్కువగానున్నది. నచ్చజెప్పు ప్రయత్నములు విఫలమైనచో పంజాబు, సంయుక్త రాష్ట్రాలు, బరోడా సంస్థానము (ఇదిప్పుడు బొంబాయిరాష్ట్రములో లీనమైనది) లలో వలె చట్టములద్వారా బలవంత పెట్టవలెను. చిన్నభూస్వాములకు అప్పు సౌకర్యములు కలిగించి, యీ విధముగా యాజమాన్యము మారినభూములకు స్టాంపు మరియు రిజిష్ట్రేషన్ పన్నులు లేకుండాచేసి ప్రత్యేక సౌకర్యములు కలిగించవలెను.

ప్ర. 66. వ్యవసాయదారులు వారిభూములను సమీకరణ పరచుకొని "ఆర్థిక ప్రాతిపదిక" గా చేసుకొనుటకు భూములమార్పు వగయిరాలకై ప్రత్యేకఅవకాశములు కలిగించవలెనా?

జ. 66. ఒక భాగస్వామి తనభాగమునకు వచ్చిన భూమిని విక్రయించ దలంచినయెడల మొట్టమొదలు యితర భాగస్వాములకు అవకాశ మివ్వబడవలెను. వారలకు సులభమైన అప్పుసాకర్యాలు కలిగించవలెను.

ప్ర. 67. వ్యవసాయపుభూములు, ఇంకా ఎక్కువగా విభజింపబడకుండా యుండగలందులకై వ్యవసాయపు భూములన్నియు ఒకేవారసునకు సంక్రమించునట్లు వుండేలాగున, వారసత్వవిధాన నిబంధనలను మార్పుచేయుటకు మీ రంగీకరింతురా?

ప్ర. 68. నిర్ణీతమైయున్న విస్తీర్ణమునకు తక్కువగాయున్న సర్వేనంబరు, పోటునంబరు యొక్క విభజన నిరాకరించుటకు న్యాయస్థానములకున్నూ, అదేవిధముగా నిర్ణీతమైన విస్తీర్ణమునకు తక్కువభూమికి సంబంధించిన దస్తావేజుల రిజిష్టరీ నిరాకరించుటకు, రిజిష్ట్రేషన్ అధికారులకు అధికారము చట్టరీత్యా ఇచ్చుటకు మీ రంగీకరింతురా?

జ. 67; 68. "ఆర్థిక ప్రాతిపదిక" కన్న చిన్నగానున్న భూవిస్తీర్ణములు విభాగముగాకుండా యుండుటకై వారసత్వ చట్టములలో మార్పులుచేయుట చాలామంచిది. కాని దీనిని వ్యతిరేకించువారు చాలా మంది ఉండెదరు.

## ఇతర విషయములు

ప్ర. 69. సహకార, సమష్టి, ప్రభుత్వ వ్యవసాయపద్ధతుల అభివృద్ధికి ఎట్టి అవకాశములు కలవు? [సహకార వ్యవసాయవిధానములో అందుకుసంబంధించిన భూములపై ప్రత్యేకవ్యక్తులకు హక్కు కలిగి, వాటియొక్క వ్యవసాయముమాత్రము సహకారపద్ధతిపై జరుగును. సమష్టి వ్యవసాయవిధానములో ప్రత్యేకవ్యక్తులకు భూమియందు ఎట్టి హక్కున్నూ ఉండదు. అన్నిహక్కులు సమష్టిగా వ్యవసాయముచేయు రైతుల సంఘమునకుమాత్రమే ఉండును. ప్రభుత్వము తమకు హక్కుగలభూములలో తమ యాజమాన్యముక్రింద వ్యవసాయము చేయించువద్ధతి ప్రభుత్వవ్యవసాయ మనబడును]

జ. 69. భూమిని కలిగియుండవలెనని ప్రతిరైతులో సహజముగానుండు వాంఛను అణంచు సమష్టి మరియు ప్రభుత్వ వ్యవసాయపద్ధతులు

విజయవంతముగా సాగలేదు. కొన్ని సంవత్సరములనుండి సమష్టి వ్యవసాయ విధానము అమలులోనున్న రష్యాలోగూడా కొంతవరకైనా వ్యక్తిగతముగా భూమి కలిగియుండవలెనను అభిప్రాయము కానవచ్చుచున్నది. ఇట్టి విప్లవాత్మకమైన విధానము భారతదేశ రైతులకు సరిపడదు. సమష్టి వ్యవసాయవిధానము ప్రవేశపెట్టబడినచో సంస్థానముయొక్క వ్యవసాయ ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నమగును.

వ్యక్తిగతముగా భూమి కలిగియుండుటను గుర్తించు సహకార వ్యవసాయ విధానమునకు అవకాశములున్నట్లు గోచరించుచున్నది. ఆరంభములో యీ విధానమును క్రిందిభూములలో ప్రయత్నించి చూడవచ్చును:—

(అ) "ఆర్థికప్రాతిపదిక" కు తక్కువగానున్న భూములు;

(ఆ) ఇకముందు వ్యవసాయోగ్యము చేయబడు భూములు. (నివేదిక చూడుడు.)

ప్ర. 70. సహకార వ్యవసాయకేంద్రము సమర్థతగా నడుపుటకు ఎంతటి విస్తీర్ణముగల భూమి ఉండవలెను?

జ. 70. ఇది ఆచరణలోనున్న వ్యవసాయపద్ధతిపై ఆధారపడియుండును. యంత్రసహాయముతో వ్యవసాయము చేసినచో వెయ్యి ఎకరములవరకుండవచ్చును. లేనిచో ఆరంభదశలో 20 నుండి 40 నాగండ్లవలన చేయగలుగు విస్తీర్ణముగా నుండవలెను.

ప్ర. 71. రైతులకు సహకార వ్యవసాయ విధానములలో విశ్వాసమేర్పడి వారు వానిని స్థాపించుటకు ఎట్టి ప్రోత్సాహ సహాయములు కావలెను?

జ. 71. ఇట్టి వ్యవసాయ విధానమువలన రైతులకు లాభము కలుగునని ఆచరణద్వారా నిరూపించి, ప్రచారము ప్రోద్బలము చేయవలెను. శాస్త్రముకన్న అనుభవము గొప్పదని గుర్తించి ప్రభుత్వము వారు ఆరంభములో ప్రతి తాలూకాలో నొక సహకార వ్యవసాయ కేంద్రము స్థాపించి దానివలన కలుగు లాభములను ప్రజలకు చూపెట్ట

వలెను. అంతేగాక సహకారవిధానము ననుసరించి పనిచేయుట కుద్యుక్తు లైన సభ్యులకు కొన్ని ప్రత్యేక సౌకర్యములు కలిగించవలెను.

ప్ర. 72. నిర్ణీత "ఆర్థిక ప్రాతిపదిక" కన్న తక్కువ విస్తీర్ణముగల భూములు సహకార పద్ధతిమీద వ్యవసాయము చేయుటకు నిర్బంధవిధానము అవసరమని మీరు భావించెదరా?

జ. 72. ప్రోద్బలము సఫలముకానియెడల నిర్బంధపరచుట అవసరము. గ్రహించుశక్తి యున్న కొందరు రైతులను ప్రోద్బలముచేసి కొన్ని ప్రదేశములలో సహకార వ్యవసాయపద్ధతి ఆచరణలో పెట్టవచ్చును. ఇది విజయవంతముగా సాగినచో శాసనములద్వారా నిర్బంధము చేయవచ్చును.

ప్ర. 73. సంస్థానములో పరోక్ష భూస్వామ్యము (అనగా భూస్వాములు సొంతముగా వ్యవసాయముచేయక తమభూముల నన్నింటిని కౌళ్ళకిచ్చు విధానము). ఎక్కువగా ఆచరణలో నున్నదా?

జ. 73. ఈ నాలుగుజిల్లాలలో పరోక్ష భూస్వామ్యము ఎక్కువగా అమలులోలేదు. భూస్వాములలో నధికము తమభూముల నన్నింటిని సొంతముగా సేద్యము చేయుదురు. కొందరు పెద్దభూస్వాములు తమ భూములలో నధికభాగము సొంతముగా సేద్యముచేసి, తాము సేద్యము చేయుటకు వీలులేని భూములను కౌళ్ళకిచ్చెదరు.

ప్ర. 74. వ్యవసాయ ఆర్థికవ్యవస్థకు పరోక్షభూస్వామ్యము నిరోధకము కలిగించుచున్నదా? అట్లయినచో పరోక్ష భూస్వామ్యవిధాన నిర్మూలనకు మీరు ఏయే పద్ధతులను సూచించెదరు?

జ. 74. అట్లు నిరోధకము కలిగించుటలేదు. కాని కౌలుకిచ్చిన భూముల ఉత్పత్తి తగ్గిపోవును. మేము సూచించినప్రకారము సరియైన పరిహారమిచ్చి అట్టిభూములను తీసుకొనవచ్చును. న్యాయ్యమైన సందర్భములలో భూస్వాములు ప్రభుత్వముచే నిర్ణయింపబడిన హద్దుకు కట్టుబడియుండి తమ భూపరిమాణమును అధికము చేసుకొనుటకుగాని సొంతసేద్యముక్రిందికి ఎక్కువభూమి తీసుకొనుటకుగాని అవకాశ మివ్వవలెను.

ప్ర. 75 వ్యవసాయపు భూములలో హెచ్చుభాగములు పశువుల మేతనిమిత్తముగాని, పైరులు మార్చుటకుగాని, (Crop Rotation) కూలీలు దొరకకపోవుటవలన గాని; మరి యితరకారణముల వలనగాని సాగుచేయకుండ పడావా పెట్టబడుచున్నవా?

జ 75. ఎక్కువ భూభాగములు బీళ్లుగా వదలివేయబడవు. వ్యవసాయ యోగ్యముకాని భూములు, కంచెలకొరకు మరియు పైరులు మార్చుటకు పడావా ఉంచబడును.

గమనిక:- వ్యవసాయదారుల ప్రాణరక్షణకు తగినయేర్పాట్లు లేనందున కల్లోలితములైన నల్లగొండ, వరంగల్ జిల్లాలలోని కొన్ని ప్రాంతములలో వ్యవసాయదారులు విధిలేక కొన్నిభూములు పడావా ఉంచవలసి వచ్చినది.

ప్ర. 76. భూములన్నిటిని జాతీయము చేయవలెనా? (అనగా భూమిపై ప్రభుత్వమునకు మాత్రమే హక్కుకలిగి, ప్రభుత్వమునకు కర్షకునిమధ్య యితరవర్గములకున్న హక్కులను రద్దుచేసి, సొంతముగా సేద్యము చేయువారికే భూమిపంపకము పరివర్తన మొదలైన విషయములలో కొన్ని కట్టుబాట్లతో సేద్యముచేయు హక్కుమాత్రమే యివ్వబడుపద్ధతి జాతీయముచేయుట అనబడును. ఆట్టి వ్యవసాయదారులు తాము సేద్యముచేయు భూమి పరిసరములలో మాత్రమే నివసించు చుండవలెను.)

జ 76. భూమిపై ఎవరు హక్కుకలిగి యున్నారను విషయము ముఖ్యమైనదికాదు. అది కేవలము చర్చనీయాంశము మాత్రమే. ప్రభుత్వము మరియు కర్షకుని మధ్యనుండు వారలను తొలగించుటయే ప్రధాన విషయము. అప్పుడే వ్యవసాయ నైపుణ్యము అభివృద్ధియై ఉత్పత్తి అధికమగును.

ప్ర. 77. కూలీల సహాయముతో వ్యవసాయము చేయించుపద్ధతిని సొంత వ్యవసాయముక్రింద పరిగణించవలెనా?

జ. 77. సొంత వ్యవసాయముక్రిందనే పరిగణించవలెను. ఎంత చిన్న భూవిస్తీర్ణమైనను భూస్వామి యితరులసహాయములేక సొంతముగా తానొక్కడే సేద్యము చేయలేడు. నాటువేయుట, కలుపుతీయుట,

కోయుట మున్నగు పనులకొరకు కూలీలను నియమించక తప్పదు, సమష్టి వ్యవసాయములో తాత్కాలిక కూలీలు అనవసర మయ్యెదరు. కాని యిట్టి వ్యవసాయ విధానము భారతదేశపు వ్యవసాయదారునకు సరిపడదు [నివేదిక చూడుడు.]

ప్ర. 78. వ్యవసాయయోగ్యమైన బీడుభూములను సాగులోనికి తెచ్చుటకు ఎట్టిపద్ధతులను అవలంబింపవలెను? అట్టిభూములను యేపద్ధతి ననుసరించి పంపకము చేయవలెను?

జ. 78. మహబూబ్ ఆబాద్, ఇల్లెందు, పాల్వంచ, పాఖాల, ములుగ్, మహాదేవ్‌పూర్, లక్సెట్టిపేట మరియు చెన్నూరు తాలూకాల లోను, ఆదిలాబాద్‌జిల్లా యితర ప్రాంతములలోను వ్యవసాయ యోగ్య మైన భూములు చాలాయున్నవి. ఒకకాలములో వ్యవసాయముక్రిందనున్న పాఖాల, లఖ్నవరం, రామప్ప చెరువులక్రింది అధిక తరీభూములు ప్రస్తు తము రాజకుటుంబ వేటభూములై (షకార్గా) యున్నవి. భూములపై ఒత్తిడిగల గ్రామాల అధిక వ్యవసాయజనాభా యీ ప్రాంతములకు వెళ్ళి అచటిభూములను సహకారపద్ధతిపై సేద్యముచేయుటకు ప్రోత్సహింపబడ వలెను. రోడ్లువేసి, రైలుమార్గములు నిర్మించి, మలేరియాజ్వరము రాకుం డాచేసి, నీటిపారుదల సౌకర్యాలు అధికముచేసి యీ ప్రాంతముల పరిస్థి తులు అభివృద్ధిపరచవచ్చును.

ప్ర. 79. కంచెలుతప్ప రెండేండ్లకన్న ఎక్కువ కాలము సాగుచేయక పడావా యున్న భూములను స్వాధీనము చేసుకొనుటకు ప్రభుత్వమునకు అధికారము ఉండ వలెనా?

జ. 79. ఇట్టిభూములు చాలా కొద్దిగానున్నవి. ఏవైన యున్న యెడల తగిన పరిహారమిచ్చి ప్రభుత్వమువారు స్వాధీన పరచుకోవచ్చును. కల్లోలిత జిల్లాలలో పడావాయున్న భూములను వదలివేయవలెను.

ప్ర. 80. రైతులకు పశువుల మేతకొరకు సరిపోవు సౌకర్యములున్నవా? లేనిచో అట్టిపరిస్థితిని బాగుపరచుటకు ఏమిచర్యలు అవసరము?

జ. 80. వ్యవసాయదారులు చాలావరకు తమ ఖుష్కీ-భూములలో కొంతభాగము కంచెక్రింద వదలివేయుదురు. ప్రభుత్వ "బంచరాయి" సాధారణముగా గ్రామములకు దూరముగానుండును. దానిని కాపాడువారెవరు ఉండనందున గడ్డి సరిగా పెరగక ప్రజలకు ఉపయోగపడదు. ఇట్టి పరిస్థితులలో ఆ "బంచరాయి" భూములను ఆర్థిక ప్రాతిపదికకన్న తక్కువ భూవిస్తీర్ణముగలవారల కివ్వవచ్చును. భారత అధినివేశములోని కొన్ని ప్రాంతములో నిట్టి "బంచరాయి" భూములు లేవు. సంస్థానములోని మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతములలోగూడా "బంచరాయి" భూములు లేవు. అంతేగాక "బంచరాయి" భూమి చాలా ఎక్కువగానున్నది. గ్రామములో సేద్యముచేయబడు భూమిలో నూటికి 10 నుండి 20 వరకుండును. సాధారణముగా సారవంతమై వ్యవసాయయోగ్యమైన భూమియే "బంచరాయి" క్రిందనున్నది. కాని గ్రామకమెటీలు యేర్పాటై, "బంచరాయి" భూములపై వానికి అధికారమివ్వబడినచో వానిని ఉండనివ్వవచ్చును.

ప్ర. 81. ఆకు ఎరువు, వ్యవసాయపు పనిముట్లకొరకు కావలసిన కట్టె మున్నగు రైతుల సామాన్య అవసరములు ఏవిధముగా పూర్తియగుచున్నవి?

జ. 81. ఆకుల ఎరువువేయుట యీ ప్రాంతములలో ఆచరణలో లేదు. కంచెలున్న కొందరు వ్యక్తులు దానినుండి లాభపడెదరు.

వ్యవసాయ పనిముట్లకు అవసరమైనకట్టె దూరపు అడవులనుండిగాని, సమీపములోనున్న కట్టెకోపులనుండిగాని కొనెదరు.

ప్ర. 82. పై అవసరములను పూర్తిచేసుకొనుటలో రైతులకేమైన యిబ్బందులున్నవా? అవియెట్లు దూరముచేయనగును?

జ. 82. వ్యవసాయ పనిముట్లకు అవసరమైనకట్టె దూరప్రదేశములనుండి తెచ్చుటకు వ్యవసాయదారులు చాలా వ్యయపడవలసి వచ్చుచున్నది. ఆటవిక వ్యవసాయశాఖలవారే కట్టెను సహకార సంఘముల ద్వారా సరఫరాచేయు బాధ్యత వహించవలెను.

ప్ర. ౮౩. రైతుల ఆర్థిక స్థితిగతులను అభివృద్ధిపరచుటకు మార్గములుగా క్రింద పేర్కొనిన అంశములనుగురించి మీ అభిప్రాయమేమి?

(౧) నవీన వ్యవసాయపద్ధతులద్వారా ఉత్పత్తి అధికము చేయుట.

(౨) రైతులకు వ్యవసాయపు పనిలేనికాలములో ఇతరపనులు కల్పించుట.

(౩) కుటీర పరిశ్రమలను స్థాపించుట.

(౪) సమష్టి లేక సహకార వ్యవసాయ కేంద్రములు స్థాపించుట. పంటల విక్రయమునకై సహకారసంస్థలను నెలకొల్పుట.

(౫) పశువుల భీమావిధానమును ప్రవేశపెట్టుట.

జ. ౮౩. పైన సూచించిన అంశములు నిస్సంశయముగా వ్యవసాయదారుని ఆర్థికపరిస్థితి బాగుచేయుటేగాక ఉత్పత్తిని అధికము చేయును.

(౧) నవీన వ్యవసాయపద్ధతులు లాభదాయకములని నిరూపించుటకు ప్రభుత్వమువారు ప్రతి తాలూకాలో నొక కేంద్రముస్థాపించి ప్రదర్శించవలెను. ప్రదర్శనపూర్వకముగా నిరూపించబడని పద్ధతులను అమలులో పెట్టుటకు వ్యవసాయదారులు సంశయించెదరు.

(౨); (౩) రైతులకు పనిలేనికాలములో తోడ్పడు కుటీరపరిశ్రమలను తత్‌క్షణమే ఆరంభముచేయుట అవసరము. ఇట్టి అవకాశములు కలిగింపబడినచో చిన్నభూస్వాములు మరియు హంగామీకూలీల ఆర్థిక పరిస్థితి బాగుపడును. భూమిలేనట్టి కూలీలకు పెద్దపరిశ్రమలలో అవకాశముండును.

(౪) బహుళ ప్రయోజనాత్మక సహకారసంఘములు సహకార వ్యవసాయము, విక్రయములతో మాత్రమే సంబంధము కలిగియుండక, రైతుల అవసరములన్నియు పూర్తిచేయునవై యుండవలెను. సహకార వ్యవసాయ కేంద్రములను స్థాపించుట సరియైనమార్గములో ఒకమెట్టు. వాటి ఆచరణ అవకాశములను చిన్న భూప్రమాణముల విషయములోను, ఇకముందు వ్యవసాయయోగ్యము చేయబడు భూవిస్తీర్ణముల విషయములోను సంపూర్ణముగా వినియోగించుకొనవలెను.

(౫) పశువులు జాడ్యములవలన వందలసంఖ్యలో మరణించుచున్నవి. సామాన్య వ్యవసాయదారుని సంకుచిత ఆదాయదృష్ట్యా అధిక ధరలున్న యీ దినములలో మరల పశువులనుకొనుట చాలా కష్టము. అందుచే పశువులభీమా విధానమును ప్రవేశపెట్టుట ముఖ్యఅవసరము.

ప్ర. 84. వ్యవసాయదారుల పేదరికమునకు భూమిపైనున్న జనాభా ఒత్తిడియే ముఖ్యకారణమని మీరు తలంచెదరా? అట్లయినచో ఈ ఒత్తిడిని తొలగించు మార్గము లేమి?

జ. 84. భూమిపైనున్న జనాభా ఒత్తిడివలన వ్యక్తిగత భూపరిమాణములు చాలా చిన్నవిగా తయారైౖ, ఆస్తిలో పంపకములు జరుగుచున్నవి. దీనిపరిభావము వ్యవసాయదారులపై పడుచున్నది.

భూమిపైనున్న జనాభా ఒత్తిడియే వ్యవసాయదారుల పేదరికమునకు మూలకారణమని చెప్పుట సత్యదూరము. జనాభా ఒత్తిడివలన వ్యక్తులకు "ఆర్థిక ప్రాతిపదిక" కన్న తక్కువ విస్తీర్ణముగల భూములు లభించుట వాస్తవమే. కాని కేవలము దీనివలననే వ్యవసాయదారుల పేదరికము సిద్ధించినదని చెప్పుటకు అవకాశములేదు. ఈ అభిప్రాయమే నిజమైనచో పెద్ద వ్యవసాయదారులకు వ్యవసాయము చాలా లాభకారిగా నుండవలెను, కాని నిజపరిస్థితి దీనికి విరుద్ధముగా నున్నది. యుద్ధకాలములో ధరలు పెరుగువరకు చిన్న పెద్ద అను తారతమ్యములేక వ్యవసాయదారులందరు ఒకేవిధమైన హీనదశలోనుండిరి. ఈ సమస్య మా నివేదికలో విపులముగా చర్చింపబడినది.

కుటీర మరియు పెద్ద పరిశ్రమలు స్థాపించి, భూమియొక్క ఉత్పత్తి అధికముచేసి ఈ ఒత్తిడిసమస్యను పరిష్కారము చేయవచ్చును.

ప్ర. 85. ప్రస్తుతము వ్యవసాయదారులకు అప్పులు ఏయేవిధములుగా లభించుచున్నవి?

జ. 85. చాలావరకు గ్రామసాహుకార్లే అప్పులనిచ్చెదరు. సహకార సంఘములు చాలా కొద్దిసందర్భములలో తోడ్పడును.

ప్ర. 86 మొత్తముపంటలో నాలుగవవంతు అప్పులిచ్చువారికి వడ్డీక్రింద పోవు చున్నదని చెప్పుచుందురు. దీనితో మీరు ఏకీభవించెదరా? అట్లయినచో యీ సాలు వారీ నష్టమును ఏవిధముగా అంత మొందింపవలెను?

జ. 86. సామాన్య వ్యవసాయదారుడు తన మొత్తము ఆదాయ ములో నొక పెద్దభాగమును వడ్డీక్రింద సాహుకార్లకు చెల్లించు కాలము గూడా యుండెను. ప్రస్తుతము కాలముమారినది. వ్యవసాయదారుని పరిస్థితి యీ విషయములో ఆశాజనకముగా నున్నది. వ్యవసాయపుధరలు అధికముగానున్న యీ సమయములో అతడు అప్పులపాలై యున్నట్లు దృష్టాంతములు లేవు. సాధారణముగా నతడు తనపంటలను నిర్బంధము లేకుండా విక్రయించుకొని సాధ్యమైనంత అధికధర రాబట్టుకొనును. అప్పులు తగ్గింపబడుననియు, పూర్తిగానే చెల్లించబడదనియు భీతి యేర్ప డుటవలన గ్రామసాహుకార్లు పూర్వంవలె అప్పులు పెట్టుటకు వెనుదీయు చున్న విషయము గుర్తింపతగినది.

మారిన రాజకీయ వాతావరణము మరియు సాహుకార్లలో యేర్ప డిన భీతిదృష్ట్యా ఇకముందు గ్రామవాసులకు అప్పులుపుట్టుట కష్టము. అందువలన వారలకు సహకార సంఘములద్వారా సులభముగా అప్పు లిచ్చు యేర్పాట్లు చేయవలెను. అప్పులిచ్చునట్టి సహకారసంఘముల స్థాపనమాట యెత్తక శాసనరీత్యా వడ్డీరేటు తగ్గించుట మున్నగు విష యములు తలపెట్టినచో యెట్టిప్రయోజన ముండదు. బీద మరియు మధ్య రకపు రైతుల ఆర్థికవ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నమగుటయే దీని పర్యవ సాన మగును.

ప్ర. 87. ధనరూపేణ లేక ధాన్యరూపేణ (నాగులు) వ్యవసాయదారులకు అప్పులుపెట్టుచున్న సాహుకార్లు ఏరేట్లప్రకారము వడ్డీ వసూలుచేయుచున్నారు?

జ. 87. డబ్బుపై సంవత్సరమునకు ప్రతిశతి 10 నుండి 12 వరకు వడ్డీయుండును. ధాన్యపుఅప్పు (నాగులు) పై సుమారు నాలుగవవంతు వడ్డీ క్రింద తీసుకొనెదరు.

ప్ర. 88. సహకార పరపతిసంఘములు అప్పులసమస్యను దూరము చేయుటకు వ్యవసాయదారులకు ఎంతవరకు తోడ్పడినవి? సహకార పరపతిసంఘములు వ్యవసాయదారులనుండి వసూలుచేయుచున్న వడ్డీరేట్లు సమంజసముగా నున్నవా? సహకార సంఘములు వ్యవసాయదారులకు సహాయపడగలిగినవా? లేనిచో ఎందువలన? సహకారసంఘములు రైతులకు ఎక్కువగా ప్రయోజనకరముగా నుండుటకు మీరుచేయు సూచనలు ఏమి?

జ. 88. సహకార పరపతిసంఘములు ఈ సమస్యయొక్క దరిదాపుకు చేరలేదు. అవిచాలా కొద్దిగాను దూరదూర ప్రదేశములలోను యుండుట మొదటివిషయము. తీసుకొను వడ్డీరేటు సంవత్సరమునకు ప్రతిశతి 9 గా నుండుట రెండవవిషయము. అప్పులు తీసుకొనుటకు అనేక ప్రయత్నములుచేసి చాలాకాలము వేచియుండవలసి వచ్చుట మూడవ విషయము. గ్రామస్థుల అజ్ఞానము నాలుగవవిషయము. సహకార పరపతిసంఘములు దూరముగా నుండుట, వాని అధికారులలో ప్రబలియున్న అవినీతి యితర ముఖ్యవిషయములు. పైనచెప్పిన లోపములను దూరముచేసి, సహకార సంఘములవలన గలుగు లాభములను గ్రామస్తులకు ప్రచారముద్వారా విశదపరచి, వారీపద్ధతులు అవలంబించుటకు ప్రోద్బలము చేయవలెను.

ప్ర. 89. ఋణపరిష్కార సంఘములు వ్యవసాయదారుల ఋణసమస్యను ఎంతవరకు పరిష్కరింప కలిగినవి?

జ. 89. ఈ సందర్భములో ఋణపరిష్కార సంఘములు ఉపయోగమైన పనిచేసినవి. కొన్ని ప్రదేశములలో ఋణభారమును చాలావరకు తగ్గించుటకు అవి తోడ్పడినవి. వడ్డీరేటు అత్యధికముగా నున్నచోట యివి సహకరించినవి.

ప్ర. 90. ఋణపరిష్కార సంఘముల కార్యాచరణ విధానములో ఏమైన లోపములున్నవా? వీనిని అభివృద్ధిపరచుటకు మీ సూచనలేమి?

జ. 90. వానిని అధికశ్రద్ధతో ఆచరణలోపెట్టి అన్ని జిల్లాలలో స్థాపించవలెను.

ప్ర. 91. ప్రభుత్వముచే స్థాపించబడిన ధాన్యాగారములు (Grain Banks) రైతుల కొంతవరకు ఉపయోగపడుచున్నవి? వాటిని అభివృద్ధిపరచుటకు మీసూచనలేమి?

జ. 91. ధాన్యాగారములనుండి చాలా కొద్దిమంది లాభము పొందినారు. వానిని నడుపు వ్యక్తులకే వానివలన లాభము కలుగును,

ప్ర. 92. భూమిగిర్వీ బ్యాంకులను [Land Mortgage Banks] స్థాపించవలెనా?

జ. 92. భూమిగిర్వీ బ్యాంకులు చిరకాలవాంఛితములు. వానిని సత్వరమే స్థాపించవలెను.

ప్ర 93. ఒకవ్యక్తి మరియు అతనికుటుంబము, కూలీల సహాయముతోగాని లేకుండాగాని చేయు వ్యవసాయమును ఎక్కువ ఫలవంతముగాను, సమర్థతతో కూడినదిగాను చేయుటకు మీ సూచనలేమి?

జ. 93. మేముచేసిన వివిధసూచనలను అమలులో పెట్టవలెను.

ప్ర. 94. వ్యవసాయదారుడు పండించిన పంటలకు సరియైనధరలు లభించుచున్నవా? కానిచో అతనికి న్యాయసమ్మతమైన ప్రతిఫలము వచ్చునట్లు చేయుటకు మార్గములేవి?

ప్ర. 95. ప్రస్తుతము అమలులోనున్న వ్యవసాయోత్పత్తి విక్రయ విధానము ఏవిధముగానైన లోపముగా నున్నదా? అయినచో యీ విధానమును సంస్కరించుట యెట్లు?

జ. 94; 95. ఆహారధాన్యముల కొరతదృష్ట్యా అతని సరకులకు న్యాయసమ్మతమైన ధరలు వచ్చుచున్నవని చెప్పవచ్చును. కాని సాధారణముగా అతనికి న్యాయమైనధర లభించదు. దీనికి అనేక ఆటంకములున్నవి :

(౧) ధాన్యము నిలువచేసుకొను సౌకర్యములు లేకపోవుట; (౨) అప్పు తిరిగి చెల్లించమని ఋణదాత నిర్బంధము; (౩) సమీపములో విక్రయ సౌకర్యములు లేకపోవుట; (౪) ఉత్పత్తిచేసిన వస్తువులను విక్రయ

కేంద్రములకు రవాణాచేయు సౌకర్యములు లేకపోవుట; (౫) అతనికి వచ్చుధర ఆర్థికముగా లాభదాయకముగా నుండకపోవుట.

వ్యవసాయపు పంటలధరలను ఉత్పత్తి వ్యయముల ఆధారముపై నిర్ణయించవలెను. ఇందులో రైతు గౌరవప్రదముగా జీవితము గడపుటకు సరిపోను ఖర్చులు చేర్చవలెను. ప్రతిసంవత్సరము ధరలను నిర్ణయించుటకు ధరల నిర్ణయసంఘములను స్థాపించవలెను.

సమీపప్రాంతములలో విక్రయ కేంద్రములు లేకపోవుటవలన రైతు యొక్క పంటలకు సరియైనధర లభించుటలేదు. విక్రయ కేంద్రముల సంఖ్య అధికముచేసి గ్రామములవద్దనుండి అచటికి రోడ్లు వేయవలెను. అన్ని విక్రయకేంద్రములలో నిలువచేయు సౌకర్యములుండవలెను. సహకారపద్ధతి ననుసరించి విక్రయముచేయు విధానమును అభివృద్ధిచేయుట అవసరము.

ప్ర. 96. విత్తనములు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సరఫరాచేయుటకు, ఋణములిచ్చుటకు, వ్యవసాయోత్పత్తిని విక్రయించుట మొదలైన వ్యవసాయిక అవసరముల నన్నింటిని నిర్బంధ సహకార విధానముద్వారా తీర్చుటకు మీరుసుముఖులా?

ప్ర. 97. వ్యవసాయదారుల అవసరములన్నియు తీర్చుటకు బహుళ ప్రయోజనాత్మక సహకారసంఘములు (Multi-purpose Co-operative Societies) స్థాపించవలెనని మీరు సిఫారసు చేయుదురా?

జ 96; 97. ఎంత ఉత్తమ ఆశయములుగల సంస్థనైనను నిర్బంధముగా ప్రవేశపెట్టవలదు. సామాన్య గ్రామస్థుడు పాతపద్ధతులనే అవలంబించు ఆసక్తికలిగి యుండుట, సహకారసంఘములు పనిచేయు విధానమువలన అతడు యీ సంఘములద్వారా లాభపడుటకు వెనుదీయును. ఈ సంఘములు లాభదాయకములని ప్రదర్శనద్వారా నిరూపించి, ప్రచారముచేసి ప్రోత్సాహపరచినచో గ్రామస్థులకు యీ సంఘములపట్ల సదభిప్రాయము యేర్పడవచ్చును. సహజముగా గ్రహణశక్తిగల గ్రామస్థుడు అవశ్యముగా తనంతటతానే యిట్టిసంఘములు కావలెనని కోరును. అతని

సర్వ అవసరములను పూర్తిచేయు బహుళ ప్రయోజనాత్మక సహకార సంఘములు స్థాపించి అభివృద్ధిచేయవలెను. ఈ సంఘములు విజయవంతముగా సాగుట లేక స్థంభించిపోవుట వానిని నడిపించు అధికారులకృషి మరియు నడవడిపై ఆధారపడియుండును.

ప్ర. 98. రైతులకు ఇబ్బంది కలిగించునట్టిగాని, వ్యవసాయ ఆర్థికవ్యవస్థకు నష్టదాయకమైనట్టిగాని శాసనములు లేక నిబంధనలు ఏమయిన అమలులోనున్నవా? ఉన్నచో వానివివరములు తెలిపి అందులో చేయవలసిన మార్పులను, సవరణలను సూచింపుడు.

జ. 98. (౧) భూశిస్తు:— ప్రస్తుతము అమలులోనున్న ప్రభుత్వ శిస్తు సమంజసముగాలేదు. అది శాస్త్రవిరుద్ధముగాను అక్రమముగాను యున్నది. ఈ విధముగా భూశిస్తును నిర్ణయించుటకు స్థిర ఆదాయమే ప్రధాన ప్రాతిపదికగా నుండెను. కాని వ్యవసాయపుధరలు తీవ్రముగా మారుచున్న యీ రోజులలో యిట్టివిధానమునే పాటించుట అసందర్భముగా నున్నది. అందుచే ధరలతో సన్నిహిత సంబంధముగల శిస్తు ఉండు శాస్త్రీయ విధానమును అమలులో పెట్టవలెను.

"భారతదేశములో శిస్తునిర్ణయ విధానము మరియు శిస్తుయొక్క రేటు రెండున్నూ అనిర్ణీతముగా నుండుట ఆక్షేపణీయ విషయములు."
(Indian Rural Problems– by Sir Manilal Nanavati and J. J. Anjaria.)

ఈ విషయమును దృష్టిలోనుంచుకొని పంజాబు, బొంబాయి, బెంగాల్, ఆసామ్, సింధు రాష్ట్రములలో వివిధసంస్కరణలు ప్రవేశపెట్టబడినవి. సింధురాష్ట్రములో గోధుమలు, వడ్లు లేక ప్రత్తి పండించు భూములకు సగటు బజారుధరల ఆధారముపై మారునట్టి భూశిస్తు రేట్లను నిర్ణయించినారు.

(౨) హక్కులనిర్ణయము: (Record of Rights):—కొంతకాలముక్రింద భూస్వాముల మరియు కౌలుదార్ల హక్కులను నిర్ణయించుటకు ప్రభుత్వము తలపెట్టియుండెను. దానినాచరణలో బెట్టుచుండగానే పోలీసుచర్య జరిగినది. తమకు ఎట్టిహక్కు లేని భూములపై తమకు హక్కుకలదని కొంద

రువ్యక్తులు ఆందోళనచేయుచు, గ్రామములలో అశాంతి ప్రబలియున్న యీ రోజులలో హక్కులను నిర్ణయించవలసిన ముఖ్యఅవసర మేర్పడిన దని మేము నొక్కిచెప్పవలసిన అవసరములేదు.

(౩) నిర్బంధ లెవీ విధానముయొక్క భారము బీదరైతులపై యెక్కువగా పడుచున్నది. అది అమలులోనున్న పద్ధతి న్యాయసమ్మత ముగాలేదు.

ఆహారధాన్యములుకొని విక్రయించుటలో హైదరాబాద్ కో ఆప రేటివ్ కమర్షియల్ కార్పొరేషన్ నూటికి 50 వంతులు లాభము గడిం చుచున్నది. ఇదిచాలా ఎక్కువ. కార్పొరేషన్‌వారు ఉత్పత్తిదారులవద్ద సన్నబియ్యము పల్లా ఒక్కంటికి 40 రూపాయలచొప్పున కొని, ప్రజలకు 60 రూపాయలచొప్పున విక్రయించుచున్నారు. ఇట్టి ముఖ్య ఆహారధా న్యమును రైతులవద్దనుండి కొనుధరకు ప్రజలకు విక్రయించుధరకు ఇంత తారతమ్య ముండరాదు. దీనివలన చీకటివ్యాపారము అధికముకాగలదు. సంస్థానములో ఆహారధాన్యములు యీ విధముగా కొని విక్రయించుట వలన కార్పొరేషన్‌కు ఖర్చులుపోను సుమారు 20 లక్షల రూపాయల లాభము వచ్చుచున్నది. ఇది న్యాయసమ్మతము కాదు.

(౪) 1304 ఫసలీ (1894 క్రీ. శ.) ప్రాంతములో యేర్పాటుచేయ బడిన జమాబందీ నియమములు అతి పురాతనములైనవి. అందులో తీవ్ర మార్పులు చేయవలసియున్నది. మేముదిగువసూచనలు చేయుచున్నాము:-

(i) శాస్త్రబద్ధముగా పరిశోధనచేసి చెరువులక్రింది సాధారణ "ఆయాకట్టు" ను నిర్ణయించవలెను. చాలాకాలముక్రింద నిర్ణయించబడిన "ఆయాకట్టు" ప్రస్తుతమున్న నిజపరిస్థితికి సరిపోదు. ప్రతిసంవత్సరము సాధారణముగా సేద్యముచేయ బడు భూవిస్తీర్ణము పూర్వము నిర్ణయింపబడిన విస్తీర్ణ ములో సుమారు సగముమాత్రమే యుండును. చెరువులు బాగుచేయునపుడు కట్టయొక్కఎత్తు (F. T. L.) తగ్గించుట వలనను, చెరువులు మరియు కాలువలు మంచిస్థితిలో ఉంచ

బడకపోవుట వలనను చెరువులలో నీరు తక్కువఅయి "ఆయాకట్టు" క్రమముగా క్షీణించిపోయినది.

(ii) కుంటలక్రింది భూములపరిస్థితి మరీ అధ్వాన్నముగానున్నది. నాలుగయిదు సంవత్సరములలో నొకసారిమాత్రమే పరిమైన వ్యవధిలో యీ కుంటలలోనికి నీరువచ్చి తరీసేద్యము మంచిగానాగును. అందుచే నాలుగయిదుసంవత్సరములలో ఒక్కసంవత్సరము మాత్రమే వడ్లు పండించు అవకాశముండును. ఇతరసంవత్సరములలో యీ భూములు బీళ్లుగా నుండవలసినదే. సేద్యముచేయుటకు ప్రయత్నించినను ఎంతమాత్రము ఫలించవు ఇట్టిపరిస్థితులలో యీ భూములను తరీభూములుగా పరిగణించుటవలన రైతులు అనేక యిబ్బందులపాలు కావలసి వచ్చుచున్నది. సేద్యముచేయని సంవత్సరములలోను పంటలు చెడిపోయిన సంవత్సరములలోను "తలఫ్ మాల్" చేయించుకొనుటకు రైతులు పట్వారీలను గిర్దావర్లను తృప్తిపరచవలసి యుండును. క్రింది సూచనలను అమలులోపెట్టి యీ ఇబ్బందులను దూరముచేయవచ్చును.

సంపూర్ణముగా పరిశోధనచేసి చెరువులక్రింది "ఆయాకట్టు" మరల నిర్ణయించవలెను. (అ) మరల నిర్ణయించబడిన "ఆయాకట్టు" క్రిందికిరాని భూములు, (ఆ) కుంటల క్రింద సేద్యముచేయబడు భూములు ఖుష్కీభూములుగా పరిగణింప బడవలెను. అట్టిభూములపై ఖుష్కీధారా నిర్ణయించి తరీసేద్యము సాధ్యమైన సంవత్సరములలో ప్రత్యేకముగా నీటిపన్ను తీసుకొనవచ్చును. సూక్ష్మముగా చెప్పవలెనన్నచో శిస్తునిర్ణయ విధానమే మారవలెను. దీనివలన వ్యవసాయదారులు పట్వారీలమధ్య సంఘర్షణకు అవకాశముండదు. ఈ సూచనను అమలులో పెట్టుటవలన

ప్రభుత్వ ఆదాయములో ఎట్టితగ్గింపు కాదు. కొంతతగ్గింపు కలిగినను అది ఖుష్కీ-ధారా వసూలుచేయుటవలన పూర్తి చేసుకొనవచ్చును.

ప్రతిసంవత్సరము జమాబంది కాలములో రైతులు ఎదుర్కొనవలసివచ్చు యితర యిబ్బందులను సూక్ష్మముగా పరిశీలించవలెను. ఇది ఒక ప్రత్యేక విచారణరూపమును దాల్చవలెను.

హైదరాబాద్ ప్రభుత్వముచే కొంతకాలముక్రింద నియమించబడిన "తరీ రేటు సమితి" వారు ఒక ప్రశ్నావళి జారీచేసియుండిరి. ఆ ప్రశ్నావళిని, దాని ప్రత్యుత్తరములను పరిశీలించనగును.

(౫) ఆటవికశాఖ చిన్న ఉద్యోగులు అక్రమముగా ప్రవర్తించి లంచము లివ్వమని నిర్బంధించి రైతులను చాలాబాధించెదరు: (అ) అయోచితముగా భూమిని అడవిప్రాంతములో చేర్చుకొనుట, అడవికి అంటుకొనియున్న భూముల వ్యవసాయదారులను బాధించుట రైతులు ఎడతెగకుండా ఎదుర్కొనవలసిన యిబ్బందులు. (ఆ) పట్టేదారు (భూస్వామి) చట్టరీత్యా తన భూమిలోనున్న పొదలను, యితరచెట్లను నరికి భూమిని వ్యవసాయయోగ్యము చేసుకొనుహక్కు కలిగియున్నను, చిన్న ఉద్యోగి ఏదో ఒక నెపముమీద అన్యాయముగా వ్యవసాయమును నిరోధించును ఈ ఉద్యోగుల అక్రమము అవినీతి రైతులకు తలనొప్పిగా నున్నవి.

(౬) అబ్కారీ:— గ్రామస్థులు తమ భూములలోనున్న తాటిచెట్లను, తాటిఆకులను వ్యవసాయ అవసరములకొరకు వినియోగించుకొనకుండా అబ్కారీ అధికారులు అనేక ఆటంకములు కలిగించెదరు. దీనికి సంబంధించిన నియమములు వ్యవసాయదారులకు సహకరించునట్లు ఉదారముగా మార్చవలెను.

ప్ర. 99. వ్యవసాయోత్పత్తి అధికముచేయుటకు, కర్షకుల నైపుణ్యమును అభివృద్ధిచేయుటకు మీరెట్టి చర్యలను సూచించెదరు?

జ. 99. (అ) ఇదివరకుచేసిన సూచనలుకాక క్రింద పేర్కొనినవి గూడా ఆలోచింపనగును. సంస్థానములో ఎముకలు చాలా లభించినను

ఎరువుగా తయారుచేయుటకై అవి ఎగుమతి చేయబడుచున్నవి. ఎముకల పొడిని ఎరువుగా ఉపయోగించు ప్రాముఖ్యతను నొక్కి చెప్పవలసిన అవసరములేదు. ఎగుమతి తగ్గించి సంస్థానములోని ఎముకలను ఎరువుగా తయారుచేయుటకు సౌకర్యములు కలిగించవలెను.

(ఆ) వేరుశెనగపిండి:— వేరుశెనగపిండి మరియు పందిపెంట ఎగుమతి యగుటవలన సంస్థాన వ్యవసాయదారులకు సరియైన ఎరువులు లభించుటలేవు. అందువలన దీని ఎగుమతిని నిషేధించవలెను.

(ఇ) కంపోస్టుఎరువు (పెండ ఆకు అలములు కలిపి కొంతకాలము మురుగబెట్టి తయారుచేయు ఎరువు) ఉత్పత్తిచేసి రైతులకు సరఫరా చేయవలెను.

(ఈ) ప్రతి 10 గ్రామములలో ఒక ఎరువుసరఫరాచేయు కేంద్రముస్థాపించవలెను. ఎరువులు అధికముగా లభించినయెడల రైతులు తమ ఉత్పత్తిని కనీసము ప్రతిశతి 50 వరకు అధికము చేయగలరు.

(ఉ) ప్రభుత్వమువారు ప్రతితాలూకాకు ఒకటి రెండు ట్రాక్టర్లు (దున్నుయంత్రములు) యివ్వవలెను.

(ఊ) బండిపట్టాలు మరియు యితరవ్యవసాయ పనిముట్లకొరకు అవసరమైన యినుమును రైతులకు చౌకరేట్లపై విరివిగా సరఫరా చేయవలెను.

(ఎ) నిపుణులచే పరిశోధన; దాని ఆచరణ :— మాకు తెలిసినంతవరకు యీ విషయములో ఏమాత్రము పనిజరుగలేదు. పరిశోధన శాలలలోను, ప్రయోగించి ఫలితములుచూచు కేంద్రములలోను యేమైన సాధించబడినను, ఈ పరిశోధనా ఫలితములు గ్రామస్థులవరకు రాలేదు. వాని పర్యవసానములు వ్యవసాయదారులకు తెలియవు. సర్ జాన్ రసల్ చెప్పిన ప్రకారము భారతదేశములో ప్రయోగకేంద్రాలు వ్యవసాయదారుల మధ్య ఎడారి యున్నది. ప్రభుత్వ కార్యాలయములు మరియు వ్యవసాయదారులమధ్య గూడా ఇట్టి ఎడారి ఏర్పడు అపాయమున్నదని సర్ మణీ

లాల్ నానావతి చెప్పియున్నారు. ప్రయోగ కేంద్రములలో కనుగొనిన ఫలితములను వ్యవసాయదారులకు అందజేయుటకై ప్రతిసూబా (నాలుగు జిల్లాలు) లో నొక ప్రయోగకేంద్రము, ప్రతి తాలూకాలో నొక ప్రదర్శనకేంద్రము స్థాపించవలెనని మేము ప్రభుత్వమును కోరుచున్నాము.

ప్ర. 100. మంచివిత్తనములు, శాస్త్రీయమైన ఎరువులు, నూతన వ్యవసాయ పరికరములు ఎంతవరకు ఉపయోగించబడుచున్నవి? ఎవరైన పెద్దభూస్వాములు అభివృద్ధికరములైన పద్ధతులను ఉత్సాహముతో ప్రవేశపెట్టి యున్నారా?

జ. 100. మంచివిత్తనములు, శాస్త్రీయమైన ఎరువులు, నూతన వ్యవసాయ పరికరములు ఎక్కువగా ఆచరణలోనికి వచ్చుటలేవు. కొందరు పెద్ద వ్యవసాయదారులు మాత్రమే వానిని ఉపయోగించుచున్నారు. వారు కొన్ని ట్రాక్టర్లుగూడా ఉపయోగించుచున్నారు.

ప్ర. 101. చెరువులు, బావులు, కాలువలు మున్నగు జలాధారములు ఉపయుక్తముగా నుంచబడుచున్నవా? లేనిచో వానిని మంచిస్థితిలో నుంచుట కెట్టిమార్గములు అవలంబించవలెను?

జ. 101. చెరువులు మంచిస్థితిలో నుంచబడవు. పని ప్రారంభమైనను సకాలమునకు గండ్లువేయుదు. ఈ కార్యమును పబ్లిక్ వర్క్స్ (ఆబ్‌పాషీ) మరియు భూమ్యాదాయశాఖల అధికారులతో గూడిన ఒక కమెటీకి అప్పగించి, ప్రతిసంవత్సరము వ్యవసాయఋతువు సమీపించువరకు బాగుచేయుట పూర్తికావలెనని ఖచ్చితమైన ఉత్తరువులను జారీచేయవలెను. ప్రతిచోట కొందరు స్థానిక అనధికారసభ్యులను యీ కమెటీలో చేర్చవలెను. (నివేదిక చూడుడు.)

ప్ర. 102. వ్యవసాయకూలీల పరిస్థితి ఎట్లున్నది?

ప్ర. 103. వ్యవసాయకూలీల కూలి నగదురూపముగా ఇవ్వబడుచున్నదా లేక ధాన్యరూపముగా ఇవ్వబడుచున్నదా?

ప్ర. 104. క్రింది కూలీల కూలీరేటు ఎంత?

(i) తాత్కాలికముగా నియమించబడు (దినకూలీలు) వ్యవసాయకూలీలు;

(ii) వ్యవసాయబుతువులో మాత్రమే నియమించబడు (హంగామీ) కూలీలు.

ప్ర. 105. జీతగాండ్ర [పాలేర్ల] యొక్క పరిస్థితి, హక్కులు, ఇబ్బందులు ఏమి?

ప్ర. 107. జీతగాండ్ర మరియు వ్యవసాయకూలీల స్థితిగతులు బాగుచేయుటకు మీ రేమిసూచనలు చేసెదరు?

ప్ర. 108. ప్రభుత్వమువారు వ్యవసాయకూలీలకు కనీసపు కూలీరేటును నిర్ణయించవలెనా?

ప్ర. 110. వ్యవసాయ కూలీలకు ఇవ్వవలసిన కనీసపుకూలీ ఎంత యుండవలెనని మీరు అభిప్రాయ పడుచున్నారు?

జ. 102, 103, 104, 105, 107, 108, 110. వ్యవసాయ కూలీలను మూడు తరగతులలోనికి విభజించవలెను. దినకూలీలు, హంగామీ కూలీలు మరియు పాలేర్లు.

(అ) దినకూలీలను సాధారణముగా నాటువేయుట, కలుపుతీయుట, కోయుట మున్నగు పనులకొరకు కొద్దికాలమునకు మాత్రమే నియమించెదరు. పంట కోయుటతప్ప యితర అన్నిపనులకు వారలకు నగదుకూలీయే యివ్వబడును. నాటు వేయు స్త్రీలకు దినముఒకట్టింటికి 4 నుండి 10 అణాలవరకు కూలీల అవసరమునుబట్టి యిచ్చెదరు. వారు దినము 4 నుండి 6 గంటలకాలము పనిచేసెదరు. పురుషులకు దినము ఒక్కంటికి 12 అణాలనుండి ఒక రూపాయివరకు ఇచ్చెదరు.

(ఆ) హంగామీ కూలీలు మామూలుగా మూడునాలుగు నెలల కాలము ధాన్యపు వేతనముపై నియమించబడెదరు. వీరలకు నెల ఒక్కంటికి ఒకటినుండి ఒకటింబావు బస్తాల వడ్లు యిచ్చెదరు. దీనిని నగదులోనికి మార్చినచో నెలఒక్కంటికి 20 నుండి 25 రూపాయలు అగును.

కొంతకాలమునుండి దిన మరియు హంగామీ కూలీల పరిస్థితి బాగుపడినదని చెప్పవచ్చును. వారు చిన్న రైతుల [illegible] పరిస్థితిలో

న్నారు. కూలీలసంఖ్య మరియు రైతుల అవసరములనుబట్టి వారి కూలీ రేట్లు సరియైన ఆర్థికపరిమాణమునకు వచ్చుచున్నవి. పెద్ద చిన్న అను విభేదములేక అందరు వ్యవసాయదారులు యీ పరిమాణమును అవశ్యముగా గుర్తించవలసి వచ్చుచున్నది. కూలీల అవసరము అధికముగా నుండుటవలన కొన్నిసందర్భములలో వ్యవసాయపనులకు అవసరమైన కూలీలు లభించుట కష్టమగును. అయినను యీ కూలీలకు వ్యవసాయేతర కాలములలో పని ఉండకందున ఆ సమయములలో వారలకు యితరవృత్తులు కల్పించవలెను. అధికముగానున్న కూలీలకు ఉద్యోగము కలిగించుటకు కుటీర మరియు పెద్దపరిశ్రమలు స్థాపించవలెను.

(ఇ) పాలేర్లు మామూలుగా సంవత్సరముల తరబడి ఒకే వ్యవసాయదారునివద్ద పనిచేసెదరు. వారలకు సంవత్సరము ఒక్కటికి ఒక చెప్పులజోడు, గొంగడి, పొగాకు మరియు పెట్టుబడి (బోనస్) కాక 6 నుండి 7 పల్లాలధాన్యము ఇచ్చెదరు. దీనివెల సుమారు 225 రూపాయలుండును. వ్యవసాయపు పనులు నిర్ణీతమైన గంటలలో చేయుటకు వీలుండదుగాన వారు ఖచ్చితమైన నిబంధనల ప్రకారముగాని గంటలప్రకారముగాని పనిచేయరు. పాలేర్లు వ్యవసాయదారులు ఖచ్చితమైన నిబంధనలు యేర్పరచుకొని వానిననుసరించి పనిచేయరు. వ్యవసాయ అవసరములనుబట్టి పని నడిపించుకొనెదరు. నగదురూపముగా ప్రతిఫలము బడయు పాలేర్లు యిప్పుడు అధికవేతనము బడయుచున్నారు. ధాన్యరూపేణ ప్రతిఫలముబడయు పాలేర్లకు తక్కువ ఉత్పత్తిగల నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడెము మున్నగు తాలూకాలలోతప్ప యితరప్రదేశములలో నాలుగవవంతు అధికము చేయవలెను.

వ్యవసాయకూలీలు మరియు పాలేర్లహక్కులు, యిబ్బందులు పరిశీలించి కనీసవేతనములు తదితర నిబంధనలు నిర్ణయించుటకు ఒక కమెటీని స్థాపించవలెను. నిబంధనలు మున్నగునవి నిర్ణయించునపుడు వ్యవసాయముయొక్క ప్రత్యేక అవసరములను దృష్టిలో నుంచుకొనవలెను. లేనియెడల వ్యవసాయదారుల పాలేర్ల సంబంధాలు చెడిపోయి వ్యవసాయ

ఆర్థికవ్యవస్థయే తల్లకిందులగును. దినకూలీలయొక్క రేటు కాలముయొక్క ప్రాతిపదికపై కాక పని యూనిట్ల ప్రాతిపదికపై ఆధారపడి యుండవలెను. అనగా కూలీచేసిన దినములసంఖ్యగాక చేసినపనిని లెక్కవేయవలెను. కూలీలు సోమరులై దినముఒక్కంటికి 4 నుండి 6 గంటలకుమించి పనిచేయరు. పని యూనిట్లప్రకారము ప్రతిఫలమునిచ్చు పద్ధతి రష్యాలో గూడా అమలులోనున్నది. ఇట్లు చేసినచో సోమరిబోతులు, చురుకుగా పనిచేయువారు సమాన ప్రతిఫలము పొందరు.

వ్యవసాయపుధరలు నిర్ణయించకుండా కనీసపు కూలీరేట్లను నిర్ణయించుటవలన వ్యవసాయ ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్న మగునని మేము మరొకపర్యాయము చెప్పవలసి వచ్చుచున్నది. కూలీలకు (పాలేర్లు, హంగామీ జీతగాండ్రు, దినకూలీలు) ఉత్పత్తిలో నిర్ణయభాగము నివ్వవచ్చునని మేము సూచించుచున్నాము ఈ భాగము పంటనుబట్టి మారవలెను:—

నగదుపంటలుకాని ఖుష్కీపంటలు........మొత్తముపంటలో 3 వ భాగము.

నగదుపంటలు, తరీ మరియు బాగాయతుభూముల పంటలు...... మొత్తముపంటలో నాలుగవ భాగము.

పశుపోషణకై గడ్డి లేక చొప్ప వ్యవసాయదారునకే చెందవలెను.

ప్ర. 105. హైదరాబాద్ భగేలా (పాలేర్ల)ఒడంబడికచట్టం (9) 1353 ఫసలీ ఫలితముగా జీతగాండ్రస్థితి ఏమైన అభివృద్ధి చెందినదా?

జ. 106. ఈ చట్టముయొక్క ఫలితము శూన్యము. దీనిషరతులను ఆచరణలో పెట్టుట దుస్సాధ్యము. వ్యవసాయదారుల పాలేర్ల సంబంధములను ఖచ్చితమైన ఒడంబడికగా మార్చుటకు ప్రయత్నించు యే చట్టము గూడా పనిచేయజాలదు.

ప్ర. 109. వివిధతరగతులకు చెందిన వ్యవసాయ కూలీలందరకు ఒకే కూలీరేటును నిర్ణయించవలెనా? లేక ఒక్కొక్క తరగతివారికి ఒక్కొక్క రేటును నిర్ణయించవలెనా?

జ. 109. వ్యవసాయకూలీల వివిధతరగతులకు చాలా వ్యత్యాసమున్నది. అందుచే అన్నితరగతులవారికి ఒకేరేటు నిర్ణయించరాదు.

ప్ర. 111. వ్యవసాయకూలీలకు, భూస్వాములకు సామరస్యమును కుదుర్చుటకై ప్రభుత్వము ఏదైన పద్ధతిని ఏర్పాటు చేయవలెనా?

జ. 111. వ్యవసాయదారుల కూలీల సంబంధములు క్లిష్టరూపమును దాల్చలేదు. ప్రభుత్వమువారు సామరస్యము కుదుర్చు పద్ధతులు యేర్పాటుచేయు అవసరము లేదు. కాని ముందుపరిస్థితి యేవిధముగా నుండునో నమ్మకముగా చెప్పటకు వీలులేదు. అవసర మేర్పడినప్పుడు యీ సమస్యను గూర్చి ఆలోచించవచ్చును.

ప్ర. 112. వ్యవసాయమును ప్రజలకు అత్యవసరమైన పరిశ్రమగా నిర్ణయించి, సమ్మెలను, పరిశ్రమలు మూసివేయుటను (Lock out) నిషేధించవలెనా?

జ. 112. వ్యవసాయములో సమ్మెలు, మూసివేయుట ప్రవేశపెట్టబడినచో నది దుర్దినమగును. కాని అట్టిపరిస్థితు లేర్పడినచో వాటిని నిషేధించవలెను. గ్రామస్థుల మేలుకొరకు పనిచేయుచున్నామని చెప్పుకొనుచు నిజముగా వారిఓట్లను లాగుటకు ప్రయత్నించుచు కొన్ని రాజకీయపక్షాలచే దుష్టప్రచారము చేయబడుచున్న యీ సమయములో సమ్మెలు, మూసివేయుటను తోసి వేయుటకు వీలులేదు.

# అనుబంధము

నం. 1 నుండి 5 వరకు కొన్ని వ్యవసాయముల నగటుపంట మరియు వ్యవసాయపు ఖర్చులు తెలుపబడినవి.

గమనిక 1:- ఇచట తెలుపబడిన అంకెలు ఖర్చుల అంచనాలు మాత్రమే. చాలా కొద్దిమంది రైతులు తమ వ్యవసాయముల లెక్కలను వ్రాసెదరు. లెక్కలనువ్రాసినను వ్యవసాయపుఖర్చులను వేరుగా వ్రాసి దేనిపై ఎంతఖర్చు చేసినది తేల్చరు.

గమనిక 2 :- ఇచట తెలిపిన జోకు ఇంపీరియల్ మణుగులలో నున్నది.

చివర అనుబంధమునకు గమనిక :—

1. ఈ వ్యవసాయములు టూకీగా తీసుకొనబడినవి. అవి ఆయా తాలూకాల సాధారణ వ్యవసాయములను సూచించవు.
2. మొదటి రెండు వ్యవసాయములలోని వేరుశెనగపంట, మొదటి వ్యవసాయములోని పొగాకు, మిరపకాయలపంట మామూలుకన్న మించి యున్నవి.
3. చీడలు అధికమగుటవలన కొంతకాలమునుండి వేరుశెనగపంట తగ్గిపోవుచున్నది.
4. ప్రస్తుత నియమముల ననుసరించి సేద్యముచేసిన భూమిలో మూడవ భాగము మించి నగదుపంటలు వేయరాదు.
5. బాగాయతుభూములను సేద్యముచేయుటకు చాలా శ్రమపడవలసి యుండుటచే బాగాయత్ పంటలు కొద్దిగా వేయుదురు.

నం: 1. వరంగల్ జిల్లాలోని ఖమ్మం, మధిర తాలూ

| వివరములు | చెరువులక్రింది తరీభూమి — 2 ఎకరాల వరి — మొత్తముపంట — జోకు | | ఖర్చులు | ఖుష్కీభూమి — 8 ఎకరాలజొన్న — మొత్తముపంట — జోకు | ధర | ఖర్చులు | 4 ఎకరాల — మొత్తము — జోకు |
|---|---|---|---|---|---|---|---|
| | జోకు | ధర | | జోకు | ధర | | జోకు |
| | మ. | రూ. | రూ. | మ. | రూ. | రూ. | మ. |
| ఉత్పత్తి | 60 | 600 | .. | 36 | 400 | .. | 18 |
| 1. ఎరువు | .. | .. | 60 | .. | .. | .. | .. |
| 2. విత్తనములు | .. | .. | 20 | .. | .. | 10 | .. |
| 3. కట్టలుపోయుట | .. | .. | .. | .. | .. | .. | .. |
| 4. పాలేర్లు | .. | .. | 90 | .. | .. | 100 | .. |
| 5. పశువులధర | .. | .. | 50 | .. | .. | 100 | .. |
| 6. పశుపోషణ | .. | .. | .. | .. | .. | .. | .. |
| 7. నాటువేయుట | .. | .. | 50 | .. | .. | | .. |
| 8. కలుపుతీయుట | .. | .. | 10 | .. | .. | .. | .. |
| 9. కోయుట, కొట్టుట | .. | .. | 50 | .. | .. | .. | .. |
| 10. వడ్లకమ్మరి | .. | .. | 5 | .. | .. | .. | .. |
| 11. భూశిస్తు | .. | .. | 28 | .. | .. | 10 | .. |
| 12. పనిముట్లధర | .. | .. | 5 | .. | .. | .. | .. |
| మొత్తము | ... | 600 | 368 | ... | 400 | 220 | ... |
| ఎకరమునకు | ... | 300 | 184 | ... | 50 | 27/8 | ... |

## కాల సరిహద్దుపైనున్న ఒక వ్యవసాయపు లెక్కలు

| (చెల్కభూమి) | | | | | రేగడిభూమి | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పెసలు | | 4 ఎకరాల వేరుశెనగ | | | అరఎకరము పొగాకు | | | అర ఎ॥ మిరపకాయలు | | |
| పంట | ఖర్చు | మొత్తముపంట | | ఖర్చు | మొత్తముపంట | | ఖర్చు | మొత్తముపంట | | ఖర్చు |
| ధర | | జోకు | ధర | | జోకు | ధర | | జోకు | ధర | |
| రూ. | రూ. | మ. | రూ. | రూ. | మ. | రూ. | రూ. | మ. | రూ. | రూ. |
| 200 | .. | 48 | 800 | .. | 3 | 150 | .. | 3 | 150 | .. |
| .. | .. | .. | .. | .. | .. | .. | 25 | .. | .. | 25 |
| .. | 10 | .. | .. | 90 | .. | .. | 25 | .. | .. | 25 |
| .. | .. | .. | .. | .. | .. | .. | .. | .. | .. | .. |
| .. | 40 | .. | .. | 90 | ... | ... | 20 | ... | ... | 20 |
| .... | .... | .... | .... | 50 | .... | .... | .... | .... | ... | .... |
| .... | 25 | .... | .... | 50 | .... | .... | .... | .... | .... | .... |
| .... | .... | .... | .... | .... | .... | .... | 5 | .... | .... | 6 |
| .... | .... | .... | .... | .... | .... | .... | .... | .... | .... | .... |
| .... | .... | .... | .... | 120 | .... | .... | .... | .... | .... | .... |
| .... | 5 | .... | .... | .... | .... | .... | ... | .... | .... | .... |
| .... | 5 | .... | .... | 5 | .... | .... | 1 | .... | .... | .... |
| .... | 5 | .... | .... | .... | .... | .... | .... | .... | .... | .... |
| 200 | 90 | .... | 800 | 405 | .... | 150 | 76 | .... | 150 | 76 |
| 50 | 22/8 | ... | 200 | 101/4 | ... | 300 | 152 | ... | 300 | 152 |

నం. 2. వరంగల్ జిల్లా మానుకోట

| వివరములు | చెరువుల క్రింది తరీభూమి | | | ఖుష్కీ భూమి (చెల్క— | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | ఎకరము వరి | | | ఎకరము జొన్నలు లేక సజ్జలు | | | ఎకరము పెసలు | | |
| | మొత్తము పంట | | ఖర్చులు | మొత్తము పంట | | ఖర్చులు | మొత్తము పంట | | ఖర్చులు |
| | జోకు | ధర | | జోకు | ధర | | జోకు | ధర | |
| | మ. | రు. | రు.అ.పా. | మ. | రు. | రు.అ.పా. | మ. | రు. | రు.అ.పా. |
| ఉత్పత్తి | 27 | 270 | | 5 | 38/8 | | 3 | 30 | |
| 1 ఎరువు | | | 22 8 0 | | | | | | |
| 2 విత్తనములు | | | 13 8 0 | | | 1 4 0 | | | 2 12 0 |
| 3 కట్టలుపోయుట | | | | | | | | | |
| 4 పాలేర్లు | | | 35 8 0 | | | 13 8 0 | | | 11 2 0 |
| 5 పశువులకూలి | | | 9 0 0 | | | 6 12 0 | | | 4 8 0 |
| 6 పశుపోషణ | | | | | | | | | |
| 7 నాటువేయుట | | | 24 0 0 | | | | | | |
| 8 కలుపుతీయుట | | | 12 0 0 | | | 1 0 0 | | | |
| 9 కోయుట, కొట్టుట | | | | | | | | | |
| 10 వడ్లకమ్మరి | | | 2 0 0 | | | 2 8 0 | | | 2 8 0 |
| 11 అ. భూశిస్తు | | | 11 0 0 | | | 1 0 0 | | | 1 0 0 |
| ఆ. ఇతరపన్ను | | | | | | | | | |
| 12 పనిముట్లధర | | | 3 0 0 | | | 1 8 0 | | | 1 0 0 |
| ఎకరమునకు | | 270 | 133 8 0 | | 38/8 | 27 8 0 | | 30 | 22 14 0 |

## తాలూకాలో ఒక వ్యవసాయపులెక్కలు

| భూమి) | | | [illegible] | బాగాయత్ భూమి | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎకరమూ శేరుశెనగ | | | | ఎకరము పొగాకు | | | ఎకరము మిరపకాయలు | | |
| మొత్తము పంట | | ఖర్చులు | | మొత్తము పంట | | ఖర్చులు | మొత్తము పంట | | ఖర్చులు |
| జోకు | ధర | | | జోకు | ధర | | జోకు | ధర | |
| మ | రు. | రు. అ. పా. | | మ | రూ | రు-అ-పా | మ | రూ | రు-అ-పా |
| 12 | 200 | | | 12 | 960 | | 12 | 600 | |
| | | | | | | 20 0 0 | | | 20 0 0 |
| | | 30 0 0 | | | | 20 0 0 | | | 10 0 0 |
| | | | | | | 15 0 0 | | | 10 0 0 |
| | | 23 4 0 | | | | 101 4 0 | | | 67 8 0 |
| | | 9 0 0 | | | | 45 0 0 | | | 30 0 0 |
| | | | | | | 5 0 0 | | | 5 0 0 |
| | | 8 0 0 | | | | 10 0 0 | | | 10 0 0 |
| | | 15 0 0 | | | | | | | |
| | | 2 8 0 | | | | 5 8 8 | | | 5 8 0 |
| | | 1 0 0 | | | | 3 0 0 | | | 3 0 0 |
| | | | | | | 280 0 0 | | | |
| | | 1 0 0 | | | | 15 0 0 | | | 19 0 0 |
| | 200 | 89 12 0 | | | 960 | 519 12 0 | | 600 | 180 0 0 |

## నం : 3. వరంగల్ జిల్లా పాఖాల తాలూకా

| వివరములు | చెరువుల క్రింది తరి భూమి — ఎకరము వరి — మొత్తము పంట: జోకు | మొత్తము పంట: ధర | ఖర్చులు | ఖుష్కీ భూమి — ఎకరము జొన్న లేక సజ్జ — మొత్తము పంట: జోకు | మొత్తము పంట: ధర | ఖర్చులు |
|---|---|---|---|---|---|---|
| | మ | రూ | రు-అ-పా | మ | రు-అ-పా | రు-అ-పా |
| ఉత్పత్తి | 21 | 203 | | 4 | 37 5 4 | |
| 1 ఎరువు | | | 13 1 0 | | | |
| 2 విత్తనములు | | | 13 1 0 | | | 1 8 0 |
| 3 కట్టలుపోయుట | | | | | | |
| 4 పాలేర్లు | | | 38 10 0 | | | 26 0 0 |
| 5 పశువుల వెల | | | 9 0 0 | | | 3 0 0 |
| 6 పశుపోషణ | | | | | | |
| 7 నాటువేయుట | | | 20 0 0 | | | |
| 8 కలుపుతీయుట | | | 10 0 0 | | | |
| 9 కోయుట, కొట్టుట | | | | | | |
| 10 వడ్లకమ్మరి | | | 1 8 0 | | | 1 8 0 |
| 11 భూశిస్తు | | | 11 0 0 | | | 1 0 0 |
| 12 పనిముట్ల ధర | | | 3 0 0 | | | 1 8 0 |
| ఎకరమునకు | | 203 | 119 4 0 | | 37 5 4 | 34 8 0 |

లోని ఒక వ్యవసాయపులెక్కలు

| (చెల్కభూమి) | | | | | | రేగడిభూమి | | బాగాయతుభూమి | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎకరము పెసలు | | | ఎకరము మొక్కజొన్న | | | | | | | |
| మొత్తముపంట | | ఖర్చులు | మొత్తంపంట | | ఖర్చులు | శనగ | మిరప కాయలు | శనగ | మిరప కాయలు | మొక్క జొన్న |
| జోకు | ధర | | జోకు, | ధర | | | | | | |
| మ | రూ | రు-అ-పా | మ | రు-అ-పా | రు-అ-పా | | | | | |
| | | | 8 | 66 10 0 | | | | | | |
| | | | | | 1 8 0 | | | | | |
| | | | | | 21 12 0 | | | | | |
| | | | | | 3 0 0 | | | | | |
| | | | | | 13 0 0 | | | | | |
| | | | | | 1 8 0 | | | | | |
| | | | | | 1 0 0 | | | | | |
| | | | | | 1 8 0 | | | | | |
| | | | | 66 10 0 | 43 4 0 | | | | | |

## నం. 4. నల్లగొండజిల్లా దేవరకొండ, మిర్యాలగూడెం

| వివరములు | చెరువులక్రింది ఆరిభూమి | | | ఖుష్కీ— | | | |
|---|---|---|---|---|---|---|---|
| | ఎకరము వరి | | | ౬ ఎ॥ జొన్న లేక సజ్జ | | | ౬ ఎక |
| | మొత్తముపంట | | ఖర్చులు | మొత్తముపంట | | ఖర్చులు | మొత్తం |
| | జోకు | ధర | | జోకు | ధర | | జోకు |
| | మ | రూ | రు అ పా | మ | రూ | రు అ పా | మ |
| ఉత్పత్తి | 18 | 144 | | 12 | 96 | | 12 |
| 1 వివిధములు | | | | | 18 | | |
| 2 గడ్డిమోపులు | 40 | 40 | | | 12 | | |
| 3 ఎరువు | | | 10 8 0 | | | 3 8 0 | |
| 4 విత్తనములు | | | 10 0 0 | | | 6 0 0 | |
| 5 పాలేర్లు | | | 15 0 0<br>2 8 0 | | | 60 0 0 | |
| 6 పశువులధర పోషణ | | | 13 5 4<br>15 0 0 | | | 25 0 0 | |
| 7 నాటువేయుట | | | 10 0 0 | | | | |
| 8 కలుపుతీయుట | | | 4 0 0 | | | 6 0 0 | |
| 9 కోయుట, కొట్టుట | | | 14 0 0 | | | 12 0 0 | |
| 10 వడ్లకమ్మరి | | | 2 0 0 | | | 1 4 0 | |
| 11 భూశిస్తు | | | 12 0 0 | | | | |
| 12 పనిముట్లు | | | 2 0 0 | | | 2 0 0 | |
| మొత్తం | | 184 | 110 5 4 | | 126 | 115 12 0 | |
| ఎకరమునకు | | 184 | 110 5 4 | | 21 | 19 4 8 | |

తాలూకాల సరిహద్దుపైనున్న ఒక వ్యవసాయపులెక్కలు.

| భూమి (చెల్క-భూమి) | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| రాలు ఆముదాలు | | 4 ఎకరాలు కొఱ్ఱలు | | | 2 ఎకరాల శెనగలు | | | [illegible] |
| పంట | ఖర్చులు | మొత్తముపంట | | ఖర్చులు | మొత్తముపంట | | ఖర్చులు | |
| ధర | | జోకు | ధర | | జోకు | ధర | | |
| రూ | రు.అ.పా. | మ. | రూ | రు.అ.పా. | మ. | రు.అ.పా. | రు.అ.పా. | |
| 240 | | 8 | 48 | | 1⅓ | 15 0 0 | | |
| 18 | | | 12 | | | 6 0 0 | | |
| | | | 12 | | | | | |
| | 14 0 0 | | | 3 8 0 | | | | |
| | 10 0 0 | | | 6 0 0 | | | 5 0 0 | |
| | 60 0 0 | | | 40 0 0 | | | 20 0 0 | |
| | 25 0 0 | | | 20 0 0 | | | 10 0 0 | |
| | 6 0 0 | | | 4 0 0 | | | 2 0 0 | |
| | 12 0 0 | | | 8 0 0 | | | 4 0 0 | |
| | 1 4 0 | | | 1 4 0 | | | 1 4 0 | |
| | 8 0 0 | | | 4 0 0 | | | 2 0 0 | |
| 258 | 136 4 0 | | 72 | 86 12 0 | | 21 0 0 | 44 4 0 | |
| 43 | 22 11 4 | | 18 | 21 11 0 | | 10 8 0 | 22 2 0 | |

### నం. 5. నల్లగొండజిల్లా జనగామ

| వివరములు | చెరువులక్రింది తరిభూమి | | | ఖుష్కీభూమి (చెల్కాభూమి) | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | ఎకరము వరి | | | ఎకరము జొన్న లేక సజ్జ | | | ఎకరము పెనలు | | | ఎకరము వేరుశెనగ | | |
| | మొత్తం పంట | | ఖర్చు | మొత్తము పంట | | ఖర్చు | మొత్తము పంట | | ఖర్చు | మొత్తం పంట | | ఖర్చు |
| | మణుగు | ధర | | మణుగు | ధర | | మణుగు | ధర | | మణుగు | ధర | |
| | మ. | రు. | రు. | మ. | రు. | రు. | మ. | రు. | రు. | మ. | రు. | రు. |
| ఉత్పత్తి | 24 | 240 | | 3 | 25 | | $2\frac{1}{2}$ | 30 | | 6 | 100 | |
| 1 ఎరువు | | | 36 | | | | | | | | | |
| 2 విత్తనములు | | | 12 | | | 2 | | | 2 | | | 17 |
| 3 కట్టలుపోయుట | | | 4 | | | | | | | | | |
| 4 పాలేర్లు | | | 16 | | | 10 | | | 9 | | | 8 |
| 5 పశువులధర | | | 10 | | | | | | | | | |
| 6 పశుపోషణ | | | 4 | | | 4 | | | 4 | | | 4 |
| 7 నాటువేయుట | | | 15 | | | | | | | | | |
| 8 కలుపుతీయుట | | | 8 | | | | | | | | | 5 |
| 9 కోయుట, కొట్టుట | | | 30 | | | | | | | | | 14 |
| 10 వడ్లకమ్మరి | | | 2 | | | 1 | | | 1 | | | 2 |
| 11 పనిముట్లధర | | | 2 | | | 1 | | | 1 | | | 1 |
| ఎకరమునకు | | 240 | 153 | | 25 | 19 | | 30 | 18 | | 100 | 52 |

తాలూకాలోని ఒక వ్యవసాయపులెక్కలు.

| రేగడిభూమి | | | | | | బాగాయతుభూమి | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎకరము పొగాకు | | | ఎకరము మిరపకాయలు | | | ఎకరము పొగాకు | | | ఎకరము మిరపకాయలు | | | ఎకరము మొక్కజొన్న | | | |
| మొత్తం పంట | | | మొత్తం పంట | | | మొత్తం పంట | | | మొత్తం పంట | | | మొత్తం పంట | | | |
| మణుగు | వెల | ఖర్చు | మణుగు | వెల | ఖర్చు | మణుగు | వెల | ఖర్చు | మణుగు | వెల | ఖర్చు | మణుగు | వెల | ఖర్చులు | |
| మ. | రు. | రు. | మ. | రు. | రు. | మ. | రు. | రు. | మ. | రు. | రు. | మ. | రు. | రు.అ. | |
| 6 | 150 | | 3 | 100 | | 12 | 400 | | 6 | 300 | | 16 | 160 | | |
| | | | | | | | | 25 | | | 25 | | | | |
| | | 10 | | | 5 | | | 10 | | | 10 | | | 2 8 0 | |
| | | 8 | | | 8 | | | 26 | | | 26 | | | 16 0 0 | |
| | | 4 | | | 4 | | | 4 | | | 4 | | | 4 0 0 | |
| | | 5 | | | 5 | | | 25 | | | 8 | | | 8 0 0 | |
| | | 10 | | | | | | | | | | | | | |
| | | 2 | | | 2 | | | 2 | | | 2 | | | 2 0 0 | |
| | | 2 | | | 2 | | | 2 | | | 2 | | | 2 0 0 | |
| | 150 | 43 | | 100 | 28 | | 400 | 98 | | 300 | 81 | | 160 | 38 8 | |

## వివిధపంటలకు వివిధ వ్యవసాయములలో పరిస్థితి

| వరుస సంఖ్య | తాలూకా పేరు | చెరువుల క్రింద తరీభూమి | ఖుష్కీ భూమి (చెల్కభూమి) | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | వరి | జొన్న లేక సజ్జ | మొక్కజొన్న | పెసలు | శెనగలు | కొఱ్ఱలు |
| | | రు.అ.పా. | రు.అ.పా | రు.అ. | రు.అ. | రు.అ. | రు.అ. |
| 1. | ఖమ్మం, మధిర తాలూకాల సరిహద్దుపై | 116 0 0 | 22 8 0 | | 27 8 | | |
| 2 | మహబూబ్ ఆబాద్ | 131 8 0 | 11 0 0 | | 7 2 | | |
| 3 | పాఖాల | 83 12 0 | 2 13 4 | 23 6 | | | |
| 4 | మిర్యాలగూడెం దేవరకొండ తాలూకాల సరిహద్దుపై | 73 10 8 | 1 11 4 | | | 11 10† | 3 11† |
| 5 | జనగామ | 87 0 0 | 6 0 0 | | 12 0 | | |

† ఈ గుర్తు నష్టమును సూచించును. నష్టమును భరించుచు యీ వ్యవసాయదారుడు తన అవసరములు పూర్తి చేసుకొనుటకై యీ పైరులు వేయకతప్పదు. ఈ ప్రాంతాలలో యీ ధాన్యాలు సరియైన ధరలకు లభించవు.

రేట్ల ననుసరించి ఎకరముఒక్కంటికి సగటు ఆదాయము.

| | | రేగడి భూమి | | బాగాయత్ భూములు | | |
|---|---|---|---|---|---|---|
| వేరుశెనగ | ఆముదాలు | పొగాకు | మిరపకాయలు | పొగాకు | మిరపకాయలు | మొక్కజొన్నలు |
| రు.అ. | రు.అ.పా. | రు. | రు. | రు. అ. | రు. | రు. అ. |
| 88 12 | | 148 | 148 | | | |
| 110 4 | | | | 440 0 | 420 | |
| | 20 4 8 | | | | | |
| 48 0 | | 107 | 72 | 302 0 | 219 | 121 8 |

శ్రీ వాణీ ముద్రణాలయము,
సుల్తాన్ బజార్
హైదరాబాద్-౧.